


www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక





Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
హైదరాబాద్ | 16 శుక్రవారం | మే 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 241
Navabhoomi daily fallows..
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur

# యాపిల్ రగడ!

- భారత్‌లో ఐఫోన్ల తయారీ వద్దన్న ట్రంప్.. అయినా తగ్గేదే లేదన్న యాపిల్!
- భారత్‌లో ఐఫోన్ల తయారీపై యాపిల్ సంస్థకు ట్రంప్ కీలక సూచన
- ట్రంప్ వ్యాఖ్యలతో సంబంధం లేకుండా భారత్‌లో పెట్టుబడులు కొనసాగిస్తామన్న యాపిల్
- భారత్‌లో తయారీ పరిశ్రమ యాపిల్‌కు ఎంతో లాభదాయకమని ప్రభుత్వ వర్గాల వెల్లడి
- అమెరికాకు వెళ్లే ఐఫోన్లలో ఎక్కువ భాగం భారత్‌లోనే తయారు చేయాలని యాపిల్ ప్రణాళిక
- "మేక్ ఇన్ ఇండియా"కు ఊతమిస్తున్న యాపిల్ ఉత్పత్తి విస్తరణ

2




**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**
భారత్‌లో ఐఫోన్ల తయారీని చేపట్టవద్దని అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యాపిల్ సంస్థ సీఈఓ టిమ్ కుక్‌కు సూచించినప్పటికీ, టెక్ దిగ్గజం మాత్రం తన ప్రణాళికల నుంచి వెనక్కి తగ్గేలా కనిపించడం లేదు. భారత్‌లో ఉత్పత్తిని విస్తరించడం ద్వారా యాపిల్‌కు గణనీయమైన ప్రయోజనాలు ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. భారత్‌లో తయారీ రంగం అంతర్జాతీయ స్మార్ట్‌ఫోన్ కంపెనీలకు అనుకూలంగా ఉందని, ఇక్కడ ఉత్పత్తి చేయడం ద్వారా యాపిల్ వంటి సంస్థలు పోటీతత్వాన్ని అందిపుచ్చుకోవచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. అమెరికాలో విక్రయించే ఐఫోన్లలో అధిక శాతం జూన్ త్రైమాసికం నుంచి "మేడ్ ఇన్ ఇండియా" ట్యాగ్‌తో ఉంటాయని యాపిల్ ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో, ఈ ప్రయోజనాలను కంపెనీ గుర్తించాలని వారు సూచించారు. "కంపెనీల పెట్టుబడి నిర్ణయాలు వారి పోటీతత్వంపైనే ఆధారపడి ఉంటాయి" అని

# కేసీఆర్ ఫ్యామిలీ టూర్

- అమెరికాకు కేసీఆర్ కుటుంబం పయనం
- ఆకస్మాత్తుగా పయనం వెనుక కేసీఆర్ ఆరోగ్యసమస్య?
- ఆమెరికాకు కేసీఆర్ ..నాయకత్వ సమస్య
- కేటీఆర్‌కు అప్పగిస్తే..తనకు అభ్యంతరం లేదన్న హరీశ్
- నేడు కవిత నార్త్ కరోలినాకు పయనం
- 26న డల్లాస్‌కు వెళ్లనున్న కేటీఆర్
- కేసీఆర్,ఆయన సతీమణి వెళ్లే తేదీ సందిగ్ధం





**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**
తెలంగాణ రాజకీయాల్లో చోటు చేసుకుంటున్న పరిణామాలు ఆసక్తిని రేపుతున్నాయి. తాజాగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు నివాసానికి ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెళ్లారు. కోకాపేటలో ఉన్న హరీశ్ రావు నివాసానికి వెళ్లిన కేటీఆర్ అక్కడ హరీశ్ రావు తండ్రి ఆరోగ్య పరిస్థితి గురించి కేటీఆర్ అడిగి తెలుసుకున్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న హరీశ్ రావు తండ్రి ఇటీవల ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయి ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో హరీశ్ రావు ఇంటికి వచ్చిన కేటీఆర్ అక్కడ సుమారు 2 గంటల పాటు హరీశ్ రావుతో సమావేశమయ్యారు. ఈ సుదీర్ఘ భేటీలో రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలు, బీఆర్ఎస్ భవిష్యత్ కార్యాచరణ, ప్రస్తుత పరిస్తితులపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది. ఇటీవల హరీశ్ రావుపై రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. దీంతో మా పార్టీలో ఎలాంటి విభేదాలు లేవని హరీశ్ రావు మీడియా ముందుకు వచ్చి వివరణ ఇచ్చారు. ఈ క్రమంలో పార్టీ పగ్గాలు కేటీఆర్‌కు అప్పగిస్తూ కేసీఆర్ నిర్ణయం తీసుకుంటే దానిని స్వాగతిస్తానని ఇటీవలే హరీశ్ రావు వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ఇరువురు భేటీ కావడం రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారుతోంది.
ఇదిలా ఉంటే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అమెరికాకు ప్రయాణమై వెళ్ళనున్నారు. ఇటువంటి సమయంలో కేటీఆర్, హరీశ్ రావు భేటీ కావడం పార్టీ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

# వంశీ విడుదల ఇప్పట్లో లేనట్లే!?

- రిమాండ్ ఖైదీగా ఉన్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే
- వల్లభనేని వంశీకి షాకుల మీద షాకులు
- బెయిల్ వచ్చినా కనిపించని జైలు నుంచి విడుదలయ్యే పరిస్థితులు
- వల్లభనేని వంశీకి పీటీ వారెంట్ జారీ చేసిన పోలీసులు

2



**విజయవాడ-నవభూమిబ్యూరో**
ఊహించని షాకిచ్చిన పోలీసులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో కీలక నేతగా ఉన్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని కిడ్నాప్ కేసులో పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే.మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీపై కూటమి ప్రభుత్వ పెద్దల ఆగ్రహం ఇంకా చల్లారలేదా? అంటే అవుననే సమాధానం వస్తోంది. ఇప్పటికే 90 రోజులకు పైగా రిమాండు ఖైదీగా జైలులో ఉన్న వంశీని మరికొన్నాళ్లు నిర్బంధంలోనే ఉంచే పరిస్థితులు కనిపిస్తున్నాయి. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఆయనకు నేడో రేపో బెయిలు వస్తుందని అనుకుంటున్న సమయంలో పోలీసులు మరో కేసు బయటకు తీశారు. హనుమాన్ జంక్షన్ పోలీసుస్టేషను పరిధిలో నమోదైన కేసులో ఆయనను అదుపులోకి తీసుకునేందుకు పీటీ వారెంటు దాఖలు చేశారు. దీనిని న్యాయస్థానం అనుమతిస్తే వంశీకి బెయిల్ వచ్చినా ఈ కేసులో మళ్లీ జైలుకు వెళ్లే పరిస్థితులు కని పిస్తున్నా యి. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో కీలక నేతగా ఉన్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని కిడ్నాప్ కేసులో పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 13న హైదరాబాదులో ఆయనను అదుపులోకి తీసుకున్న పోలీసులు ఆ తర్వాత వరుస కేసులు తెరపైకి తెచ్చి మాజీ ఎమ్మెల్యేను రిమాండ్ పై రిమాండ్ విధించేలా వ్యవహరించారని చెబుతున్నారు. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసుతోపాటు ఫిర్యాదుదారు సత్యవర్ధన

# సైబర్ నేరాల జోరు

- ★ సైబర్ నేరగాళ్లకు అడ్డాగా మారిన హైదరాబాద్
- ★ ఏకంగా 70 వేల సైబర్ క్రైమ్ కేసులు ఇక్కడ నమోదు
- ★ అమాయక ప్రజలను మోసం చేయడానికి కొత్త కొత్త దారులు వెతుకుతున్న సైబర్ నేరగాళ్లు
- ★ నేరగాళ్లకు బ్యాంకు సిబ్బంది సహకారం?

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:**మన హైదరాబాద్ నగరం సైబర్ నేరగాళ్లకు అడ్డాగా మారుతోందా ? గత ఏడాదిన్నరగా నమోదైన కేసుల సంఖ్య చూస్తే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఏకంగా 70 వేల సైబర్ క్రైమ్ కేసులు ఇక్కడ నమోదు కావడం నిజంగా ఆందోళన కలిగించే విషయం. సైబర్ నేరగాళు అమాయక ప్రజలను మోసం చేయడానికి కొత్త కొత్త దారులు వెతుకుతున్నారు. తెలిస్తే షాకయ్యే విషయం ఏంటంటే, వీళ్ల ప్రైవేట్ బ్యాంకుల్లో పనిచేసే కొంతమంది సిబ్బందితో చేతులు కలిపారట. పోలీసులు దర్యాప్తులో తేలిన విషయాల ప్రకారం.. ఈ మోసాల్లో బ్యాంకు ఉద్యోగులకు కూడా వాటా ఉందట. అమాయకుల అకౌంట్ల వివరాలు, వాటి నుంచి కొట్టేసిన డబ్బును విదేశాలకు తరలించడంలో ఈ బ్యాంకు సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని గుర్తించారు. దీనికి బదులుగా నేరగాళ్లు ఆ ఉద్యోగులకు 5 నుంచి 10 శాతం వరకు కమీషన్ ఇస్తున్నట్లు పోలీసులు కనుగొన్నారు. అంటే, బ్యాంకుల్లో పనిచేసే కొంతమంది స్వార్థపరులు డబ్బు కోసం కక్కుర్తి పడి, నేరగాళ్లతో కలిసి అమాయక ప్రజల హైదరాబాద్‌లో సైబర్ నేరాలు ఇంతలా పెరగడానికి కొన్ని ముఖ్యమైన కారణాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. మన నగరం ఐటీ హబ్‌గా అభివృద్ధి చెందడం ఒక కారణం. ఇక్కడ చాలామంది ఉన్నత విద్యావంతులు, టెక్నాలజీ గురించి బాగా తెలిసినవాళ్లు ఉండడంతో సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త ట్రిక్కులతో వాళ్లను టార్గెట్ చేస్తున్నారు. అలాగే, ఇక్కడ చాలా పెద్ద సంఖ్యలో సంపన్నులు కూడా ఉండటం సైబర్ నేరగాళ్లకు మరింత ఆకర్షణీయంగా మారింది. జార్కండ్‌లోని జామ్‌తారా లాంటి ప్రాంతాల నుంచి వచ్చే సాధారణ నేరగాళ్ల నుంచి మొదలుకొని, బాగా చదువుకున్న, టెక్నాలజీ తెలిసిన మోసగాళ్ల వరకు అందరూ హైదరాబాద్‌ను తమ టార్గెట్‌గా ఎంచుకుంటున్నారు.గతంలో జరిగిన కొన్ని దర్యాప్తుల్లో బ్యాంకు ఉద్యోగులు మోసగాళ్లకు ఎలా సహకరిస్తున్నారో కూడా వెల్లడైంది. కొందరు బ్యాంకు సిబ్బంది డబ్బు కోసం కక్కుర్తి పడి, నకిలీ అకౌంట్లు తెరవడానికి సహకరించడం, పెద్ద మొత్తంలో డబ్బు ట్రాన్స్‌ఫర్ చేయడానికి సహకరించడం వంటి పనులు చేస్తున్నారు. దీనివల్ల నేరగాళ్లను పట్టుకోవడం పోలీసులకు చాలా కష్టంగా

# మళ్లీ కోవిడ్

- ◆ కోవిడ్-19 ఆసియాలో మళ్లీ అలజడి
- ◆ హాంకాంగ్, సింగపూర్‌లో కొవిడ్ వ్యాప్తి
- ◆ హాంకాంగ్‌లో ఈ వారంలో కరోనా వైరస్ వ్యాప్తి
- ◆ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించిన ఆరోగ్యశాఖ



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో:** ఐదేళ్ల క్రితం యావత్ ప్రపంచాన్ని గడగడలాడించిన కొవిడ్-19 ఆసియాలో మళ్లీ అలజడి రేపుతోంది. జనసాంద్రత ఎక్కువగా ఉండే హాంకాంగ్, సింగపూర్‌లలో కొవిడ్ కేసులు పెరుగుతున్నాయని ఆరోగ్యశాఖ అధికారులు హెచ్చరించారు. ముఖ్యంగా హాంకాంగ్‌లో ఈ వారం లో కరోనా వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉందని స్థానిక ఆరోగ్యశాఖ అధికారి ఒకరు వెల్లడించారు.
ఈ నెల 3 నుంచి ఇక్కడ కొవిడ్ పాజిటివ్ కేసుల తీవ్రత పెరిగిందని, అలాగే కొన్ని మరణాలు కూడా నమోదయ్యాయని ఆయన పేర్కొన్నారు. మరోవైపు సింగపూర్‌లో కూడా కొవిడ్ అలజడి కనిపిస్తోంది. ఈ నెల 3వ తేదీ తర్వాత ఏడు రోజుల్లోనే కేసుల సంఖ్య దాదాపు 28 శాతం పెరిగిందని స్థానిక ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

# స్వార్థంతోనే టర్కీ సాయం

- పాక్‌కు సైనిక సాయం చేసిన టర్కీ
- డ్రోన్లు,క్షిపణులతో సహా సైనిక సాయం
- భారత్-పాక్ యుద్ధంలో పాక్‌కు టర్కీ మద్దతు
- టర్కీ మద్దతు వెనుక భారీ వ్యూహం
- టర్కీని ఇస్లామిక్ ఆధిపత్యశక్తిగా నిలిపే యత్నం

2




**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో:**స్వార్థంతోనే పాక్‌కు టర్కీ సాయం.. దీనివెనుక పెద్ద స్కెచ్ ఇండియా వర్సెస్ పాకిస్తాన్ వార్‌లో టర్కీ పాకిస్తాన్‌కు గణనీయమైన మద్దతును ప్రకటించింది, ఇందులో డ్రోన్లు , క్షిపణులతో సహా సైనిక సాయం అందజేసింది. ఇండియా వర్సెస్ పాకిస్తాన్ వార్‌లో టర్కీ పాకిస్తాన్‌కు గణనీయమైన మద్దతును ప్రకటించింది, ఇందులో డ్రోన్లు , క్షిపణులతో సహా సైనిక సాయం అందజేసింది. భవిష్యత్తులో కూడా సహాయం కొనసాగిస్తామని హామీ ఇచ్చింది. టర్కీకి, భారతదేశానికి మధ్య సంఘర్షణ చరిత్ర లేనందున ఈ చర్య చాలా మందికి ఆశ్చర్యం కలిగించింది. ఈ గుణపాఠంతో ఇప్పుడు అందరూ 'బాయ్ కాట్ టర్కీ' అంటూ నినదిస్తున్నారు. టర్కీ ఉద్దేశాలు భారతదేశం పట్ల ద్వేషంతోనే పాతుకుపోలేదు. పాకిస్తాన్ ప్రేమ కాదు.. అంతకుమించిన స్వార్థం ఉందని తెలిసింది. స్వార్థంతో కూడిన "మాస్టర్ ప్లాన్" ను టర్కీ చేసిందని చెబుతున్నారు. ఇస్లామిక్ దేశమైన టర్కీకి అధ్యక్షుడు ఎర్డోగాన్ నాయకత్వం వహిస్తున్నారు. ఇస్లామిక్ ప్రపంచానికి నాయకత్వం వహించాలనే ఆశయాలు ఆయనకు ఉన్నట్లు అర్థమవుతోంది.. ఇస్లామిక్ దేశాలలో టర్కీని ఆధిపత్య శక్తిగా నిలబెట్టడానికి ఆయన ఆసక్తి చూపుతున్నట్లు కనిపిస్తోంది. ఈ

# జమిలి బాబు సిద్ధం

- జమిలి ఎన్నికలపై బాబుకు ఉప్పందినట్లు ప్రచారం
- ఆపరేషన్ సిందూర్ తర్వాత మోదీ ఇమేజ్ పెరిగిందన్న భావన
- అందుకే బీజేపీ నాయకత్వం ముందస్తుగా జమిలి ఎన్నికలకు రెడీ
- దీంతో జమిలికి టీడీపీ పార్టీని సిద్ధం చేస్తున్న చంద్రబాబు

2



**అమరావతి-నవభూమిబ్యూరో:**జమిలి ఎన్నికలు అని 2014 నుంచి 2019 మధ్యలో ఒక భయంకరమైన ప్రచారం సాగింది. ఆ మీదట 2019 నుంచి 2024 మధ్య సాగింది. అయితే ఆ రెండు టెర్ములూ అవి పూర్తిగా గాలి వార్తలు అని తేలిపోయింది. కానీ 2024 నుంచి 2029 మధ్యలో జమిలి ఎన్నికలు వస్తాయని మళ్ళీ ప్రచారం మొదలైంది. మోడీకి ఇది ప్రధానిగా మూడవ టెర్మ్. కానీ ముచ్చటగా మూడోసారి మొదలైన ఈ ప్రచారం అచ్చంగా నిజం అవుతుంది అని అంటున్నారు. ఢిల్లీ వర్గాల కబురు అయితే జమిలికి రంగం సిద్ధం అయింది. ఆపరేషన్ సిందూర్ సాక్షిగా బలమైన బీజం పడింది అని అంటున్నారు. పాకిస్థా ని ఆపరేషన్ సిందూర్ తో పీచమణచిన మోడీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం నిండా అయిదేళ్ల మిత్రుల మీద ఆధారపడి కేంద్రంలో అధికారం వెళ్ళదీయాలని అనుకోవడంలేదుట. ఆపరేషన్ సిందూర్ తో పాకిస్థాన్ కి కోలుకోలేని దెబ్బ తీసిన మోడీకి అపరిమితమైన ఇమేజ్ వచ్చిందని బీజేపీ పెద్దలు లెక్క వేస్తున్నారు. దానిని రాజకీయంగా సొమ్ము చేసుకోవడానికి వాడవాడలా దేశంతా తిరంగా ర్యాలీలు నిర్వహిస్తున్నారు. వీటిని రాష్ట్ర స్థాయిలో బీజేపీ ముఖ్యమంత్రులు నుంచి జిల్లా స్థాయిలో మంత్రులు నియోజకవర్గాల స్థాయిలో ఎమ్మెల్యేలు ఇంకా దిగువ స్థాయిలో బీజేపీ పార్టీ నాయకులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 13న మొదలైన తిరంగా ర్యాలీలు ఈ నెల 23 దాకా 11 రోజుల పాటు దేశవ్యాప్తంగా బీజేపీ నిర్వహించడం వెనక అసలు ఉద్దేశ్యం ఆపరేషన్ సిందూర్ ద్వారా వచ్చిన ఇమేజ్ ని పూర్తిగా రాజకీయంగా మళ్ళించుకోవడం కోసమే అని అంటున్నారు. మరో వైపు చూస్తే ఎన్నడూ లేని విధంగా ఇపుడు దేశంలో పరిస్థితి బీజేపీకి అనుకూలంగా ఉంది. పాకిస్థాన్ విషయంలో భారత్ మొత్తం ఆప్షన్లు అన్నీ తన వద్దనే

# జనసేన రాజ్యసభ సీటు ఆయనకే

- ◆ త్వరలో ఏపీలో ఖాళీకానున్న నాలుగు రాజ్యసభ సీట్లు
- ◆ అందులో ఒకటి జనసేనకు కేటాయింపు
- ◆ ఈ సీటు పవన్‌కు సన్నిహితుడైన పారిశ్రామిక వేత్త
- ◆ లింగమనేని రమేశ్‌కు ఇస్తున్నట్లు ప్రచారం
- ◆ చంద్రబాబునాయుడికి కూడా లింగమనేని సన్నిహితుడు

2



**అమరావతి-నవభూమిబ్యూరో**
జనసేనకు లోక్ సభలో ఇద్దరు ఎంపీలు ఉన్నారు. ఏపీ అసెంబ్లీలో 21 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. శాసనమండలిలో ఇద్దరు ఎమ్మెల్సీలు నాగబాబుతో కలుపుకుని ఉన్నారు. ఇక చూస్తే కనుక దేశంలోని మరో అత్యున్నత చట్ట సభ ఉంది అదే రాజ్యసభ. మూడు చట్ట సభలలో జనసేన ప్రవేశం దివ్యంగా జరిగిపోయింది. ఇక మిగిలిన ఆ చట్టసభ రాజ్యసభలో కూడా అడుగుపెడితే ఆ కొరత కూడా తీరిపోతొంది. జనసేన పూర్తి స్థాయిలో చట్ట సభలలో తన బలమైన వాణిని వినిపించేందుకు వీలు కలుగుతుంది. పాత సామెత గుర్తు చేసిన రాజ్‌నాథ్! నిజానికి జనసేనకు రాజ్యసభ సీటు ఒకటి ఆఫర్ ఉంది ఏపీలో ఇప్పటిదాకా నాలుగు రాజ్యసభ ఎంపీ సీట్లు ఖాళీ అయితే టీడీపీ బీజేపీ వాటిని పంచుకున్నాయి. ఏపీ నుంచి 2026లో ఏకంగా నాలుగు రాజ్యసభ సీట్లు ఖాళీ అవబోతున్నాయి. దాంతో అందులో ఒక్కటి పక్కాగా జనసేనకు దక్కుతుందని అంటున్నారు. నిజానికి రాజ్యసభ సీటు జనసేన నుంచి మెగా బ్రదర్ ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయిన నాగబాబుకు ఇస్తారు అని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అయితే ఈ ఏడాది మార్చిలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో నాగబాబు ఎమ్మెల్సీ అయ్యారు. దాంతో జనసేన తరఫున ఎవరికి రాజ్యసభ సీటు ఇస్తారు అన్నది పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది.అయితే జనసేన రాజ్యసభ సీటు ఒకరికి ఇప్పటికే రిజర్వ్ అయిపోయింది అని ప్రచారం సాగుతోంది. ఆయన ఎవరో కాదు ప్రముఖ పారిశ్రామికవేత్త లింగమనేని రమేష్ అని అంటున్నారు. ఆయన పవన్ కళ్యాణ్ కి అత్యంత సన్నిహితుడుగా ఉన్నారు. ఆయనకు రాజ్యసభ సీటు ఇవ్వాలన్న ప్రతిపాదనలు ఉన్నందువల్లనే పవన్ కళ్యాణ్ తన సోదరుడు నాగబాబుని ఎమ్మెల్సీగా పంపించారు అని అంటున్నారు. ఇక లింగమనేని రమేష్ టీడీపీ అధినాయకత్వానికి కూడా సన్నిహితుడే. దాంతో ఆయన పేరుని ఆ పార్టీ కూడా సంతోషంగా ఆమోదిస్తుందని అంటున్నారు. ఇక చూస్తే వచ్చే జూన్ లో ఏకంగా నాలుగు రాజ్యసభ సీట్లు ఏపీ నుంచి ఖాళీ అవుతున్నాయి. అందులో వైసీపీకి చెందినవే మూడు ఉన్నాయి. ఒకటి పిల్లి సుభాష్ చంద్రబోస్ సీటు, మరోటి అయోధ్య రామిరెడ్డి

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
2 | హైదరాబాద్ | శుక్రవారం | 16 । మే । 2025

## సరస్వతి నది పుష్కరాలకు ప్రత్యేక బస్సులు : టీజీఎస్ ఆర్టీసీ







**హైదరాబాద్-నవభూమి:**సరస్వతి పుష్కరాలకు భక్తుల సౌకర్యార్థం హైదరాబాద్ నుంచి కాళేశ్వరానికి ప్రత్యేక బస్సులను నడిపించాలని టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించింది. జేబీఎస్, ఎంజీబీఎస్, ఉప్పల్, కూకట్‌పల్లి, జీడిమెట్ల, మేడ్చల్‌తో పాటు తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ నెల 14 నుంచి 24వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉండనున్నాయి. 40 మంది కలిసి పుష్కరాలకు వెళ్లాలని అనుకుంటే వారి కాలనీలకే ప్రత్యేక బస్సులను పంపేలా ఏర్పాట్లు చేస్తామని ప్రకటించారు. ప్రత్యేక బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ కోసం http://tgsrtcbus.in వెబ్ సైట్‌ని సంప్రదించాలని అధికారులు సూచించారు. ప్రత్యేక బస్సుల కోసం 9676671533, 9959226154, 9959226160 నంబర్లను సంప్రదించొచ్చు.

పుష్కరాలకు ఆర్టీసీ ప్రత్యేకంగా మహాలక్ష్మి బస్సులు : సరస్వతి పుష్కరాలకు తెలంగాణ ఆర్టీసీ కూడా సన్నద్ధమైంది. ఈ నెల 15 నుంచి 26 వరకు జరగనున్న ఈ పుష్కరాలకు వేలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో అందుకు అనుగుణంగా టీజీఎస్?ఆర్టీసీ కూడా ప్రత్యేకంగా బస్సులు నడపాలని నిర్ణయించినట్లు ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ సామాజిక మాధ్యమం ఎక్స్?లో పోస్ట్ చేశారు.

## తెలంగాణలో కాంట్రాక్ట్ లెక్చరర్స్ తొలగింపు..?



**హైదరాబాద్-నవభూమి:** కాంట్రాక్టు లెక్చరర్లను కొనసాగిస్తారా లేదా తొలగిస్తారా అనే అంశం ఇప్పుడు విశ్వవిద్యాలయాల పరిధిలోకి వెళ్లిపోయింది. ఈ విషయంలో ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసీ) సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని విద్యాశాఖ సూచించినట్లు సమాచారం. ఈసీ తీసుకునే నిర్ణయానికి అనుగుణంగా ప్రభుత్వం ఆమోదం తెలుపుతుందని సంకేతాలు పంపినట్లు తెలుస్తోంది. అయితే.. ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించాలని, లేదా కనీసం టైమ్ స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేస్తుండటంతో.. ప్రభుత్వం ఈ అంశాన్ని విశ్వవిద్యాలయాలకు వదిలివేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. కాంట్రాక్టు లెక్చరర్లను కొనసాగించడం లేదా వారిని తొలగించి రెగ్యులర్ సిబ్బందిని నియమించడం అనేది పూర్తిగా ప్రభుత్వ విధాన నిర్ణయానికి సంబంధించిన విషయం. అయితే విద్యాశాఖ ఈ విషయంలో విశ్వవిద్యాలయాల నిర్ణయానికి వదిలివేయడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ప్రస్తుతం ఉన్న కాంట్రాక్టు లెక్చరర్లు చాలా సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. ఇప్పుడు హఠాత్తుగా వారిని తొలగిస్తే ప్రభుత్వంపై రాజకీయ విమర్శలు వచ్చే ప్రమాదం ఉంది. అందుకే ఈ విషయంపై విధానపరమైన నిర్ణయం ప్రభుత్వం తీసుకోవాల్సి ఉంటుంది. కానీ విద్యాశాఖ మాత్రం కాంట్రాక్టు లెక్చరర్ల అంశంపై ఈసీలో చర్చించి ప్రతిపాదనలు పంపాలని విశ్వవిద్యాలయాలకు సూచించింది. దీనివల్ల ప్రభుత్వానికి ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఎందుకంటే విశ్వవిద్యాలయాలు కాంట్రాక్టు లెక్చరర్లను కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నా.. సమస్య పరిష్కారం కాదని, ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని కాంట్రాక్టు లెక్చరర్లు చెబుతున్నారు. విద్యాశాఖలో అవగాహన లేని కొందరు అధికారుల కారణంగా అనవసర సమస్యలు వస్తున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టులను భర్తీ చేయడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసే ముందు.. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## మరో ఐదురోజులు వానలే.. హెచ్చరించిన ఐఎండీ హైదరాబాద్



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణలో ఐదురోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. వర్షాల నేపథ్యంలో రాగల మూడురోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువగా ఉండే అవకాశం ఉందని పేర్కొంది. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వడగండ్ల వానలు పడే అవకాశం ఉందని తెలిపింది. నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని చెప్పింది. ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, యాదాద్రి భువనగిరి, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట జిల్లాల్లో ఈదురుగాలులతో వానలు పడుతాయని చెప్పింది. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. బుధవారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు పడే సూచనలున్నాయని పేర్కొంది.

మంచిర్యాల, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. 16న నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో ఈదురుగాలులు వీస్తాయని చెప్పింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, రంగారెడ్డి, హైదరాబాద్, మల్కాజ్‌గిరి, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కొనసాగుతాయని హెచ్చరించింది. అలాగే, శని, ఆదివారాల్లోనూ వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

## దూరవిద్య ఎంసీఏ పరీక్షల రివాల్యుయేషన్ ఫలితాలు విడుదల



**హైదరాబాద్-నవభూమి:** ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్య కేంద్రమైన ప్రొఫెసర్ జి రామ్‌రెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్ సీడీఈ) ద్వారా అందించే ఎంసీఏ కోర్సు రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవాలని సూచించారు.

**బీఎఫ్ఏ పరీక్షా ఫీజు స్వీకరణ**

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఎఫ్ఏ పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఎఫ్ఏ (అప్లైడ్ ఆర్ట్స్, పెయింటింగ్, ఫోటోగ్రఫీ) రెండు, నాలుగు, ఆరు, ఎనిమిది, పదో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును ఈ నెల 27వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. రూ. 500 అపరాధ రుసుముతో 30వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవాలని సూచించారు.

## మృతదేహాలు కొంటాం.. మీ బంధువులదైనా.. పక్కింటివాళ్లదైనా..



**హైదరాబాద్-నవభూమి:**ప్రైవేటు వైద్య కళాశాలల్లో మృతదేహాల కొరత తీవ్రంగా ఏర్పడింది. వైద్య విద్యలో శరీర నిర్మాణం, అవయవాల పనితీరుపై అవగాహన కోసం విద్యార్థులకు మృతదేహాలు కీలకం. అయితే.. ప్రైవేటు కళాశాలలు ఇబ్బడిముబ్బడిగా పుట్టుకొస్తుండటంతో మృతదేహాల కొరత ఏర్పడింది. దీంతో కొన్ని కళాశాలలు అనైతిక మార్గాల్లో మృతదేహాలను సేకరిస్తున్నా యనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కొన్ని ప్రైవేటు వైద్య కళాశాలలు మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దు గ్రామాల పేద కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని దళారుల ద్వారా మృతదేహాలను కొనుగోలు చేస్తున్నాయని సమాచారం. మృతదేహానికి లక్ష రూపాయల వరకు చెల్లించడానికి కూడా సిద్ధపడుతున్నారని తెలుస్తోంది. అంత్యక్రియల ఖర్చు తప్పుతుందని, పైగా డబ్బు కూడా వస్తుందని దళారులు పేదలను నమ్మిస్తున్నారని ఆరోపణలున్నాయి.

%ప్రభుత్వ వైద్య కళాశాలలకు మృతదేహాలు రెండు రకాలుగా వస్తాయి. అనాథల మృతదేహాలు, రోడ్డు ప్రమాదాల్లో గుర్తుపట్టలేనంతగా దెబ్బతిన్న మృతదేహాలను కుటుంబ సభ్యులు గుర్తించకపోతే ఆసుపత్రులు స్వీకరిస్తాయి. ఇక కొందరు చనిపోయాక తమ శరీరాన్ని వైద్య కళాశాలలకు దానం చేయమని వీలునామా రాస్తుంటారు. ఇలాంటి మృతదేహాలకు ప్రభుత్వ వైద్య కళాశాలలకు కొరత ఉండదు. అయితే కొత్తగా ప్రైవేటు వైద్య కళాశాలలు పెరగడంతో వాటికి మృతదేహాల కొరత ఏర్పడింది. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ కొన్ని ప్రైవేటు వైద్య కళాశాలలు వైద్య విద్య డైరెక్టరేట్‌కు లేఖలు రాశాయి. జాతీయ వైద్య కమిషన్ మార్గదర్శకాల ప్రకారం.. ప్రతి వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య ఆధారంగా అనాటమీ విభాగానికి మృతదేహాలు అవసరం. సాధారణంగా 250 సీట్లు ఉన్న వైద్య కళాశాలకు ఏడాదికి సగటున 10 మృతదేహాలు అవసరం. ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలోనే అనాటమీ ఒక ముఖ్యమైన సబ్జెక్టుగా ఉంటుంది. వైద్య విద్యలో భాగంగా మృతదేహాలను కోసి శరీర నిర్మాణం గురించి విద్యార్థులకు వివరిస్తారు. తర్వాత ఆ మృతదేహాలను ప్రత్యేక రసాయనాలతో నింపిన ఫార్మాలిన్ ట్యాంకుల్లో భద్రపరుస్తారు. దీని ద్వారా వైద్య విద్యార్థులకు మానవ శరీరంపై అనుభవపూర్వక జ్ఞానం వస్తుంది. కొన్ని వైద్య కళాశాలలు మృతదేహాలకు బదులుగా రబ్బరు బొమ్మలను ఉపయోగిస్తున్నాయి. అయితే మానవ శరీరంపై ప్రత్యక్ష అనుభవం లేకపోవడం వల్ల విద్యార్థులకు పూర్తి అవగాహన రాదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోని మార్చురీల్లోని అన్‌క్లెయిమ్డ్ మృతదేహాలను ప్రైవేటు కళాశాలలకు విక్రయించేందుకు అనుమతిస్తూ గతంలో ప్రభుత్వం ఒక ఉత్తర్వు జారీ చేసింది. అయితే దీనిపై నైతికపరమైన ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఏది ఏమైనా ప్రవేట్ వైద్య కళాశాలలు ఇలా దళారుల ద్వారా శవాలను కొని.. పరిశోధనలకు ఉపయోగించడం ఆందోళన కలిగిస్తోంది.

### పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధికై రాష్ట్ర సీఎంను

## మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే



**పాలకుర్తి నవభూమి మే 15** పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి రూ. 50 కోట్ల నిధులు మంజూరు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ని గురువారం సీఎం క్యాంపు కార్యాలయంలో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఝాన్సి రెడ్డిలు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు.

పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధి పనులకై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని,కలిసి రూ. 50 కోట్ల నిధులు మంజూరు చేయాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధుల జారీపై సానుకూల నిర్ణయం తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం తెలిపారు.

ఎండలు విపరీతంగా ఉన్న నేపథ్యంలో, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఇంచార్జ్ ఝాన్సి రాజేందర్ రెడ్డి ని ముఖ్యమంత్రి ఆప్యాయంగా అడుగుతూ, మీరు బాగా తిరుగుతున్నారు, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, సూచించారు. ప్రతిసారీ సమయం దొరికినప్పుడల్లా ముఖ్యమంత్రిని,మంత్రులను కలిసే యశస్విని రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులు తీసుకురావడంలో చురుకుగా వ్యవహరిస్తున్నారు. ప్రజల అవసరాలను ప్రభుత్వానికి చేరవేసి, పాలకుర్తికి మెరుగైన మౌలిక సదుపాయాలు తీసుకురావడంలో ఎమ్మెల్యే కృషి అభినందనీయం అని సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు.

## యాపిల్ రగడ!

**(1వపేజీ తరువాయి)**వారు పేర్కొన్నారు.

మరోవైపు, ట్రంప్ వ్యాఖ్యల నేపథ్యంలో భారత్‌లో తమ పెట్టుబడి ప్రణాళికలను మార్చుకునే ఉద్దేశం లేదని యాపిల్ కంపెనీ వర్గాలు స్పష్టం చేశాయి. దేశంలో భారీ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసే ప్రతిపాదన షెడ్యూల్ ప్రకారమే ముందుకు సాగుతుందని కంపెనీ ప్రతినిధులు వార్తా సంస్థ పీటీఐకి తెలిపారు.

పశ్చిమాసియా పర్యటనలో భాగంగా ఖతార్‌లో జరిగిన ఓ వాణిజ్య సదస్సులో ట్రంప్ మాట్లాడుతూ, "మిత్రమా, నేను నిన్ను బాగానే చూసుకుంటున్నాను. కానీ ఇప్పుడు మీరు భారత్‌లో తయారీ కేంద్రం ఏర్పాటు చేస్తున్నారని వింటున్నాను. మీరు భారత్‌లో నిర్మించవద్దు. భారత్ ప్రపంచంలోనే అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో ఒకటి, కాబట్టి అక్కడ అమ్మడం చాలా కష్టం," అని టిమ్ కుక్‌తో అన్నట్లు తెలిపారు. యాపిల్ తన ఫ్యాక్టరీలను అమెరికాకు తరలిస్తుందని కూడా ట్రంప్ పేర్కొన్నప్పటికీ, కంపెనీ నుంచి అలాంటి ప్రకటన వెలువడలేదు.

నిపుణుల అంచనా ప్రకారం, యాపిల్ తన సరఫరా వ్యవస్థను అమెరికాలో తక్షణమే పునఃసృష్టించడం కష్టసాధ్యం. దీనికి బిలియన్ల డాలర్ల వ్యయం అవుతుంది. అమెరికా మార్కెట్ కోసం ఉద్దేశించిన ఐఫోన్లను భారత్‌లో తయారు చేయాలని, మిగిలిన ప్రపంచ దేశాల కోసం చైనాలోని ప్లాంట్లలో ఉత్పత్తి కొనసాగించాలని యాపిల్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. చైనాలో తయారై అమెరికాకు ఎగుమతి అయ్యే ఐఫోన్లపై భారీ సుంకాలను తప్పించుకోవడానికి కూడా ఈ వ్యూహం ఉపయోగపడుతుంది.

ప్రస్తుతం ప్రపంచ ఐఫోన్ ఉత్పత్తిలో దాదాపు 15% భారత్ నుంచే జరుగుతోందని అంచనా. ఐఫోన్లతో పాటు ఎయిర్‌పాడ్స్ వంటివి తెలంగాణలో తయారవుతున్నాయి. 2025 ఆర్థిక సంవత్సరంలో రూ. 1.5 లక్షల కోట్ల విలువైన ఐఫోన్లు ఎగుమతి అయ్యాయని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఏప్రిల్‌లో వెల్లడించారు. ఇది భారత ప్రభుత్వ "మేక్ ఇన్ ఇండియా" కార్యక్రమానికి మరింత ఊతమిస్తోంది.

## జమిలి బాబు సిద్ధం

**(1వపేజీ తరువాయి)**ఉంచుకుంది. ఉగ్ర దాడి ఏ మాత్రం జరిగినా ఆ క్రీనీడ కనిపించినా కూడా యుద్ధమే అని ప్రకటించిన నేపథ్యంలో పాక్‌తో భారత్ కయ్యానికి కాలు దువ్వాలనుకుంటే దువ్వవచ్చు. అదే విధంగా పాక్ ని కొమ్ములు విరిచి మూల కూర్చోబెట్టిన ఖ్యాతి కూడా భారత్ సొంతం అవుతుంది కూడా. ఈ నేపథ్యంలోనే కుల గణన కూడా బీజేపీ తన అమ్ముల పొది నుంచి తీస్తోంది అది కనుక జరిపించి బీసీలకు ఓబీసీలకు పెద్ద పీట వేస్తే బీజేపీ రాజకీయం మరింతగా పండుతుంది. దాంతో 2026లో జనాభా గణన కుల గణన ఒకేసారి చేపట్టి 2027 మధ్యలో జమిలి ఎన్నికలకు వెళ్ళాలన్న ఆలోచన బీజేపీ చేస్తోంది అన్నది రాజకీయాల్లో వినిపిస్తున్న మాట. అలా రెండేళ్ళ పాటు అధికారం చేతిలో ఉన్నపుడే ఎన్నికలకు వెళ్ళడం ద్వారా 2024లో నినదించిన 400 సీట్ల లక్ష్యాన్ని చేరుకోవాలని బీజేపీ చూస్తోంది అని అంటున్నారు. ఇక బీజేపీ ఆలోచనలు ఏ విధంగా ఉన్నాయో మిత్రపక్షం అయిన టీడీపీకి తెలిసిపోయిందా అన్నదే మరో చర్చ. అందుకే బాబు సూపర్ సిక్స్ హామీలు అన్నీ ఒక్కోటీ బయటకు తీస్తూ అమలు చేయడానికి సిద్ధపడుతున్నారు. అంతే కాదు వీలైతే మహిళల కోసం మరిన్ని కొత్త పథకాలను కూడా అమలు చేయడానికి సిద్ధపడుతున్నారు. జమిలి ఎన్నికలు ఎపుడు వచ్చినా బీజేపీ జనసేనలతో కలసి ఎన్నికల గోదాలోకి దిగి అధికారం మరోసారి సొంతం చేసుకోవాలని బాబు ఆలోచిస్తున్నారు అని అంటున్నారు మొత్తానికి జమిలి ఎన్నికల గురించి మరో మారు చర్చ స్టార్ట్ అయిపోయింది.

## హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ దారుణం.. మరో ఇంజనీర్ బలి

**కాన్పూర్-నవభూమి:**మగాళ్లు కావచ్చు.. ఆడవాళ్లు కావచ్చు.. జుట్టుకు ఉన్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. జుట్టు ఉంటే మనిషి అందంగా కనిపిస్తాడనటంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. వాస్తవానికి మనిషికి జుట్టు అనేది ఓ బలహీనత లాంటిది. అందుకే కొన్ని కంపెనీలు జుట్టును వ్యాపారంగా మార్చుకుని లక్షలు.. కోట్లు గడిస్తున్నాయి. నూటికి 70 శాతం మంది మగాళ్లను బట్టతల సమస్య వేధిస్తోంది. కొన్ని రకాల బట్టతలలను మందులు, లిక్విడ్ల ద్వారా నయం చేయవచ్చు. అయితే, మరికొన్నిటికి మాత్రం ట్రాన్స్‌ప్లాంటేషన్ చివరి ఆప్షన్ అవుతోంది. ట్రాన్స్‌ప్లాంటేషన్‌లో సక్సెస్ రేటు ఎక్కువగానే ఉంటుంది.

కానీ, అత్యంత అరుదుగా ప్రమాదాలు జరుగుతూ ఉంటాయి. ప్రాణాలు పోతూ ఉంటాయి. అది కూడా ఆస్పత్రిని బట్టి ప్రమాదాలు జరుగుతూ ఉంటాయి. తాజాగా, ఉత్తర ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో విషాదం చోటుచేసుకుంది. ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీ వికటించి ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. కాన్పూర్‌కు చెందిన మయాంక్ అనే వ్యక్తి ఓ ప్రైవేట్ కంపెనీలో ఇంజనీరుగా పని చేస్తూ ఉన్నాడు. త్వరలో సొంతంగా ఓ బిజినెస్ స్టార్ట్ చేయాలని కూడా అనుకుంటూ ఉన్నాడు. బట్టతల కారణంగా నలుగురిలో తిరగడానికి అతడు ఇబ్బంది పడుతూ ఉండేవాడు. ఈ నేపథ్యంలోనే గత సంవత్సరం నవంబర్ 18వ తేదీన ఎంపైర్ క్లినిక్‌లో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకున్నాడు. సర్జరీ పూర్తి చేసుకుని ఇంటికి చేరుకున్న తర్వాత తీవ్రమైన తలనొప్పి వచ్చింది.

వెంటనే ఆస్పత్రికి వెళ్లాడు. డాక్టర్ ఇంజెక్షన్ వేసినా .. ఎలాంటి లాభం లేకుండా పోయింది. మరుసటి రోజు అతడి ముఖం మొత్తం వాచిపోయింది. గుండెల్లో నొప్పి కూడా మొదలైంది. మళ్లీ ఆస్పత్రికి వెళ్లాడు. పరీక్షించిన వైద్యులు గుండెలో ఎలాంటి సమస్య లేదని తేల్చారు. అయితే, ఊహించని విధంగా నవంబర్ 19వ తేదీన అతడు చనిపోయాడు.

## కేసీఆర్ ఫ్యామిలీ టూర్

**(1వపేజీ తరువాయి)**ఇటీవల కవిత సైతం సొంత పార్టీపై సంచలన వ్యాఖ్యలు చేశారు. నాపై కొందరు పనిగట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నారని, నా మీద కుట్రలు ఎవరు చేస్తున్నారో నాకు తెలుసని, సమయం వచ్చినప్పుడు అన్నీ బయటకు వస్తాయని హాట్ కామెంట్స్ చేశారు. నేను పార్టీ బలోపేతం కోసమే పని చేస్తున్నానన్నారు. తనను రెచ్చగొట్టవద్దని, అలా చేస్తే తాను మరింత గట్టిగా స్పందిస్తానని స్ట్రాంగ్ కామెంట్స్ చేశారు. తన విషయంలో జరుగుతున్న దుష్ప్రచారంపై పార్టీ స్పందిస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో కవిత, హరీశ్ రావు, కేటీఆర్ విషయంలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్న తరుణంలో ఈ భేటీ జరగడం స్టేట్ పాలిటిక్స్ లో ఉత్కంఠ రేపుతున్నది.

కేసీఆర్ కుటుంబంలో విభేదాలు తలెత్తాయని దీంతో బీఆర్ఎస్ లో మూడుముక్కలాట నడుస్తోందనే విమర్శలు ఇటీవల జోరుగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా కేటీఆర్, హరీశ్ రావు, కవిత మధ్య భేదాభిప్రాయాలు మొదలయ్యాయని వాటిని కేసీఆర్ కంట్రోల్ చేయలేకపోవడంతో ఎవరి దారి వారు చూసుకునే ప్రయత్నాల్లో ఉన్నానే విమర్శలను ప్రత్యర్థులు ప్రయోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ లో కేసీఆర్ తర్వాత టాప్ లీడర్లుగా ఉన్న కేటీఆర్, హరీశ్ రావు భేటీ కావడం రాజకీయంగా సెన్సేషన్ గా మారింది. జరుగుతున్న పరిణామాల దృష్ట్యా త్వరలో బీఆర్ఎస్ లో భారీ కుదుపు తప్పదా అనే అనుమానాలు రాజకీయ వర్గాల్లో వ్యక్తం అవుతున్నది.

## వంశీ విడుదల ఇప్పట్లో లేనట్లే!?

**(1వపేజీ తరువాయి)**కిడ్నాప్ కేసు నమోదు చేశారు. ఇలా మొత్తం ఆరు కేసులు వంశీపై ఉండగా, ఐదు కేసుల్లో ఆయనకు బెయిల్ మంజూరైంది. ఇంకా గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఆయనకు బెయిల్ లభించాల్సివుంది. దీనిపై శుక్రవారం వాదనలు జరిగే అవకాశం ఉండగా, గురువారం మరో పీటీ వారెంటు జారీ చేయడం గమనార్హం. దీంతో వంశీపై కూటమి ప్రభుత్వ పెద్దల ఆగ్రహం చల్లారలేదనేనది స్పష్టమవుతోందని అంటున్నారు. జైలులో మూడు నెలల నుంచి ఉన్న వంశీ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. బాగా నీరసించిపోయి, బరువు తగ్గి శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న ఆయనకు కోర్టుల్లో ఎలాంటి ఉపశమనం దక్కడం లేదు. దీంతో రిమాండులోనే జైలులో కఠిన వేధన అనుభవిస్తున్నారని అంటున్నారు. ఇక పెండింగులో ఉన్న ఏకైక కేసులో బెయిల్ వస్తుందని వంశీ కుటుంబ సభ్యులు, అనుచరులు ఆశిస్తున్న సమయంలో పోలీసులు ఝలక్ ఇచ్చారు.

## సైబర్ నేరాల జోరు

**(1వపేజీ తరువాయి)**మారుతోంది. ఎందుకంటే, బ్యాంకు సిబ్బంది లోపాయికారీగా సహకరిస్తే, డబ్బు ఎటు పోతుందో ట్రేస్ చేయడం అంత ఈజీ కాదు. అయితే, హైదరాబాద్ పోలీసులు ఈ సైబర్ నేరాలను అరికట్టడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ప్రత్యేక సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేసి, లేటెస్ట్ టెక్నాలజీని ఉపయోగిస్తూ దర్యాప్తు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల పోలీసులతో కూడా కలిసి పనిచేస్తూ, ఈ నేరాల వెనుక ఉన్న పెద్ద నెట్‌వర్క్‌లను ఛేదించడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, తమ బ్యాంకు వివరాలు లేదా వ్యక్తిగత సమాచారం ఎవరితోనూ పంచుకోవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఒకవేళ ఎవరైనా సైబర్ నేరానికి గురైతే, వెంటనే 1930 నెంబర్‌కు కాల్ చేసి రిపోర్ట్ చేయాలని సూచిస్తున్నారు. ఇటీవల తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోగుజరాత్‌లోని సూరత్‌లో ఒక పెద్ద ఆపరేషన్ నిర్వహించి, తెలంగాణలో 60కి పైగా సైబర్ నేరాల్లో పాల్గొన్న 20 మందిని అరెస్టు చేసింది. వీరిలో ఒక ప్రైవేట్ బ్యాంకు రిలేషన్‌షిప్ మేనేజర్ కూడా ఉన్నాడు. వీళ్లు చాలా మంది అమాయకుల నుంచి రూ. 4.3 కోట్ల వరకు మోసం చేసినట్లు తేలింది. ఈ ఆపరేషన్‌లో పోలీసులు 20 మొబైల్ ఫోన్లు, 28 సిమ్ కార్డులు, 4 ఏటీఎం కార్డులు, 5 చెక్ బుక్‌లు స్వాధీనం చేసుకున్నారు. మొత్తానికి, హైదరాబాద్‌లో సైబర్ నేరాలు పెరుగుతున్నాయనేది నిజం. దీనికి ప్రధాన కారణం నగరం ఐటీ హబ్‌గా ఉండటం, ఇక్కడ సంపన్నులు ఎక్కువగా ఉండటం, కొంతమంది బ్యాంకు ఉద్యోగులు నేరగాళ్లతో చేతులు కలపడం. అయితే పోలీసులు ఈ నేరాలను అరికట్టడానికి గట్టిగా ప్రయత్నిస్తున్నారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉంటే, ఈ సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండొచ్చు.

## స్వార్థంతోనే టర్కీ సాయం

**(1వపేజీ తరువాయి)** నేపథ్యంలో మరొక ఇస్లామిక్ దేశమైన పాకిస్తాన్‌కు మద్దతు ఇవ్వడం టర్కీ ప్రభావం లోకి తీసుకురావడానికి ఒక వ్యూహా త్మక చర్యగా పరిగణించబడుతుంది. టర్కీ పాకిస్తాన్‌కు భారత్‌పై ఉపయోగించడానికి డ్రోన్‌లను కూడా సరఫరా చేసింది. ఇది ఈ సంబంధంలో వ్యాపార స్వభావాన్ని హైలైట్ చేస్తుంది. పాకిస్తాన్‌కు మద్దతు కేవలం సంఘీభావ చర్య కాదని, ఆ దేశంపై పట్టు సాధించడానికి ఒక లెక్కించిన ప్రయత్నమని ఈ దృక్పథం తెలియజేస్తోంది. అధ్యక్షుడు ఎర్డోగాన్ తన విస్తృత లక్ష్యాలను సాధించడానికి పాకిస్తాన్ ఒక సాధనంగా ఉపయోగించుకుంటున్నారని తెలుస్తోంది. ఇస్లామిక్ ప్రపంచంలో టర్కీ నాయకత్వాన్ని పాకిస్తాన్ అంగీకరించడంపై ఈ మద్దతు ఆధారపడి ఉంటుంది. చాలా అరబ్ యేతర ఇస్లామిక్ దేశాలకు బలమైన ఆర్థిక శక్తి లేదని, దీనిని అధ్యక్షుడు ఎర్డోగాన్ తన ప్రయోజనం కోసం ఉపయోగించుకుంటు న్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. అందువల్ల పాకిస్తాన్‌కు అందించే సహాయం పూర్తిగా పరోపకారం కాదని, టర్కీ విస్తృత భౌగోళిక రాజకీయ ఆశయాలలో ఒక వ్యూహాత్మక ఎత్తుగడగా భావిస్తున్నారు.. పాకిస్తాన్ ఇస్లామిక్ దేశాలలో టర్కీ నాయకత్వ ఆకాంక్షలకు అనుగుణంగా లేకపోతే, అటువంటి సహాయం కొనసాగింపును టర్కీ పునఃపరిశీలించే అవకాశం ఉంటుంది . ఇది ఇస్లామిక్ ప్రపంచంలో తన ప్రభావాన్ని పటిష్టం చేయడానికి లక్ష్యంగా చేసుకున్న టర్కీ విదేశాంగ విధానంలో ఒక స్వార్థపూరిత అంశంగా పాకిస్తాన్‌కు దాని మద్దతును విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు.

## జనసేన రాజ్యసభ సీటు..

**(1వపేజీ తరువాయి)**సీటు, ఇంకోటి గుజరాత్ కి చెందిన అదానికి సన్నిహితుడైన పరిమళ నత్వాని. ఇక టీడీపీ నుంచి గత ఏడాది రాజ్యసభకు వెళ్ళిన సానా సతీష్ పదవీ కాలం కూడా పూర్తి అవుతోంది. అయితే సానా సతీష్ ఎంపీగా గట్టిగా రెండేళ్ళు కూడా ఉండనందున మరోసారి ఆయనకు చాన్స్ ఇస్తారని అంటున్నారు. ఇక పరిమళ్ నత్వానీ సీటుని బీజేపీ తీసుకుంటుందని చెబుతున్నారు. మిగిలిన రెండు సీట్లలో ఒకటి జనసేన ఒకటి టీడీపీ తీసుకుంటాయట. ఆ విధంగా చూస్తే వచ్చే ఏడాది ఖాళీ అయ్యే నాలుగు రాజ్యసభ సీట్లలో టీడీపీకి రెండు, జనసేన బీజేపీలకు చెరి ఒకటి దక్కనున్నాయని అంటున్నారు. జనసేన నుంచి లక్కీ చాన్స్ మాత్రం లింగమనేని రమేష్ తీసుకున్నారు అని చెబుతున్నారు. మరి ఈ ప్రచారంలో నిజమెంత ఉందో తెలియదు కానీ అదే జరిగితే లింగమనేని ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తున్నట్లే. ఆరేళ్ళ పాటు పదవీ కాలం ఉండే పెద్దల సభలో ఎంపీగా అధికారం అందుకున్నట్లే అని అంటున్నారు.

## కశ్మీర్ విషయంలో మూడో దేశం జోక్యం



**ఢిల్లీ-నవభూమి::** కశ్మీర్ సమస్యపై భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంలో మూడో దేశం జోక్యం అవసరం లేదని, ఇది భారత్-పాకిస్థాన్ మధ్య ద్వైపాక్షిక అంశమని స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత సైన్యం పాకిస్థాన్ ఉగ్రవాద మౌలిక సదుపాయాలను ధ్వంసం చేసినట్లు కేంద్రమంత్రి చెప్పారు. పాకిస్థాన్ సైన్యాన్ని కాకుండా, ఉగ్రవాద కేంద్రాలను లక్ష్యంగా చేసుకున్నామని ముందే హెచ్చరించినట్లు పేర్కొన్నారు. అయినప్పటికీ, పాకిస్థాన్ ఈ సలహాను పట్టించుకోలేద న్నారు. భారతదేశంపై చేసిన దాడికి మా సైన్యం గట్టి ప్రతీకారం తీర్చుకుందన్నారు. టిలైట్ చిత్రాలు ఈ ఆపరేషన్‌లో పాకిస్థాన్‌కు జరిగిన భారీ నష్టాన్ని, భారతదేశానికి అతి తక్కువ నష్టాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయని జైశంకర్ గుర్తు చేశారు. ఈ ఆపరేషన్ ద్వారా భారత సైన్యం తన సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిందన్నారు. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత (తీవ్రవాద రెసిస్టెన్స్ ఫ్రంట్) ఉగ్రవాద సంస్థను నిషేధించాలని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్ డిమాండ్ చేసింది. ఈ సంస్థకు వ్యతిరేకంగా ఆధారాలను సమర్పించేందుకు భారత్ సిద్ధంగా ఉంది. జైశంకర్ ఈ విషయంపై మాట్లాడుతూ పహల్గామ్ దాడిలో దోషులకు కఠిన శిక్ష విధించాలని ఐక్యరాజ్య సమితి సభ్యులు స్పష్టం చేశారు.

## బాలాజీ టెంపుల్ కూల్చివేతపై హైకోర్టు ఏం చెప్పిందంటే




**న్యూఢిల్లీ,-నవభూమి:** ఢిల్లీ ఏపీ భవన్ ప్రాంగణంలో ఉన్న బాలాజీ వెంకటేశ్వర మందిర్ కూల్చివేతపై ఢిల్లీ హైకోర్టు స్టే విధించింది. ఆలయం కూల్చివేతపై శివ బాలాజీ , వెంకటేశ్వర మందిర్ పూజారి గోపాల్ కుమార్ మిశ్రా హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఈరోజు (గురువారం) న్యాయస్థానంలో విచారణకు రాగా.. ఈనెల 19వ తేదీ వరకు ఎలాంటి చర్యలు చేపట్టవద్దని ధర్మాసనం ఆదేశించింది. స్టేటస్ కో యథాతథ స్థితిగా కొనసాగించాలని ఆదేశాలు జారీ చేసింది. అంత వరకూ విద్యుత్, నీటి సరఫరా కూడా కొనసాగించాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ సందర్భంగా పూజారి గోపాల్ కుమార్ మిశ్రా మాట్లాడుతూ.. సనాతన ధర్మాన్ని కాపాడాలన్నారు. తానేమైనా ఉగ్రవాదినా ఎందుకు తన గుడిని కూల్చివేస్తామని అంటున్నారని ప్రశ్నించారు. 1970 నుంచి ఇక్కడే గుడి నిర్మాణం చేసుకొని పూజలు నిర్వహిస్తున్నామని చెప్పుకొచ్చారు. గుడికి మంచినీరు, కరెంట్ కట్ చేశారని.. తిరిగి పునరుద్ధరించాలని హైకోర్టు ఆదేశించిందని తెలిపారు. గుడిని కూల్చకుండా చర్యలు తీసుకున్న సీఎం చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలియజేశారు. కమిషనర్ గుడిని కూల్చేస్తామని చెప్పారని.. ఇందుకోసం అధికారులను పంపించారన్నారు. అయితే హైకోర్టు మే 19 వరకు గుడిని కూల్చివేయొద్దని స్టే విధించిందని.. యథాస్థితిగా స్టేటస్‌కో ఆర్డర్ అమలు చేయాలని ఆదేశించిందని గోపాల్ కుమార్ మిశ్రా వెల్లడించారు.

## ఈ అధికారం మీకెవరు ఇచ్చారు.. సుప్రీంకోర్టుకు రాష్ట్రపతి ముర్ము సూటి ప్రశ్న..



**తమిళనాడు -నవభూమి:** ప్రభుత్వం గవర్నర్ కేసులో ఏప్రిల్ 8న సుప్రీంకోర్టు రాష్ట్ర బిల్లులపై రాష్ట్రపతి, గవర్నర్ 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాల్సిందేనని తీర్పు వెలువరించింది. గడువులోగా ఆమోదించడమో, వెనక్కి తిప్పిపంపడమో ఏదొకటి చేయాలని స్పష్టం చేసింది. బిల్లులు ఆమోదించకపోతే ఎందుకనే కారణాలు కచ్చితంగా చెప్పాలని తెలిపింది. ఈ తీర్పు తర్వాత కూడా ఇలాగే చేస్తుంటే సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని, రాజ్యాంగ అధికరణం 142 ప్రకారం గవర్నర్ల నిష్క్రియాపరత్వాన్ని న్యాయ సమీక్ష చేసేందుకు సంపూర్ణ అధికారం సుప్రీం కోర్టుకు ఉందని జస్టిస్ జేబి పార్దివాలా, ఆర్ మహదేవన్ ధర్మాసనం వెల్లడించింది. అయితే, సుప్రీం ఇలా కాలపరిమితి విధించడంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తీవ్రంగా స్పందించారు. సుప్రీంకు 14 ప్రశ్నలు..రాజ్యాంగంలో అలాంటి నిబంధనేది లేనప్పుడు ఈ తీర్పు ఎలా ఇవ్వగలరని రాష్ట్రపతి ముర్ము బుధవారం అత్యున్నత న్యాయస్థానాన్ని ప్రశ్నించారు. జస్టిస్ జేబి పార్దివాలా, జస్టిస్ ఆర్ మహదేవన్ ఇచ్చిన 415 పేజీల తీర్పును సమీక్షించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 143(1) కింద రాష్ట్రపతికి ఉన్న అరుదైన అధికారాలను ఉపయోగించి 14 ప్రశ్నలపై సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరారు. నూతన సీజేఐగా జస్టిస్ బి.ఆర్.గవాయ్ ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే రాష్ట్రపతి ముర్ము ఈ తీర్పుపై స్పందించడం గమనార్హం.

## యాసిడ్ దాడిలో కళ్లు పోయాయి.. అయినా విజయం సాధించింది..



**చండీఘర్-నవభూమి:** అనుకున్నది సాధించాలనే తపన.. నిద్రపోనివ్వని కసి(కండీషన్స్ అప్లై) ఈ రెండు ఉంటే చాలు మనిషి ఉన్నత శిఖరాలను చేరతాడు. కొంతమంది అన్నీ ఉన్నా.. కష్టపడ్డానికి, అనుకున్నది సాధించడానికి బద్ధకిస్తూ ఉంటారు. తమ దగ్గర లేని వాటి గురించే అతిగా ఆలోచిస్తుంటారు. చివరకు ఫెయిల్ అవుతూ ఉంటారు. నూటికో.. కోటికో ఒక్కరు అన్నట్లు తమ దగ్గర లేని వాటి గురించి కాకుండా .. ఉన్న వాటితో అద్భుతాలు సృష్టిస్తూ ఉంటారు. చరిత్ర తిరగరాస్తూ ఉంటారు. ఇందుకు కఫి విజయగాథే ఓ ప్రత్యక్ష ఉదాహరణ. కళ్లు లేని ఆ యువతి ఇంటర్ పరీక్షల్లో 95 శాతం ఫలితాలు సాధించింది. తన విజయంతో ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తోంది. కఫి సక్సెస్ స్టోరీ విషయానికి వస్తే.. చండీఘర్‌కు చెందిన కఫి మూడేళ్ల ప్రాయంలోనే కళ్లు పోగొట్టుకుంది. కుటుంబ గొడవల నేపథ్యంలో ఆమెపై యాసిడ్ దాడి జరిగింది. ముఖంపై పడ్డ యాసిడ్ కళ్లను పాడుచేసింది. ముఖం కూడా బాగా కాలిపోయింది. పదుల సంఖ్యలో సర్జరీల తర్వాత ఆమె పరిస్థితి కొంత మెరుగుపడింది. కళ్లు మాత్రం రాలేదు. కళ్లు లేకపోయినా ఆమె ఏమాత్రం కృంగిపోలేదు. ఏదైనా సాధించి చూపాలని అనుకుంటూ ఉండేది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కళ్లు లేకపోయినా.. చదువు కొనసాగించింది. కఫి తండ్రి పవన్ హర్యానా సెక్రటేరియట్‌లో ప్యూన్‌గా పని చేస్తున్నాడు. తల్లి గృహిణి. వారిద్దరూ ఐదవ తరగతి వరకు మాత్రమే చదువుకున్నారు. తమకు చదువు లేదు కాబట్టి.. కూతుర్ని చదివించాలని అనుకున్నారు. ఉన్నత స్థితిలోకి తీసుకురావాలని భావించారు. తల్లిదండ్రుల ఆశలకు తగ్గట్టే పదవ తరగతిలో కఫి మంచి మార్కులతో పాసైంది. 95.2 శాతం మార్కులు సాధించింది. తర్వాత చండీఘర్‌లోని అంధుల కాలేజీలో ఇంటర్‌లో చేరింది. ఇంటర్‌లో కూడా ఏ మాత్రం తగ్గలేదు. 95.6 శాతం మార్కులు సాధించి అందర్నీ ఆశ్చర్యపరిచింది. అంధుల కాలేజీలో టాప్ ర్యాంకు తెచ్చుకుంది. కఫి తర్వాత స్థానంలో 94 శాతం మార్కులతో సుమన్ పొద్దర్, 93.6 శాతం మార్కులతో గుర్‌శరన్ సింగ్ మూడవ స్థానంలో

# రాహుల్‌పై చర్యలకు రంగం సిద్ధం



**పాట్నా, -నవభూమి:** తమ ఆదేశాలను ధిక్కరించిన నేపథ్యంలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్ గాంధీపై న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని దర్భంగా జిల్లా ఉన్నతాధికారులు వెల్లడించారు. గురువారం దర్భంగాలో జిల్లా ఉన్నతాధికారులు విలేకర్లతో మాట్లాడుతూ.. దర్భంగాలో అంబేద్కర్ హాస్టల్ వద్ద విద్యార్థులతో ముఖాముఖీ కార్యక్రమానికి నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్ గాంధీకి అనుమతి ఇవ్వలేదని తెలిపారు. స్థానిక టౌన్ హాల్ వద్ద ఈ కార్యక్రమం నిర్వహించేందుకు నిర్వాహకులకు అనుమతి ఇచ్చామని స్పష్టం చేశారు. కానీ రాహుల్ గాంధీ మాత్రం అంబేద్కర్ హాస్టల్ వద్దే విద్యార్థులతో ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించేందుకు సిద్ధమయ్యారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని అడ్డుకొనేందుక పోలీసు సిబ్బంది చేసిన ప్రయత్నాలు ఫలించలేదన్నారు. ఆ క్రమంలో అంబేద్కర్ హాస్టల్ వద్దకు రాహుల్ గాంధీ వస్తున్న క్రమంలో ఆయన్ని యూనివర్సిటీ గేట్ వద్ద పోలీసులు ఆపే ప్రయత్నం చేశారన్నారు. పోలీసుల ప్రయత్నాన్ని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తీవ్రంగా వ్యతిరేకించాయని చెప్పారు. దీంతో యూనివర్సిటీ గేట్ తెరవక తప్పలేదన్నారు. అనంతరం ఖాన్‌కా చౌక్ వద్దకు రాహుల్ చేరుకుని.. అక్కడి నుంచి అంబేద్కర్ హాస్టల్ వద్ద ఏర్పాటు చేసిన వేదిక వద్దకు కాలినడకన ఆయన చేరుకున్నారని తెలిపారు. ఆ తర్వాత రాహుల్ గాంధీ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారని చెప్పారు. మీతో మాట్లాడటానికి, మీరు చెప్పింది వినేందుకు తాను ఢిల్లీ నుంచి వచ్చానని విద్యార్థులకు రాహుల్ గాంధీ వివరించారు. కానీ అధికారులు తానను ఆపేందుకు అడుగడుగునా అడ్డం పడ్డారన్నారు. అలాగే బ్యారికేడ్స్‌ను రహదారులకు అడ్డంగా పెట్టారని చెప్పారు. కానీ తాను మరో మార్గం ద్వారా ఇక్కడికి చేరుకున్నారన్నారు. అంతేకాదు.. తనను ఎవరు ఆపలేరన్నారు. ఎందుకంటే తన వెనుక మీ బలం ఉందని చెప్పారు. దీంతో ప్రపంచంలో ఏ శక్తి తనను ఆపలేదని తెలిపారు. అలాగే బిహార్‌లోని నితీష్ కుమార్ ప్రభుత్వంతోపాటు ప్రధాని మోదీలపై ఈ సందర్భంగా రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. అదే విధంగా కులగణన నిర్వహించేందుకు పార్లమెంట్ సాక్షిగా ఒప్పుకోని ప్రధాని మోదీ.. తన ఒత్తిడి కారణంగా ఈ గణనను నిర్వహించేందుకు సానుకూలంగా స్పందించారని రాహుల్ గాంధీ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రధాని మోదీ ప్రభుత్వం.. ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి, కులగణనతోపాటు నిరుపేదలకు వ్యతిరేకంగా పని చేస్తుందని మండిపడ్డారు


ఈ మోదీ ప్రభుత్వం కేవలం అదానీ, అంబానీ సంస్థలకు అనుగుణంగా మాత్రమే పని చేస్తుందంటూ రాహుల్ గాంధీ ఆరోపించారు. మరోవైపు అంబేద్కర్ హాస్టల్ వద్ద రాహుల్‌గాంధీని ప్రసంగించేందు కు అనుమతించక పోవడంపై బిహార్‌లోని కాంగ్రెస్ పార్టీ వర్గాలు ప్రభుత్వంపై నిప్పులు చెరిగాయి. అదీకాక.. హాస్టళ్లలో పరిస్థితు ప్రస్తుతం ఎలా ఉన్నాయో తనకు తెలుసునన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఆ పరిస్థితులు మారుస్తామని రాహుల్ గాంధీ ప్రకటించారు.

## కల్నల్ సోఫియా వివాదం..
# సుప్రీం కోర్టు సంచలన వ్యాఖ్యలు




**ఇండోర్-నవభూమి:** ఇండో-పాక్ ఉద్రిక్తతల సమయంలో శత్రుదేశంతో పోరు గురించి మీడియాకు వివరాలు వెల్లడించారు కల్నల్ సోఫియా ఖురేషీ. దీంతో ఆమె ఒక్కసారిగా ఫుల్ పాపులర్ అయిపోయారు. ఎవరీ సోఫియా ఖురేషీ అంటూ ఈ భారత సైనికాధికారిణి గురించి అంతా తెలుసుకోసాగారు. ఈ సమయంలో మధ్యప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి విజయ్ షా ఆమెపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. ఆమె ఉగ్రవాదుల సోదరి అంటూ ఒక సభలో షా చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారానికి దారితీశాయి. దీనిపై హైకోర్టు ఆదేశాలతో మంత్రి మీద కేసు నమోదవడమే గాక ఈ వ్యవహారం ఇప్పుడు సుప్రీం కోర్టుకు కూడా చేరింది. ఈ కేసును విచారించేందుకు అంగీకరించిన అత్యున్నత ధర్మాసనం.. విజయ్ షాపై మండిపడింది. వెంటనే క్షమాపణ చెప్పాలంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. సారీ చెప్పండి..అసలేం మాట్లాడుతున్నారు.. ముందు వెళ్లి హైకోర్టులో క్షమాపణలు చెప్పండి అంటూ మంత్రి విజయ్ షాను ఆదేశించింది సుప్రీం కోర్టు. ఇలాంటి అంశాల్లో సున్నితంగా వ్యవహరించాలంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. కాగా, కల్నల్ సోఫియాను ఉద్దేశించి ఉగ్రవాదుల సోదరి అంటూ విజయ్ షా చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. దీంతో మంత్రి వ్యాఖ్యల్ని సుమోటోగా తీసుకుంది హైకోర్టు. ఎఫ్ఐఆర్ నమోదు శత్రుత్వం, విద్వేషాన్ని ప్రోత్సహించడం, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినందుకు గానూ విజయ్ షాపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఆ తర్వాత ఈ వ్యవహారం సుప్రీంకు వెళ్లగా.. ఈ కేసును రేపు విచారించేందుకు సమున్నత న్యాయస్థానం అంగీకరించింది. అంతేగాకుండా అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన మంత్రి తీరును తప్పుపట్టింది. కాగా, విజయ్ షా కామెంట్స్‌పై భారీగా విమర్శలు వస్తున్నాయి. బాధ్యతాయుత స్థానంలో ఉండి స్త్రీల మీద ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఏంటంటూ జాతీయ మహిళా కమిషన్ ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

## పాక్ దగ్గర ఉన్న అణుబాంబులను లాక్కోండి..
# రాజ్‌నాథ్ సింగ్ విజ్ఞప్తి..



**జమ్మూకాశ్మీర్-నవభూమి:** ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన తర్వాత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మొదటిసారి జమ్మూకాశ్మీర్‌కు వెళ్లారు. గురువారం అక్కడి పరిస్థితులను సమీక్షించారు. ఆర్మీకి సంబంధించిన 15 కాప్స్ హెడ్ క్వాటర్స్‌కు కూడా ఆయన వెళ్లారు. అక్కడ ఆర్మీ జవాన్లతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదంపై భారత్ చేస్తున్న పోరాటంపై కేంద్రమంత్రి మాట్లాడారు. బాధ్యత లేని.. మూర?మైన పాకిస్థాన్ లాంటి దేశం దగ్గర అణుబాంబులు ఉండటం మంచిది కాదని ఆయన అన్నారు. పాక్ దగ్గర ఉన్న అన్ని అణుబాంబులను ఇంటర్ నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ స్వాధీనం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. 'ఉగ్రవాదానికి.. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో అమరులైన జవాన్లకు శిరస్సు వంచి వందనం చేస్తున్నా. వారికి నివాళులు అర్పిస్తున్నా. గాయపడ్డ జవాన్లకు సెల్యూట్ చేస్తున్నా. వారు త్వరగా కోలుకోవాలని దేవుణ్ని ప్రార్థిస్తున్నా. పహల్గామ్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన అమయాకమైన పౌరులకూ నివాళులు అర్పిస్తున్నా. ఆపరేషన్ సిందూర్ ఉగ్రవాదులకు వ్యతిరేకంగా చేసిన అతి పెద్ద ఆపరేషన్. ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి ఎంతవరకైనా వెళ్తాం. ఉగ్రవాదులకు ఆశ్రయం ఇవ్వడాన్ని పాకిస్థాన్ ఇకనైనా ఆపాలి. ఉగ్రవాదులే లక్ష్యంగా ఇండియన్ ఆర్మీ దాడులు చేసిందని ప్రపంచం మొత్తానికి తెలుసు. ఈ రోజుకూ ఉగ్రవాదానికి వ్యతిరేకంగానే పోరాటం చేస్తున్నాం. అణు బాంబు బెదిరింపులకు సైతం భయపడలేదు. పాకిస్థాన్ ఎంత చెత్తగా ఇండియాను బెదిరించిందో ప్రపంచం మొత్తం చూసింది. శ్రీనగర్ గడ్డమీద నుంచి ఓ ప్రశ్న లేవనెత్తుతున్నా. బాధ్యత లేని.. మూర?మైన దేశం చేతిలో అణుబాంబులు ఉండటం ఎంత వరకు మంచిది. ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ ఆ బాంబులను స్వాధీనం చేసుకోవాలని' అన్నారు.

## ఆ నగరంలో మొత్తం వీధి కుక్కల సంఖ్య ఎంతో తెలిస్తే





**చెన్నై-నవభూమి:** రాజధాని నగరంలో సుమారు 1.80 లక్షల వీధి కుక్కలున్నాయని ప్రకటించిన గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ వీటికి రూ.3 కోట్లతో రాబిస్ ఇంజక్షన్లను జూన్ నుంచి వేయనున్నట్టు తెలిపింది. జీసీసీ నిర్వహణలోని 15 జోన్లలోని 200 వార్డుల్లో పెరుగుతున్న జనాభాతో పాటు వీధికుక్కల సంఖ్య కూడా పెరుగుతోంది. వీటి బెడద నివారించే దిశగా ప్రణాళిక రూపొందించిన కార్పొరేషన్ సంతాన నిరోధక శస్త్రచికిత్స, రాబిస్ ఇంజక్షన్ వేయడంతో పాటు పెంపుడు జంతువులకు లైసెన్స్ విధానాన్ని కూడా అమలుపరుస్తుంది. వీధి కుక్కల బెడద అధికంగా ఉన్న ప్రాంతాల్లో వాటిని వేటాడి వాహనాల ద్వారా సంరక్షణ కేంద్రాలకు తరలిస్తు న్నారు. సంతాన నిరోధక శస్త్రచికిత్స చట్టం 2023 ప్రకారం వాటిని మళ్ళీ పట్టుకున్న చోటే వదిలివేస్తున్నారు. మరీముఖ్యంగా పిచ్చికుక్క కాటుకు నగరవాసులు గురికాకుండా, రాబిస్ వ్యాధిని నివారించేందుకు అనుగుణంగా పుళియాన్‌తోపు, లాయిడ్స్ కాలనీ, కన్నమ్మపేట, షోలింగనల్లూరు, మీనబాక్కం ప్రాంతాల్లో కుక్కల సంతాన ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటయ్యాయి. వీటితో పాటు 1,2,3,4,5,7,8,11,12,14, జోన్లలో ప్రతిరోజు 30 వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్రచికిత్స, రాబిస్ ఇంజక్షన్ వేసేలా అదనంగా మరో పది కేంద్రాలు నిర్మాణం దశలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో, పశువుల సేవా కేంద్రం (డబ్లూవీఎస్) స్వచ్ఛంద సేవా సంస్థలతో కలిసి జీసీసీ నగరంలోని 200 వార్డుల్లో ఇటీవల నిర్వహించిన సర్వేలో 1,80,157 వీధి కుక్కలున్నట్లు గుర్తించారు. వీధి కుక్కల రహిత నగరంగా రాజధానిని తీర్చిదిద్దాలనే లక్ష్యంతో జూన్‌లో రూ.3 కోట్ల తో రాబిస్ ఇంజక్షన్ వేసే పనులు ప్రారంభమవుతాయని కార్పొరేషన్ అధికారులు తెలిపారు.

## అభినందన్ వర్ధమాన్‌ను భారత్‌కి పాక్ ఆర్మీ అప్పగించిన తర్వాత ఏమైందంటే..



**న్యూఢిల్లీ, -నవభూమి:** పహల్గాం ఉగ్రదాడి అనంతరం ఇరు దేశాల ఉద్రిక్తతల నడుమ బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్)కు చెందిన సైనికుడు పూర్ణమ్ కుమార్ సాహూ భారత్ సరిహద్దు దాటి పాక్ భూభాగంలోకి ప్రవేశించారు. దీంతో అతడిని పాక్ సైన్యం దాదాపు 20 రోజుల పాటు బంధించి.. మే 14వ తేదీన భారత్‌కు అప్పగించింది. అయితే 2019లో పుల్వామ దాడి జరిగింది. ఆ సమయంలో సైతం వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్.. పాకిస్థాన్ భద్రతా బలగాల చేతికి చిక్కారు. ఆ సమయంలో సైతం అభినందన్ వర్ధమాన్‌కు భారత్‌కు అప్పగించిన సంగతి తెలిసిందే. పుల్వామా ఉగ్రదాడికి ప్రతీకారంగా పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని బాలా కోట్ ఉగ్రవాద స్థావరాలపై భారత్ సర్జికల్ స్ట్రైక్స్ చేసింది. ఈ సందర్భంగా వింగ్ కమాండర్ నడుపుతోన్న యుద్ధ విమానం పాక్ భూభాగంలో కూలింది. ఈ సందర్భంగా అభినందన్ వర్ధమాన్‌ను పాక్ భద్రత బలగాలు.. చుట్టుముట్టి బంధించాయి. ఈ నేపథ్యంలో యుద్ధంలో దొరికిన జవాన్లను తిరిగి వారిని స్వదేశానికి అప్పగించాలంటూ గతంలో జనీవా ఒప్పందం మేరకు.. అభినందన్ వర్ధమాన్‌కు భారత్‌కు అప్పగించారు. అయితే పాక్ భద్రతా బలగాలు.. అభినందన్ వర్ధమాన్‌ను భారత్‌కు అప్పగించిన వెంటనే అతడికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అతడిని మానసికంగా లేదా శారీరకంగా ఏమైన హింసించారా అని వైద్య పరీక్షలు చేశారు. ఆ తర్వాత అతడిని ఎయిర్ ఫోర్స్ సిబ్బందికి అందజేశారు. ఇక అతడిని యుద్ధ విమానాలు నడిపేందుకు ఎయిర్ ఫోర్స్ ఉన్నతాధికారులు అనుమతి నిరాకరించారు. దీంతో ఆయన కొంత కాలం పాటు కార్యాలయ విధుల్లోనే నిమగ్నమయ్యారు. కొంత కాలం తర్వాత అతడికి ఎయిర్ ఫోర్స్ యుద్ధ విమానాలను నడిపే బాధ్యతను కట్టబెట్టింది. 2004లో ఆర్మీలో అభినందన్ వర్ధమాన్ ప్రవేశించారు. ఆయన తండ్రి గతంలో ఆర్మీలో పని చేసి రిటైర్ అయ్యారు. అలాగే ఆయన సోదరుడు సైతం ఆర్మీలో విధులు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.

## కాంగ్రెస్ వారికే అధిక బాధలు



**బెంగళూరు-నవభూమి:** పహల్గాం దాడి ప్రతీకారానికి భారతసైన్యం 'ఆపరేషన్ సిందూర్' పేరిట ప్రయోగించిన మిస్సైల్స్ పాకిస్థాన్ వాసులకంటే కాంగ్రెస్ నాయకులకే ఎక్కువ బాధ కలిగినట్లు అనిపిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర వ్యంగ్యం చేశారు. గురువారం ఎక్స్‌లో విజయేంద్ర ఘాటుగా స్పందించారు. రెండుమూడు రోజులుగా కొందరు కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలు పరిశీలిస్తే పాకిస్థాన్ మిలిటరీ అధికారిక సమాచారాన్ని తలపిస్తున్నాయన్నారు. సీఎం సిద్దరామయ్య ఇండియన్ మిలిటరీ చర్యలను వ్యతిరేకించి పాకిస్థాన్ ప్రశంసలు పొందారన్నారు. ఓ కాంగ్రెస్ నేత పాకిస్థాన్ బీజేపీకి వ్యతిరేకమని, తమకు కాదని వ్యతిరేకిస్తారన్నారు. పాకిస్థాన్‌కు చెందిన ఎంతోమంది ఉగ్రవాదులు అంతర్జాతీయస్థాయిలో నేరస్తులుగా ముద్రపడినవారని, ముంబైతోపాటు పలు దాడులకు కారకులన్నారు. కాగా ప్రతిపక్షనేత అశోక్ మీడియాతో మాట్లాడుతూ మంత్రి ప్రియాంకఖర్గే నేరుగా ఇందిరాగాంధీకి ఉత్తరాధికారి తరహాలో మాట్లాడుతున్నారన్నారు. జాతీయకాంగ్రెస్ బాధ్యతలను జూనియర్ ఖర్గేకు కాంట్రాక్టు ఇచ్చారా..? అంటూ ప్రశ్నించారు. ఆయన సొంత జిల్లా కలబురగిలో ఇటీవల ఎస్ఎసఎల్సీ ఫలితాలలో అత్యంత తక్కువశాతం ఉత్తీర్ణత సాధించారనేది తెలుసుకుంటే బాగుంటుందన్నారు. మీ జ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. ఎందుకో రాహుల్‌గాంధీని వదిలి ఇందిరాగాంధీని పొడుగుతున్నారన్నారు. మీ తండ్రి మల్లికార్జున ఖర్గే 50ఏళ్లు కాంగ్రెస్?లో పనిచేసినా ముఖ్యమంత్రి కాలేదని, కానీ ఇందిరాగాంధీకి ఉత్తరాధికారి కావాలనే కలలు సాధ్యమా.. అన్నారు. పాకిస్థాన్ దేశస్తులు మీడియాతో మాట్లాడినవేళ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం సిద్దరామయ్యలు మాట్లాడిన వీడియోలను వాడుతున్నారని, ఇది దేనికి సంకేతమన్నారు.


## జమ్మూకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్... ముగ్గురు ఉగ్రవాదులు హతం

**జమ్మూకశ్మీర్,-నవభూమి:** జమ్మూకశ్మీర్ అవంతిపొరాలో ఎన్‌కౌంటర్ జరిగింది. నాదర్, ట్రాల్ ప్రాంతాల్లో భద్రతాబలగాలు, ఉగ్రవాదులకు మధ్య ఎన్‌కౌంటర్ కొనసాగుతోంది. అటవీప్రాంతంలో ఉగ్రవాదులు నక్కి ఉన్నారన్న సమాచారంతో భద్రతాబలగాలు రంగంలోకి దిగాయి. ఈ నేపథ్యంలో ఈరోజు (గురువారం) ఉదయం భద్రతాబలగాలు, ఉగ్రవాదులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో జైషే మహ్మద్‌కు చెందిన ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా దళాలు హతం చేశాయి. కాగా జమ్మూకశ్మీర్‌లో గడిచిన 48 గంటల్లో ఇది రెండో ఎన్‌కౌంటర్. జమ్మూకశ్మీర్‌లోని పలు ప్రాంతాల్లో ఉగ్రవాదులు దాగి ఉన్నారన్న అనుమానంతో భద్రతాబలగాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. అటవీప్రాంతాల్లో అణువణువు జల్లెడపడుతున్నాయి. సమస్యాత్మక ప్రాంతాల్లో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. పహల్గాం నిందితులు, ఉగ్రవాదులను భద్రతాబలగాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఆ వేటలో భాగంగానే ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయి. కొన్ని కొత్త ప్రదేశాల్లో ఉగ్రవాదులు దాగి ఉన్నట్లు గుర్తించిన భద్రతా బలగాలు వారి కోసం గాలింపు చర్యలు చేపట్టాయి. పాకిస్థాన్ నుంచి వచ్చిన చొరబాటు ఉగ్రవాదులను మట్టుబెడుతున్నాయి. ఈరోజు ఉదయం టెర్రరిస్టుల కోసం గాలించగా నాదర్ , ట్రాల్ ప్రాంతాల్లో తారసపడ్డారు. భద్రతాబలగాలను చూసిన వెంటనే ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. వెంటనే భద్రతాబలగాలు కూడా ప్రతిగా కాల్పులు జరుపుతున్నాయి. అయితే ఈ కాల్పుల్లో ఓ ఉగ్రవాది మరణించినట్లు సమాచారం. మరో ముగ్గురు నలుగురు ఉగ్రవాదులు ఉండవచ్చనే అనుమానాలు ఉన్నాయి. అవంతిపొరాలో ఎదురుకాల్పులపై కేంద్ర హోంశాఖ, రక్షణ శాఖ ఆరా తీసింది. కాగా.. రెండు రోజుల క్రితం కూడా షోపియాన్ ప్రాంతంలో జిన్‌పాథర్ కెల్లర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. ఆపరేషన్ కెల్లార్ పేరుతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఉగ్రవాదులు హతమవడంతో పాటు భారీగా ఆయుధాలను స్వాధీనం చేస్తున్నారు. అంతేకాకుండా మందుగుండు సామాగ్రిని కూడా భద్రతాబలగాలు స్వాధీనం చేసుకున్నారు. మొత్తానికి పహల్గాం దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులను పట్టుకోవాలనే సంకల్పంతో భద్రతాబలగాలు ముందుకు సాగుతున్నాయి.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 హైదరాబాద్
శుక్రవారం
16 ၊ మే ၊ 2025
ఎడిట్ పేజీ

## టిక్‌టాక్ స్టార్‌ను కాల్చి చంపిన ఆగంతకుడు

**మెక్సికో-నవభూమి:** ఒక భయానకమైన సంఘటన చోటు చేసుకుంది. టిక్‌టాక్‌లో బాగా పాపులర్ అయిన వలెరియా మార్కెజ్ (23) అనే యువతిని దారుణంగా హత్య చేశారు. %దీఎ: ౧బజూఘని౿ ణవం౧ ఎ 15 మీ౹ం 2025 1:23 ౹రావీ రాష్ట్రుతీవ%: మెక్సికోలో ఒక భయానకమైన సంఘటన చోటు చేసుకుంది. టిక్‌టాక్‌లో బాగా పాపులర్ అయిన వలెరియా మార్కెజ్ (23) అనే యువతిని దారుణంగా హత్య చేశారు. బ్యూటీ, మేకప్ వీడియోలతో టిక్‌టాక్‌లో బాగా పాపులర్ అయిన యువ సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్‌ను లైవ్ స్ట్రీమింగ్ చేస్తుండగానే దారుణంగా కాల్చి చంపేశారు. గౌడలజారా నగరంలోని ఒక బ్యూటీ పార్లర్‌లో ఆమె లైవ్ స్ట్రీమింగ్ చేస్తుండగా.. ఒక వ్యక్తి గదిలోకి వచ్చాడు. "వలెరియా నువ్వేనా?" అని అడిగాడు. ఆమె "అవును" అని చెప్పేలోపే, అతను ఆమె ఛాతీ, తలపై గన్‌తో కాల్చేశాడు. వలెరియా అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఈ దారుణ హత్యకు గల కారణాలపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో ఆమె అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. %కూశ్రీంశీ =ఘు౹% - బుమ్రా? గిల్? 5 టెస్టుల ఇంగ్లండ్ టూర్.. టీమ్ ఇండియా ను నడిపేదెవరు? వలెరియా మార్కెజ్ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండేది. ముఖ్యంగా టిక్‌టాక్‌లో ఆమెకు పెద్ద సంఖ్యలో ఫాలోవర్లు ఉన్నారు. ఆమె తన లైవ్ స్ట్రీమింగ్‌ల ద్వారా ఎంతో మంది అభిమానులను సంపాదించుకుంది. అయితే, ఇలా లైవ్‌లో ఉండగా ఆమె హత్యకు గురికావడం అందరినీ కలచివేస్తోంది. ఆగంతకుడు నేరుగా గదిలోకి వచ్చి వలెరియాను గుర్తించి కాల్చడం చూస్తుంటే, ఇది పథకం ప్రకారం



## సిరియా కోలుకొనేది ఎప్పుడో?

ప్రచ్ఛన్న యుద్ధ కాలం నుంచి నేటి ఉక్రెయిన్ వివాదం వరకు రష్యాకు విశ్వసనీయ మిత్రుల జాబితాలో అగ్ర స్థానంలో ఉన్న దేశం సిరియా. వామపక్ష భావజాలం కంటే సిరియా భౌగోళిక స్థానమే వాణిజ్య అవసరాలరీత్యా ఆ అరబ్ దేశానికి రష్యాను అత్యంత సన్నిహితం చేసింది. ప్రపంచవ్యాప్తంగా రష్యా ప్రభావం అంతరించిపోయిందని భావించిన క్రమంలో దశాబ్దం క్రితం సిరియాలో అమెరికా అనుకూల తిరుగుబాటుదారుల కారణాన బషార్ అల్ అస్సాద్ సర్కారు పతనపు అంచుకు చేరింది. రష్యా ఆ కీలక సమయంలో బషార్ ప్రభుత్వానికి సైనికంగా చేయూతనిచ్చి నిలబెట్టింది. తద్వారా తాము ఇంకా అమెరికాకు అడ్డుకట్ట వేయగలుగుతామని ప్రపంచానికి రష్యా సంకేతాలు పంపించింది.

అత్యధికులు అభిప్రాయపడుతున్నట్లుగా సిరియాలో ప్రస్తుత పరిణామాలు షియా సున్నీ తెగల మధ్య అధికార పోరాట పర్యవసానాలు ఎంత మాత్రం కాదు. అవి, మూమ్మాటికీ గ్యాస్ విపణిపై పట్టు కోసం జరుగుతున్న పోరాటం విపరిణామాలే. చమురు, సహజ వాయువు నిల్వలు అపారంగా ఉన్న అరబ్బు నేల నుండి ఐరోపాకు వెళ్లే మార్గంలో భౌగోళికంగా అనువైన ప్రదేశంలో మధ్యధరా సముద్రం తీరంలో సిరియా ఉండడంతో అక్కడ అస్మదీయ పాలకులు అవసరం.

టర్కీ, ఐరోపా ఖండం తమ చమురు, గ్యాస్ అవసరాల కొరకు రష్యాపై ఆధారపడుతున్నాయి. వాటి ఈ అనివార్యతను రష్యా తన వజ్రాయుధంగా వాడుకొంటోంది. అమెరికా, ఐరోపా దేశాలు రష్యా అధిపత్యాన్ని నిర్మూలించి దాని ఆర్థిక మూలాలను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో బెలరూస్, ఉక్రెయిన్ ఉద్రిక్తతలు తెరపైకి వచ్చాయి. రష్యా తరహా భారీ నిక్షేపాలు ఉన్న ఇరాన్, ఖతర్ దేశాలు కూడ గ్యాస్ విపణిపై పట్టుకొరకు ప్రయత్నిస్తున్నాయి. అమెరికా ఆంక్షల కారణాన ఇరాన్ వెనుకంజలో ఉండగా ఖతర్ మాత్రం ముందుకు దూసుకెళ్లుతోంది. ఖతర్ నుండి పైపు లైను ద్వార ఐరోపాకు చమురు, గ్యాస్ సరఫరాలకు సిరియా సహకారం అనివార్యం. అమెరికా, ఐరోపా, టర్కీలు ఖతర్‌కు ఈ విషయమై బాసటగా నిలుస్తున్నా సిరియా అందుకు అంగీకరించడం లేదు. తమకు అన్ని విధాలుగా అండగా ఉంటున్న రష్యా, ఇరాన్‌లను కాదని ఖతర్ ప్రతిపాదనకు సిరియా అంగీకరించలేదు, అధ్యక్షుడు బషార్ అల్ అస్సాద్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటుకు ఇది ఒక ప్రధాన కారణమని విశ్లేషకుల అభిప్రాయం.సిరియాలోని మధ్యధరా సముద్రతీర ప్రాంతాలలో నౌకా, వైమానిక దళాల స్థావరాలను నెలకొల్పుకోవడం ద్వారా ఐరోపాకు అవసరమైన చమురు సరఫరా జరుగుతుండే సముద్ర మార్గాలపై తన పట్టును పటిష్ఠపరచుకోవడానికి రష్యా ప్రయత్నిస్తోంది. అలాగే కీలక జలాల్లో నాటో, అమెరికాలను నిలువరించడం, తమపై తిరగబడ్డ ఉక్రెయిన్, బెలరూస్ దేశాల భూభాగాల ద్వారా కాకుండా ప్రత్యామ్నాయంగా తన గ్యాస్, చమురు సరఫరా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడానికి రష్యా సంకల్పించింది. ఇందుకు మిత్ర దేశమైన సిరియా సముద్ర తీరం రష్యాకు కలిసి వచ్చింది. చమురు ఉత్పాదక దేశమైన రష్యా మధ్యధరా తీరంలోని లిబియాతో సహా అవతలి వైపు ఉన్న చమరు ఉత్పాదక అరబ్బు దేశాలలో కూడ తన పలుకుబడిని పెంచుకున్నది. సిరియాలో బషార్ అల్ అస్సాద్ ప్రభుత్వాన్ని పరిరక్షించడం ద్వారా రష్యా తన సైనిక, ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకున్నది. కీలక ప్రపంచ వ్యవహారాలలో తన పాత్ర, అభీష్టం కూడా ఉంటుందని దౌత్యపరంగా సూచనలు పంపింది.బషార్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా దశాబ్దానికి పైగా పోరాడుతున్న తిరుగుబాటుదారులకు అమెరికా, టర్కీ, కొన్ని గల్ఫ్ దేశాలు బాసటగా ఉన్నాయి. అయినా తిరుగుబాటుదారులను రష్యా వైమానిక దళాల సహాయంతో నిర్దాక్షిణ్యంగా అణిచివేయడం ద్వారా తన అధికారాన్ని బషార్ కాపాడుకోగలిగారు. ఇరాన్, దాని అనుకూల సాయుధ షియా బృందాలు కూడా బషార్‌కు పూర్తిగా మద్దతుగా నిలిచాయి. బయటి నుండి ఎంత మద్దతు పొందినా స్థానికంగా తిరుగుబాటుదారులతో సంధికి కాదు కదా కనీసం చర్చలు జరిపేందుకు సైతం సిరియా ప్రభుత్వం ముందుకు రాలేదు. తిరుగుబాటును బషార్ ప్రభుత్వం పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చిందని అత్యధికులు భావించారు, బషార్‌ను గద్దె దించడం వీలుకాదని చాలా మంది విశ్వసించారు. అయితే అనూహ్యంగా గత పక్షం రోజులలో ఎలాంటి ప్రతిఘటన లేకుండా సిరియా సైనిక దళాలు స్వచ్ఛందంగా తిరుగుబాటుదారులకు లొంగిపోవడంతో బషార్ ప్రభుత్వం పతనమయింది. ఇది చాలా ఆశ్చర్యకరమైన పరిణామం.సరే, బషార్ దేశం నుంచి పరారయ్యారు. ఇప్పుడు సిరియాను ఎవరు ఏ విధంగా పాలించనున్నారు? ఇదే అందరినీ వేధిస్తున్న ప్రశ్న. సద్దాం హుస్సేన్ తర్వాత ఒకప్పటి అరబ్బు అగ్రరాజ్యం, విభిన్న సంస్కృతుల సమ్మేళనమైన ఇరాఖ్ విచ్ఛన్నమై ఉగ్రవాదానికి ఊతమైంది. పొరుగున ఉన్న ఇరాఖ్‌లో వలే సిరియాలో కూడ క్రైస్తవులు, షియా, సున్నీ తెగల ముస్లింలు కలిసి మెలిసి నివసిస్తున్నారు. ఈ రెండు దేశాలలోనూ సిరియా క్రైస్తవుడయిన మైఖెల్ అఫ్లాఖ్ స్థాపించిన (వామపక్ష భావజాల ప్రభావిత) బాత్ పార్టీ సైనిక కమాండర్లు సద్దాం హుస్సేన్, బషార్ అల్ అస్సాద్ తండ్రి హాఫెజ్ అల్ అస్సాద్‌లు ఇరాఖ్, సిరియా దేశాధినేతలుగా సుదీర్ఘకాలం పాలించారు. వర్గ ప్రయోజనాల కంటే జాతీయ ప్రయోజనాలలకు బాత్ పార్టీ భావజాలం ప్రాధాన్యమిస్తుంది.

అరబ్బులలో అభ్యుదయ భావాలు కలిగి లౌకిక వాదం వర్ధిల్లిన ఏకైక దేశం సిరియా కూడా ఎట్టకేలకు ఇస్లామిక్ మతఛాందసవాదుల చేతికి చిక్కిందని చెప్పవచ్చు. అల్‌ఖైదా ఒడిలో పెరిగిన ఉగ్రవాది అబూ మోహమ్మద్ అల్ జ్వాలనీ ఆచూకీ తెలిపితే పది మిలియన్ డాలర్ల పారితోషికాన్ని ఇస్తామని అమెరికా ఒకప్పుడు ప్రకటించింది. మరి అదే జ్వాలనీ నేడు సిరియాను పూర్తిగా తన గుప్పిట్లో పెట్టుకుంటే పరాయి దేశం వ్యవహారంతో తమకు సంబంధం లేదని అమెరికా ప్రక్కకు తప్పుకున్నది! ఇది, ప్రపంచ అగ్రరాజ్య ద్వంద్వ నీతిని ప్రతిబింబిస్తుందనడంలో సందేహం లేదు.

# మారోజు వీరన్న మార్గం విముక్తి మార్గం



వర్గం గురించి మాట్లాడే వాళ్ళకు వర్గం అర్థం అయినంతగా మార్క్స్ లెనిన్ మావో అర్థం అయినంతగా కులం అర్థం గాలే. మహాత్మజ్యోతి బాపులే, డాక్టర్ విశ్వరత్న భీంరావ్ అంబేద్కర్ (బాబా సాహెబ్ అంబేద్కర్ అనే పేరు బ్రాహ్మణ పేరు కాబట్టి ఆ పేరు రాస్తే భీం రావ్ గురించి కాకుండా బ్రాహ్మణుని గురించి రాసినట్టు ఉంటది. చరిత్ర భీం రావుది పేరేమో బ్రాహ్మణునిది. ఇది ఒక పెద్ద మోసం. నిత్యం భీం రావ్ కాకుండా మన నాలుకల మీదా బ్రాహ్మణ పేరు ఉచ్చరించ బడుతుంది, కలం నుండి రాయబడుతుంది. ఇక నుండి ఆ పేరు రాయదల్చుకోలేదు, అనదల్చుకోలేదు. ఎవరు ఏమనుకున్నా సరే నేను మాత్రం డాక్టర్ విశ్వరత్న భీం రావ్ అంబెవాడేకర్ అనే పిలుస్తాను. ఇది అమ్మ నాన్న పెట్టిన పేరు) అర్థం గాలే. దానితో పాటు జెల్ జెమీన్ జంగల్ పై సర్వహక్కులు మావే అని గరించి మా గూడెంలో మా రాజ్యం కావాలని నినదించి తెగలను ఏకంచేసి పోరాడిన కొమరం భీం కూడా అసల్ అర్థం గాలే. అంతే కాకుండా ప్రాంతం, జాతి, జెండర్, మతం కూడా అర్థం గాలే.

కులం గురించి మాట్లాడే వాళ్ళకు కులం అర్థం అయినంతగా మహాత్మజ్యోతి రావ్ పూలే, డాక్టర్ విశ్వరత్న భీం రావ్ అంబెవాడేకర్ అర్థం అయినంతగా,వర్గం అర్థం గాలే, కారల్ మార్క్స్, లెనిన్, మావో అర్థం గాలే. అదే విధంగా కొమరం భీం తెగల పోరాటాలు, ప్రాంతం, జాతి, జెండర్, మతం కూడా పూర్తిగా అర్థం గాలే. కానీ ఈ సప్త సమస్యలను అర్థం చేసుకున్న సత్యకామజాబాలి అలియాస్ కామ్రేడ్ మారోజు వీరన్న ప్రపంచ విప్లవ గతితార్కిక చారిత్రక భౌతిక వాద చలన సూత్రం ప్రకారం ఇండియా విప్లవాన్ని ఇండియా బాట పట్టించిన వాడు. నూతన ప్రజాస్వామిక విప్లవం గాదు దళిత బహుజన ప్రజాస్వామ్య శ్రామిక విప్లవం వర్ధిల్లాలి అన్నాడు. కామ్రేడ్ మారోజు వీరన్న. దాని కోసం తన ప్రాణాన్ని సయితం లెక్క చేయకుండా తృణప్రాయంగా వదిలినవాడు. కారల్ మార్క్స్ పీడిత ప్రజలను ఏకం చేసి దోపిడీ రాజ్యాలను కూలదోయడానికి ప్రపంచకార్మికులారా ఏకం కాండి అని కమ్యూనిస్టు మెనిపెస్టో రాసి ప్రపంచ కమ్యూనిస్టు విప్లవానికి పునాదులు వేస్తే, అదే మార్క్స్ రాసిన కమ్యూనిస్టు మెనిపెస్టో అర్థం చేసుకొని రష్యా లెనిన్ ఆ దేశ భౌగోళిక పరిస్థితులకు అనుకూలంగా కమ్యూనిజాన్ని అన్వయించి రష్యాలో ఏం చేయాలి అని రాసి బోల్షివిక్ ల ఆధ్వర్యంలో రాజరిక రాజ్యానికి చరమగీతం పాడి రష్యా విప్లవం సాధించాడు. అదే విధంగా చైనా మావో జెడాంగ్ కారల్ మార్క్స్ రాసిన కమ్యూనిస్టు మెనిపెస్టో ను, రష్యాలో ఏం చేయాలి అని లెనిన్ రాసిన బోల్షివిక్ మెనిపెస్టో ను అర్థం చేసుకోని చైనా భౌగోళిక పరిస్థితులకు కమ్యూనిజాన్ని అన్వయించి చైనాలో ఏం చేయాలి అని రాసి ఆ దేశ కూలీలను పేద ప్రజలను ఏకం చేసి భూస్వామ్య పెత్తందారు విధానానికి వ్యతిరేకంగా పోరాడి చైనాలో విప్లవం సాధించాడు. కామ్రేడ్ మారోజు వీరన్న కూడా అదే విధంగా మార్క్స్, లెనిన్, మావో సిద్ధాంతాని, పూలే, కోమరం భీం, భీంరావ్ అంబెవాడేకర్ ఆలోచన విధానాన్ని జోడించి ప్రాంతం, సమస్య, జెండర్ సమస్య, మతం సమస్య, తెగ సమస్య అర్థం చేసుకోని ఏ దేశంలో విప్లవం రావాలన్నా ఆ దేశం యొక్క వెయ్యేండ్ల చరిత్రను అధ్యయనం చేయి అని మావో అన్నట్టుగా మారోజు వీరన్న రహస్య జీవితం గడుపుతూ ఈ దేశం ఐదు వేల సంవత్సరాల చరిత్రను రెండున్నర సంవత్సరాలు అధ్యయనం చేసి మార్క్స్ చెప్పినట్టు ప్రపంచం మొత్తం వర్గ పోరాటాల మయమే కావొచ్చు కానీ ఈ దేశంలో మొత్తం కులపోరాటాల మయమే అని చెప్పిన భీం రావ్ అంబెవాడేకర్ మాట ప్రకారం, ఈదేశంలో విప్లవం రావాలి అంటే ఈ దేశ భౌగోళిక పరిస్థితులకు కమ్యూనిజాన్ని అన్వయించి పోరాడితే కానీ విప్లవం రాదనీ, ఐదు వేల సంవత్సరాల నుండి ఒక సామాజిక విప్లవం కూడా ఇక్కడ సక్సెస్ కాకపోడానికి బ్రాహ్మణీయ మనువాద సమాజంమే కారణం అని తేల్చి కుల వర్గ జంట జమిలి పోరాటానికి పిలుపునిస్తూ ఈ దేశ భౌగోళిక పరిస్థితులకు అనుకూలంగా కమ్యూనిజాన్ని అన్వయించి ఇండియాలో ఏం చేయాలి అనే సిద్ధాంతా గ్రంధాని రాసి ఇండియా విప్లవానికి సైరన్ ఊదిన మహనీయుడు. వర్గ దోపిడీ కులం పునాదులపై పరిడవిల్లుతున్నది. అది అగ్రకుల దోపిడీ వర్గం అయిన బ్రాహ్మణ క్షత్రియ వైశ్య ఆర్యజాతి. పీడిత వర్గం అయిన దళిత బహుజన ద్రావిడ నాగజాతిని కులం పునాదులపైననే దోపిడీ చేస్తున్నధి, కూటికీ తక్కువైనా కులానికి తక్కువనా అనే ఈ మనువాద దోపిడీ ససమాజన్ని నేల కూల్చాలి అంటే కులవర్గ జంట జమిలి పోరాటం మారోజు మార్గమే సరైనదారి. భారత కమ్యూనిస్టు పార్టీ,

భారత కమ్యూనిస్టు పార్టీ (ఎమ్), భారత కమ్యూనిస్టు పార్టీ (ఎమ్,ఎల్), భారత కమ్యూనిస్టు పార్టీ (జనశక్తి), భారత కమ్యూనిస్టు పార్టీ (న్యూడెమోక్రసీ), భారత కమ్యూనిస్టు పార్టీ (పీపుల్స్ వార్), భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) అన్ని కమ్యూనిస్టు పార్టీలు కూడా భారత అనే పదాన్ని పెట్టుకున్నాయి. ఆర్య బ్రాహ్మణ జాతికి సంబంధించిన ఈ పదాన్ని పెట్టుకోని ఊరేగుతూ అన్ని కమ్యూనిస్టు పార్టీలు కూడా అంతర్జాతీయ ఆర్య బ్రాహ్మణ భరత జాతి దోపిడీ వర్గ మనువాద కుల సమాజానికి వ్యతిరేకులం కాము, మేము మీ సంతతి వాలమే, మీ బానిసత్వపు బావజాలం కలిగిన వాలమే అని చెప్పకనే చెప్పినట్టు ఉన్న ఈ మూస విదానాన్ని, భారత అనే బ్రాహ్మణీయ జాతి పద ప్రయోగ మార్మికతలో ఉన్న రహస్య గుట్టు రట్టు జేసి భారత అనే పదాన్ని నిషేధించినవాడు, భారత అనే పదం వాడినంతకాలం ఆర్యబ్రాహ్మణ దోపిడీ వర్గ, కుల బానిసత్వాని ఆమోదించినట్టేనన్ని వ్యతిరేకించిన వాడు కామ్రేడ్ మారోజు వీరన్న. అందుకే తను స్థాపించిన కమ్యూనిస్టు పార్టీకి ఇండియా సంయుక్త రాష్ట్రాల కమ్యూనిస్టు పార్టీ (దళిత బహుజన శ్రామిక విముక్తి) అని పేరు పెట్టాడు. ఆ పార్టీ స్థాపన కూడా అంబెవాడేకర్ పార్లమెంట్ లో మనుస్మృతి ని తగిలేసిన డిసెంబర్ 25న ఏర్పాటు చేసి ఆర్యబ్రాహ్మణ మనువాద వర్గ కుల దోపిడి సమాజానికి చావు దరువు కొడుతూ ఇండియా విప్లవాని ఇండియా బాటపట్టించిన వీరుడు. ఇండియా అనే పదాన్ని వాడి ఆర్య బ్రాహ్మణజాతి పేరైన భారత పదాని బొంద పెట్టి తొట్టతొలి విప్లవానికి పునాది వేసినవాడు మారోజు వీరన్న.

ఇండియాను రాష్ట్రాలుగా విభజించలేదు. అనేక రాష్ట్రాల కలయికనే ఇండియా అని అమెరికా సంయుక్త రాష్ట్రాలు ఎట్లనో అలాగే ఇండియా సంయుక్త రాష్ట్రాలు కూడా అంతే అని అందుకోసం దీని యు ఎస్ ఐ అని పిలవాలని చెప్పడం జరిగింది. ఈ దేశంలో విప్లవం వస్తే దళిత బహుజన శ్రామిక విముక్తి జరిగిన నాడే నిజమైన విప్లవం లేనిచో అది బూర్జువా మనువాద బ్రాహ్మణీయ బానిస విప్లవమే అవుతుంది తప్ప అది దళిత బహుజన ప్రజాస్వామ్య శ్రామిక విప్లవం కాదని హెచ్చరించాడు. ఆ దళిత బహుజన ప్రజాస్వామ్య శ్రామిక విప్లవం కోసంమే ఈ ఇండియా



సంయుక్త రాష్ట్రాల కమ్యూనిస్టు పార్టీ పనిచేస్తుందని పోరాడుతుందని పేర్కొన్నాడు.

ఒంటరి వర్గపోరాటం ఒంటరి కులపోరాటం ఒంటి చేతి చప్పట్ల మోతే అన్నాడు వీరన్న. ఒంటి చేతితో కొడితే చప్పట్లు రావు అలాగే ఒంటరి వర్గపోరాటాలు ఒంటరి కులపోరాటాలు విప్లవాలు తేవు అని కామ్రేడ్ మారోజు వీరన్న కుండబద్దలు కొట్టినట్టు విప్లవ రహస్య సూత్రాన్ని విప్పిచెప్పినవాడు. అటు వర్గం గురించి మాట్లాడే వాళ్ళకు ఇటు కులం గురించి మాట్లాడే వాళ్ళకూ ఒకటే మార్గం అదే మారోజు మార్గం. ఆ పోరాటంమే కుల వర్గ జంట జమిలి పోరాటం. ఆ పోరాటంలో పాల్గొనడమే ఒంటరి వర్గవాదులకు ఒంటరి కుల వాదులకు శరణ్యం.

ఉమ్మడి బహుజన ఒంటరి కులవాదం ఉమ్మడి కార్మిక ఒంటరి. వర్గ వాదం మాట్లాడే వాళ్ళకు

ఉమ్మడి జాతీయ వాదం పేరు మీద అదికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కు ఉమ్మడి హిందూ మతం పేరు మీద అధికారంలోకి వచ్చిన బీజేపీ కీ ఏమి తేడా లేదు. జాతీయ వాదం పేరు మీద బ్రిటిష్ సంతతికి చెందిన ఆర్యబ్రాహ్మణ మనువాద శ్రీవైష్ణవులు అదికారంలోకి వస్తే, హిందూ మతం పేరు మీద ఆర్యబ్రాహ్మణ సంతతికి చెందిన వైష్ణవులు అదికారంలోకి వచ్చారు. అలాగే ఉమ్మడి బహుజన ఒంటరి కులవాదం పేరు మీద అదికారంలోకి వస్తే ఏ కులాలు చదువుతో పాటు అనుభవ జ్ఞానం పొంది ముందుగా చైతన్యం అయిన కులం ఏదో అదే అదికారంలోకి వస్తది అదే సకలరంగాలల్లో అభివృద్ధి చెంది మిగతా కులాలను అన్చివేసే ప్రమాదం ఉన్నది.

అలాగే ఉమ్మడి కార్మిక ఒంటరివర్గ వాదంతో అదికారంలోకి వస్తే ఈ దేశ సామాజిక పరిస్థితుల బట్టి ప్రతి కార్మికునికి కులం ఉన్నది కాబట్టి ఏ కులం అయితే చదువుతో పాటు అనుభవ జ్ఞానం పొంది ముందుగా చైతన్యం పొది వర్గపోరాటానికి నాయకత్వం వహిస్తున్నదో అదే కులం ఆ విప్లవ పునాదులపై తన సామాజిక వర్గాన్ని బలోపేతం చేసుకోని మిగతా వర్గాలను కులాలను అన్చివేస్తుంది. కాబట్టి కామ్రేడ్ మారోజు వీరన్న ప్రతి కులం తన హక్కుల కోసం అస్తిత్వం కోసం పోరాడుతునే తన లాగ అన్చివేతకు గురైన కులాలను వర్గాలను తెగలను జాతులను మైనారిటీలను కలుపుకోని అదికారంలోకి రావాలి అని పిలుపునిచ్చాడు. ప్రతి కులం తన జనాభాను మించి ఒకశాతం కూడా ఎక్కువ వాటాను పొందకుండా సామాజిక న్యాయం కోసం వర్గీకరించుకోవాలి సామ్యవాద న్యాయం కోసం వర్గీకరించుకున్న వాటాను ఆ కులంలో ఇప్పటి వరకు ఎలాంటి ఆస్తి లేనటువంటి. ఏలాంటి బతుకు తెరువు లేనటువంటి. ఎలాంటి ప్రయోజనాలు పదవులు పొందని కుటుంబాలకు ముందుగా పంచాలి అని చెప్పాడు. అంతిమంగా సర్కార్ లేని కమ్యూనిస్టు సమాజం పరిడవిల్లాలి అని పోరాటం చేసాడు. అధికారం సంగతి అక్కడ పోనీ, నిలువున కూలిపోతున్నప్పుడు, దిక్కు లేని పచ్చులై తుపాకీ గొట్టాన్ని గొంతు కాడపెట్టుకోని పందిని చంపే బదులు మమ్మల్ని చంపండని ఎరుకలి వాలు లబ లబ నోరుకొట్టుకుంటు మొత్తుకొని ఏడుస్తున్నా వదలకుండా

మెదడు వాపు పేరు మీద పందులసంపి ఎరుకల జీవన విధానాన్ని, వృత్తిని నాశనం చేసి ఎరుకల బతుకులు నేలకూలుస్తున్నప్పుడు ఒక్కడంటే ఒక్కడు వచ్చి అడిగినవాడు లేడు. ఖైర్లాంజిలో గోరం జరుగుతున్నప్పుడు ఎలా చూస్తూ మనువాదు ఊరుకున్నారో అలాగే ఇక్కడ బహుజన వాదులు, మనువాదులు, వర్గవాదులు, చూస్తు ఊరుకున్నారు తప్ప ఆపే ప్రయత్నం చేయలే. పైగా మెదడు వాపు వ్యాధి వచ్చినపుడు సంపుతే తపేందనీ న్యాయవాద తీర్పు ఇవ్వడం జరిగింది. ఏ భీం రావ్ అంబెవాడేకర్ వాదులు గానీ, ఏ ఉమ్మడి బహుజన కులవాదులుగాని, ఏ కమ్యూనిస్టు వర్గవాదులు గానీ, ఏ ప్రజాస్వామిక వాద సంఘాలుగానీ, పార్టీలు గానీ ఈ ఎరుకలి తెగ సమస్యను అర్థం చేసుకోనీ పందుల చంపివేతకు వ్యతిరేకంగా పోరాటం చేయలే. అప్పుడు కామ్రేడ్ మారోజు వీరన్న నీ తెగ సమస్య కోసం నువ్వే పోరాటం చేయాలి, నీ కోసం, నీ అస్తిత్వం కోసం, నీ హక్కుల కోసం, నీ వాటా కోసం, ఎవరు పోరాటం చేయరు చేసినా నీ విజయాన్ని కాంక్షిచరు కాబట్టి నీ తెగ కోసం నువ్వే పోరాడు అని ఎరుకల వాల హక్కుల కోసం, అస్తిత్వం కోసం, చైతన్యం కోసం, జ్ఞానం కోసం, వాటా కోసం, కోటా కోసం, అధికారం కోసం, బ్రాహ్మణీయ మనువాద వర్గ కుల సమాజ అంతరాలను నేలకూల్చడం కోసం, సమసమాజం ఏర్పాటు చేయడం కోసం, ఎరుకల హక్కుల పోరాట సమితి (కుర్రు ) ఏర్పాటు చేయడం జరిగింది. నీలాగే అన్చివేతకు గురయ్యే తెగలతో జతకట్టు, కులాలతో జతకట్టు, జాతులతో జతకట్టు, మైనారిటీలతో జతకట్టు, పేదవర్గాలతో జతకట్టు అంతిమంగా నిన్ను నీవు ఏలుకో అని విప్లవ చైతన్యం నూరి పోసిన యోధుడు కామ్రేడ్ మారోజు వీరన్న. ఇలాగే మాదిగ హక్కుల పోరాట సమితి, దండోరా, మాల సమరభేరీ, గుతుప దెబ్బ, లంబాడి హక్కుల పోరాట సమితి, నంగారభేరీ, గౌడజన హక్కుల పోరాట సమితి, మోకుదెబ్బ, వడ్డెర హక్కుల పోరాట సమితి, గన్నుదెబ్బ, బోయ హక్కుల పోరాట సమితి, విల్లంభు దెబ్బ, బుడగజంగం హక్కుల పోరాట సమితి, గుమ్మెట తంబూర మోత, ఆదివాసీ హక్కుల పోరాట సమితి, తుడుందెబ్బ

యాదవ హక్కుల పోరాట సమితి, డోలుదెబ్బ, డోలుదెబ్బ, బైండ్ల హక్కుల పోరాట సమితి, జమిడీకే మోత, హెూలియ దాసరి సంఘం, వడ్లకమ్మరి హక్కుల పోరాట సమితి, రంపపు కోత, కుమ్మరి హక్కుల పోరాట సమితి, సమ్మటమోత, మంగళి హక్కుల పోరాట సమితి, అసిపే ముస్లిం హక్కుల పోరాట సమితి, క్రిస్టన్ హక్కుల పోరాట సమితి, బారికె హక్కుల పోరాట సమితి, కొజ్జ హక్కుల పోరాట సమితి, చప్పట్ల మోత, చిందు హక్కుల పోరాట సమితి, మద్దెల మోత డక్కలి హక్కుల పోరాట సమితి, కిన్నెర మోత సాకలి హక్కుల పోరాట సమితి, చాకిరేవు దెబ్బ, పిచ్చగుంట్ల హక్కుల పోరాట సమితి, మాదిరాజు హక్కుల పోరాట సమితి, వలదెబ్బ జాలరి హక్కుల పోరాట సమితి, వలదెబ్బ ఇలా ఎన్నో కుల సంఘాలను నిర్మించి ప్రతి కులం తన అస్తిత్వం కోసం పోరాటం చేయాలి, స్వయం గౌరవం కోసం, తనపేరు చివరన కులం పేరు రాసుకోని సగర్వంగా నా కులం ఇది అని చెప్పుకోవాలి. నీ కులం నీవు చెప్పుకోనంత కాలం అబద్రతకు గుర్తై ఒంటరిగా మిగిలి పోతవు. అవమానానికి గురవుతావు.అందుకే నీ కులం పేరు నీవు చెప్పుకో, నీవు ఇంకో కులానికంటే ఎక్కువ అని చెప్పుకోవడం కోసం కాదు, నీ కులం నిన్ను చూసి చైతన్యం పొందడానికి, గుంపుగా ఏర్పడడానికి, అణిచివేతకు, అవమానానికి గురైన నీ కులం తలఎత్తుకోని తిరగడానికి, నీ కులం వాటా కోసం, కోటా కోసం పోరాటం చేస్తూ, నీలాగే అణిచి వేతకు గురైన కులాలను కలుపుకొని అధికారంలోకీ రమ్మని కుల సంఘాలతో పోరాటం చేయించాడు. ఈ కుల సంఘాలకు ఉమ్మడి వేదిక దళిత బహుజన మహసభ. అన్ని ప్రజా సంఘాలను కుల సంఘాలను పార్టీలను కలిపి ఎన్నికల్లో పోటీ చేయడానికి బలమైన ఐక్య సంఘటన ఏర్పాటు చేశాడు అదే మహజన ప్రంటు. లంబాడి తండాలను గ్రామ పంచాయితీలుగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసిన మొట్టమొదటి యోధుడు మారోజు వీరన్న. ఆ డిమాండ్ సాదన కోసం రాజ్యధికారం కోసం లంబాడి హక్కుల పోరాట సమితి ఏర్పాటు చేసి లంబాడి ప్రజలతో హైదరాబాద్ నగరం నడిబొడ్డున నిలబడి నలుదిక్కులు పిక్కటిల్లేలా నంగారభేరీ మోగించి మా తాండాలో మారాజ్యం అనే నినాదంతో సర్కారు ధిగొచ్చి తండాలను గ్రామ పంచాయితీలుగా ప్రకటించినారు. అంటే దానికి ఒకే ఒక్కడు కారణం అతడే మారోజు వీరన్న. మారోజు వీరన్న చిత్ర పటం ప్రతి లంబాడి ఇంటిలో ఉండాలి.ప్రతి తండాలో మారోజు విగ్రహం ప్రతిష్టించాలి. ప్రతిలంబాడ మారోజు మార్గంలో పయనించాలి అతడు కలగన్న బహుజన రాజ్యకోసం పాటుపడాలి. ఒక ప్రాంతం మరొక్కప్రాంతాని దోపిడీ చేస్తునప్పుడు రెండు రాష్ట్రాలుగా విడిపోవడంమే సరైనదనీ ఆంధ్ర అగ్రకుల పెట్టుబడీ దారీ వర్గాల కబంద హస్తాలకింద నలిగిపోతున్న తెలంగాణను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని మొట్టమొదటి సారిగా కమ్యూనిస్టు పార్టీ శిబిరం నుండి గొంతు విప్పి 1996లో తెలంగాణ మహసభ ఏర్పాటు చేసి భౌగోళిక తెలంగాణలో బహుజన రాజ్యధికారం అనే నినాదంతో తెలంగాణ మలి దశ ఉద్యమంతో రాష్ట్ర మంతా అగ్నిగుండంగా మార్చీ నిప్పులు కురిపించిండు. తెలంగాణ, ఆట, పాట, మాట తెలంగాణ రేలా దూలా

ఏర్పాటు చేసీ బహుజన సంస్కృతే తెలంగాణ సంస్కృతనీ మొట్టమొదటి సారిగా తెలంగాణా సంస్కృతి పేరా బహురూపాలా దళిత బహుజన కళలను ప్రపంచానికీ పరిచయం చేసిన వీరాది వీరుడు ధీరుడు కామ్రేడ్ మారోజు వీరన్న

వర్గ కుల జమిలి పోరాటంలో భాగం చేయడానికి విద్యార్థల కోసం బహుజన ప్రజాస్వామ్య విద్యార్థి సమాఖ్య ఏర్పాటు చేసి ఎన్నో విద్యార్థి సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేయించాడు. అలాగే ఆడవాళ్ల కోసం ఆడజన సమాఖ్య ఏర్పాటు చేసి ఆడవాళ్ల మద్యకూడా కులం సమస్య ఉన్నది కాబట్టి దళిత బహుజన స్త్రీల నాయకత్వాని బలోపేతం చేస్తూ కుల వర్గ పోరాటానికి నాయకత్వం వహింపజేషాడు. దళిత బహుజన శ్రామిక రైతు కూలీ సంఘం ఏర్పాటు చేసీ దళిత బహుజన రైతుకూలీలను కార్మికులను కులవర్గ జంట జమిలి పోరాటంలో బాగం చేయించి విప్లవ పోరాటాని ఉగ్రూతలూగించాడు. ఒక విప్లవ కారుని జీవిత కాలం ఒక్క సారి మినుగురు పురుగు మెరిసినంత సమయం. కానీ ఈ చీకటి సమాజాన్ని ఒక్కసారీగా మినుగురు పురుగు వెలుతురుతో ఏ విధంగా చీకటిని చీల్చివేస్తుందో అదే విదంగా ఈ దోపిడీ మనువాద కుల వర్గ సమాజాన్ని విప్లవకారుని మరణం కూడా పటాపంచలు చేసి నేలకూలుస్తుందని విప్లవ కారుల గురించి పగడాల కోదండన్నతో మారోజు వీరన్న మాట్లాడిన సందర్భం ఇది. నిజం కాబోతోంది వీరన్న మరణం జీర్ణించుకోలేని దళిత బహుజన శ్రామిక జనం ఈ మనువాద దోపిడి సమాజాన్ని నేలకూల్చి దళిత బహుజన ప్రజాస్వామ్య శ్రామిక విప్లవం సాదిస్తుంది. ఈనాటి దృవతార రేపటి వెలుగు రేఖ

ఇండియా గతిని మర్చే సిద్ధాంత ధీపిక స్వయం గౌరవ ధిక్కార పతాక సామాజిక సామ్యవాద న్యాయ ధిక్సుచి దళిత బహుజన శ్రామిక రాజ్యధికార ధిక్కు ఇండియా విప్లవ రథ సారథి. ఇప్పుడు వీరన్న గురించి మాట్లాడటం అంటే మార్క్స్, మావో, లెనిన్, పూలే, కొమరం భీం, భీం రావు అంబేద్కర్ గురించి మాట్లాడినట్లే ఈరోజో ఏరోజో ఓరోజు మల్లి రాక మానడు మారోజు.

**(16న మారోజు వీరన్న 26వ వర్ధంతి సందర్భంగా)**

**వూకె రామకృష్ణ,**
**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, సెల్: 98660 73866**


# మానవీయ మహేతిహాసం

భక్తి

రామకథను వాల్మీకి వినిపించి ఎన్ని వేల ఏళ్లు గడిచాయో! అది మొదలు, సీతారాములు భారతీయులకు ఆరాధ్య దంపతులయ్యారు. సర్వ పశు పక్షి జాతుల నుంచి విడివడి విశుద్ధం, విశిష్టం అయిన జీవనపథాన్ని ఏర్పర చుకుంది మానవజా తి. వారికి లభించిన వరం దాంపత్య జీవితం. ఆ జీవన రహస్యాన్ని వాల్మీకి మహర్షి తన రామాయణం నిండా నిక్షేపించాడు.లోక వ్యవహారాన్ని విస్పష్టం గా బోధించిన మహాకావ్యం రామాయ ణం. ఆదికవి వాల్మీకి నుంచి నేటి వరకు రమణీయమైన ఆ రామకథ పలు భాషల్లో, అనేక రీతుల్లో రూపుది ద్దుకొంది. భారతా వనిలోనే కాకుండా, ఈ సంస్క ృతి ప్రసరించిన అన్యదేశాల్లోనూ ప్రశస్తి పొందింది.రామాయణం మానవజాతికి ధర్మ పద్ధతిని ఉపదేశిస్తుంది. అది వేదం వంటిది. పురాణాలు రామాయణాన్ని 'మిత్ర సమ్మితం'గా చెబుతాయి. కావ్యాలు నెచ్చెలిగా వర్ణిస్తాయి.లోకంలో రామాయణం ఒక ఇక్షు సాగరం. ఎక్కడ దోసిలిపట్టి తాగినా తియ్యదనమే! మానవజాతి తాపత్రయాలను పోగొట్టి, శరణాగతి తత్వానికి ప్రాధాన్యమిచ్చి, ఒక్కొక్క కాండలో ఒక్కో రసావిష్కరణ చేశాడు వాల్మీకి.మానవ విలువల్ని అన్వేషిస్తూ రాముడు పయనం సాగించాడు. తాను మానవుడైనందుకు గర్వించాడు. మనసా వాచా కర్మణా పరిపూర్ణ మానవుడిగా జీవించాడు. ప్రతి దేహంలోనూ రాముడు అంతర్యామి. ప్రతి అంతరంగంలోనూ ఆయన ఆనందధాముడు, ఆత్మారాముడు. 'రామ' శబ్దం రామణీయకానికి మారుపేరు.సీతాదేవి ధైర్య, కరుణా సమన్విత. మహెూన్నత ప్రేమమూర్తి. కలవరపరచే కష్టాలు, అవరోధాలను జీవితం నిండా దర్శించింది. తన భర్త పట్ల అచంచల విశ్వాసం, అంకిత భావం గల నారీ శిరోమణి. ఆమె అంటే రావణుడికీ గౌరవభావమే. రామచంద్రుడి ఘనతను ఆమె పెంచింది. ఆయనను సంపూర్ణ మానవుణ్ని చేయడానికి తన జీవితాన్నంతా వెచ్చించింది.లక్ష్మణ భరత శత్రుఘ్నులు ఓంకారంలోని అకార ఉకార మకారాలనే బీజాక్షరాలకు రూపాలు. ఆ మూడూ చేరి 'ఓంకారం' అనే రామశబ్దం ఏర్పడింది. రాముడు శబ్ద బ్రహ్మం. లక్ష్మణుడు గొప్ప సేవకుడు. భరతుడు సత్యశీలుడు. శత్రుఘ్నుడు గుణవంతుడు. హనుమ శక్తి సంపన్నుడైన రామదూత, నీతివర్తనుడు.విశ్వ సోదరభావానికి, మానవ గౌరవానికి, సామాజిక సమన్వయానికి పునాది కుటుంబం అని రామాయణం గుర్తించింది. భిన్న సంస్కృతుల్ని అది దర్శించింది. వాటి మధ్య సమతూకం సాధించగలిగింది. అయోధ్య, కిష్కింధ, లంక- ఆ మూడు చోట్ల భిన్న పరిస్థితులున్నాయి. అక్కడ సంస్క ృతీ సంపన్నులైన రామ సోదరులు, సుగ్రీవుడు, విభీషణుడు- వీరందరి మధ్యనా వాల్మీకి సమతుల్యత సాధించడాన్ని రామాయణం ప్రస్ఫుటీకరిస్తుంది.వేద సంస్కృతి ఒక్కటే కాదు- క్రూర దానవ సంస్క ృతి, పక్షి సంస్క ృతి వంటివీ రామాయణంలో ప్రతిబింబిస్తాయి. జటాయువు, సంపాతి వంటి విహంగాల్లో నిస్వార్థ సేవ, నిబద్ధత, త్యాగచింతన గోచరిస్తాయి.



## మీకూ ఫ్రిడ్జ్ పైన వస్తువులు ఉంచే అలవాటు ఉందా?



రిఫ్రిజిరేటర్ ప్రస్తుతం అన్ని తరగతుల ఇళ్లలోనూ ఉంటోంది. కూరగాయలు, పాలు, పెరుగు నుండి చాక్లెట్లు, డ్రింక్స్, కూరలతో సహా చాలా రకాల ఆహార పదార్థాలు ఫ్రిజ్ లో ఉంటాయి. అయితే ఎప్పుడూ ఫ్రిజ్ లో ఏ ఆహారాలు ఉంచాలి? ఏవి ఉంచకూడదు అని తెలుసుకోవడమే కానీ ఫ్రిజ్ పైన ఉంచకూడదని వస్తువుల ఏంటి? అనే విషయం ఎవరూ పెద్దగా పట్టించుకోరు. చాలా వరకు ఇళ్లలో గమనిస్తే ఫ్రిజ్ మీద కొన్ని వస్తువులు కనిపిస్తూ ఉంటాయి. ఇలా ఫ్రిజ్ మీద వస్తువులు ఉంచడం మంచిదేనా? షాకింగ్ నిజాలు తెలుసుకుంటే..చాలామంది ఇంటి అలంకరణలో భాగంగా మొక్కలను ఇంట్లో టేబుళ్ల మీద, ఫ్రిజ్ మీద ఉంచుతుంటారు. అయితే వెదురు మొక్కను ఫ్రిజ్ మీద ఉంచకూడదట.


ట్రోఫీలు..ఏదైనా పోటీలో లేదా ప్రతిభకు గుర్తింపుగా ట్రోఫీ వస్తే దాన్ని ఇంటికి వచ్చిన వారికి కనిపించేలా పెట్టడం అందరికీ అలవాటు. అయితే ఇలాంటి ట్రోఫీలు ఫ్రిజ్ మీద అస్సలు పెట్టకూడదట.

చేపల అక్వేరియం..ఇల్లు అందంగా కనిపించేందుకు చాలా మంది చేపల అక్వేరియం ఇంట్లో పెట్టుకుంటారు. అయితే చేపల అక్వేరియంను ఫ్రిజ్ పైన పెట్టుకోవడం అస్సలు మంచిది కాదు. ఒక వేళ ఉంచితే అక్వేరియంలో చేపలు తొందరగా చనిపోతాయి.

మందులు..రెగ్యులర్ గా ఉపయోగించే మందులను ఫ్రిజ్ మీద ఉంచడం కొందరి అలవాటు. ఫ్రిజ్ లో నుంచి నీటిని తీసుకుని వాటిని మందులను అక్కడికక్కడే వేసుకుంటూ ఉంటారు. అయితే ఫ్రిజ్ మీద మందులు ఉంచితే ఫ్రిజ్ వేడి కారణంగా మందుల పవర్ తగ్గిపోతుంది.

# మహారాణి మంగమ్మ...






మహారాణి మంగమ్మ... ఈ పేరు ఎప్పుడైనా విన్నారా? మదురై రాజధానిగా పాలించిన నాయక రాజుల వంశానికి చెందిన ఈ తెలుగు రాణి గురించి మనకు తెలిసింది చాలా తక్కువ. తాజాగా ఆమె గురించి... 'మధుర మహారాణి మంగమ్మ' అనే పరిశోధనాత్మక చారిత్రక నవల వెలువడింది. 'ఇందులో 80 శాతం చారిత్రక సత్యాలే' అంటారు ఆ నవలా రచయిత... డాక్టర్ సగిలి సుధారాణి.

"నేను పుట్టి పెరిగింది తిరుపతిలో. పెళ్లి తర్వాత హైదరాబాద్‌కు వచ్చాను. తెలుగు విశ్వవిద్యాలయంలో 'చిత్తూరు జిల్లా మహిళల సంప్రదాయ గేయాలు' అనే అంశంపై పరిశోధన చేశాను. ఆ తర్వాత చెన్నైకు వెళ్లాను. 'ద్రావిడ విశ్వవిద్యాలయం'లో పీహెచ్‌డీ చేయాలనుకున్నప్పుడు... 'జానపద మౌఖిక సాహిత్యం' అనే అంశంపై పరిశోధన ప్రారంభించాను. చెన్నైలో ఇళ్లలో పని చేసేవారు, ధారాళంగా తెలుగు మాట్లాడేవాళ్లకు కూడా తెలుగు రాయటం రాదు. రెండు మూడు శాతం మందికి, అది కూడా విశ్వవిద్యాయాల్లో చదివేవారికి మాత్రమే రాయటం కూడా వస్తుంది. నేను మౌఖికంగా తరతరాలుగా వస్తున్న జానపద సాహిత్యాన్ని సేకరిస్తున్నప్పుడు... అక్కడ అనేక తెలుగు పదాలు ఉన్నాయని తెలిసింది. ఒక రోజు నేను చెన్నై నుంచి ప్రయాణిస్తుంటే మధ్యలో 'మంగమ్మ సాలై' (మంగమ్మ రోడ్డు) వచ్చింది. ఆ పేరు నన్ను ఆకర్షించింది. రహదారికి 'మంగమ్మ' పేరు ఎందుకు పెట్టారనే ప్రశ్న తలెత్తింది. దానికి సమాధానం వెతికితే... ఆమె నాయకరాజుల సమయంలో ఒక మహారాణి అని, భర్త, కొడుకు, మనవడు రాజ్యాన్ని పాలిస్తున్న సమయంలో ఆమె కీలకమైన పాత్ర పోషించిందనే విషయం తెలిసింది. మరింతగా లోతుకు వెళితే... ఆమె తెలుగు రాణి అని కూడా అర్థమయింది.

**ఎన్నో ప్రశ్నలు...**

నా పరిశోధన పూర్తి అయిన తర్వాత 'తమిళనాట తెలుగు ప్రజల జానపద విజ్ఞానం' అనే గ్రంథం తీసుకువచ్చాను. దీనికి మంచి ప్రశంసలు లభించాయి. ఈ పుస్తకం చూసిన శ్రీ రంగాచారి అనే పరిశోధకుడు- తనవద్ద ఉన్న ఒక పుస్తకాన్ని పంపించారు. అది మహారాణి మంగమ్మకు సంబంధించిన పుస్తకం. దాన్ని రచయిత్రి రూపాబాయి మోతీలాల్ తెలుగులో రాశారు. 'కట్టబొమ్మన నాయకుడు' పేరిట ఆమె ఒక తెలుగు వార పత్రికలో ధారావాహిక రాశారు. కట్టబొమ్మన తెలుగువాడని ఆమె ఈ ధారావాహికలో నిరూపించారు. మహారాణి మంగమ్మపై రూపాబాయి రాసిన పుస్తకం చదివిన తర్వాత నాలో అనేక రకాల ప్రశ్నలు తలెత్తాయి. వాస్తవానికి ఇప్పుడు భౌగోళిక ప్రాంతాల ఆధారంగా వేర్వేరు రాష్ట్రాలుగా ఏర్పాడ్డాం కానీ ఒకప్పుడు తెలుగువారందరూ కలిసే ఉండేవారు. తెలుగువారు అనేక ప్రాంతాలను పాలించారు కూడా! స్థూలంగా ఆ చరిత్రను విశ్లేషించాలనే ఉత్సుకత ఈ మధ్యకాలంలో తగ్గిపోతోంది. దీనివల్ల చరిత్రలో కీలక భూమికను పోషించినవారు కనుమరుగు అవుతున్నారు. దీన్ని భవిష్యత్తు తరాలవారికి అందించాలనే ఉద్దేశంతో ఆ ప్రతిని పరిష్కరించి 'మధుర మహారాణి మంగమ్మ' అనే ఈ పుస్తకాన్ని తీసుకువచ్చాను.

**ఊహల్లో రాణి కాదు...**

ఇక్కడ ఒక విషయాన్ని చెప్పాలి. సాధారణంగా మహారాణి మంగమ్మ అనగానే చాలామంది శత్రువులతో యుద్ధం చేసిన వీరనారి అనుకుంటారు. కానీ మంగమ్మ కండ బలం కన్నా బుద్ధి బలాన్ని ఉపయోగించి రాజ్యాన్ని కొనసాగేలా చేసింది. మంగమ్మ భర్త చొక్కనాథ నాయకుడు. కొన్ని పరిస్థితులవల్ల ఆయన చెరసాలలో ఉండాల్సి వచ్చింది. ఆ సమయంలో భర్తకు సాయం చేసి, రాజ్యాన్ని తిరిగి చేజిక్కించుకుంది మంగమ్మ. ఆయన రాజ్యాధికారానికి వచ్చిన కొద్ది రోజులకే చొక్కనాథ నాయకుడు మరణించాడు. అప్పటికి మంగమ్మ గర్భవతి. ఆ నాటి సంప్రదాయమైన సతీసహగమనం చేయకుండా మంగమ్మ కుమారుడికి జన్మనిచ్చింది. రాజమాతగా తన కొడుకు సింహాసనాన్ని అధిష్టించేలా చేసింది. దురదృష్టమేమిటంటే... కోడలు గర్భవతిగా ఉన్న సమయంలో కొడుకు కూడా చనిపోతాడు. బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత కోడలు చనిపోతుంది. కానీ తన మనవడికి రాజ్యాన్ని అప్పగించి... అతనికి యుక్త వయస్సు వచ్చే దాకా రాజమాతగా పరిపాలిస్తుంది. ఇలా భర్త, కొడుకు, మనమడి రాజ్యాధికార సమయంలో మంగమ్మ కీలకమైన పాత్ర పోషించింది. నాయకరాజుల వారసత్వం కొనసాగేలా చేసింది. అందుకే ఇప్పటికీ మదురై, తిరుచ్చి, శ్రీరంగం ప్రాంతాల్లో మహారాణి మంగమ్మ గురించి కథలుగా చెప్పుకుంటూ ఉంటారు. ఇప్పటికీ మంగమ్మ



రాయించిన తెలుగు శాసనాలు కూడా ఉన్నాయి.

పేరెందుకు రాలేదు?

'మహారాణి మంగమ్మకు ఇతర రాజుల స్థాయిలో పేరు ఎందుకు రాలేదు' అనే ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. బహుశా పురుషాధిక్య చరిత్రలో ఆమెకు సముచిత స్థానం లభించలేదేమో. ఆమె వేయించిన రహదారులు ఇప్పటికీ తమిళనాట ప్రజలు వాడుతున్నారు. ఆమె సమాజహితం కోసం చేసిన పనుల గురించి శాసనాలు ఉన్నాయి. కానీ మౌఖిక చరిత్రలో ఆమె గురించి అనేక అవాస్తవాలు ప్రచారంలోకి వచ్చాయి. ఆమె అక్రమ సంబం?ధం పెట్టుకుందని, చేసిన మంచి పనులన్నింటి వెనక వ్యక్తిగత స్వార్థం ఉందనే రీతిలో కథలు ప్రచారంలోకి వచ్చాయి. బహుశా దీనివల్ల ఆమెకు తగినంత ప్రాముఖ్యత లభించి ఉండకపోవచ్చు.

**అందుకే తక్కువ...**

మన దగ్గర పరిశోధనలు చేసే మహిళలు తక్కువ. దీనికి రెండు కారణాలున్నాయి. వివాహం కాకముందు- యువతులకు కుటుంబ సభ్యుల మద్దతు ఉండాలి. వారు భద్రంగా ఉంటారని తల్లిదండ్రులు నమ్మాలి. మన సమాజంలో అమ్మాయిలు స్వేచ్ఛగా దూర ప్రాంతాలకు వెళ్లటానికి అనుమతులు లభించవు. విశ్వవిద్యాలయాల నుంచి ఆర్థిక సాయం చేస్తే, వారు స్వేచ్ఛగా పరిశోధనలు చేసుకోగలుగుతారు. వివాహం అయిన తర్వాత ఇంకొన్ని రకాల సమస్యలు ఎదురవుతాయి. భర్త, పిల్లలు అనేక కుటుంబ బాధ్యతలు ఉంటాయి. అయితే వ్యక్తిగతమైన ఆసక్తి ఉంటే పరిశోధనలు సులభంగానే చేయవచ్చు. దీనికి నేనే నిదర్శనమని చెప్పవచ్చు."

**మంగమ్మ కథ...**

మహారాణి మంగమ్మ 17వ శతాబ్దంలో మధురను పాలించిన తెలుగు రాణి. ఈమె పూర్వీకులు చంద్రగిరికి చెందివారు. విజయనగర సామ్రాజ్య పతనానంతరం తంజావూరు, మధుర, పుదుక్కోట, సెంజి, మైసూరు పాలకులు స్వతంత్రులయ్యారు. వీరిలో నాయక రాజులు- మధుర, తిరుచ్చి రాజధానులుగా సుమారు 200 సంవత్సరాలు పాలించారు. వీరిలో విశ్వనాథ నాయకుడు, తిరుమలనాయకుడు, చొక్కనాథ నాయకుడు, మహారాణి మంగమ్మ ముఖ్యులు. రాణీ మీనాక్షి కాలంలో నాయకరాజుల పాలన అంతరించిపోయింది. మంగమ్మ గురించి ఆ ప్రాంతాల్లో అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. 'చిక్క దేవరాయులు (మైసూరు పాలకుడు) లాగా కూడబెట్టి పిసినారిలా జీవించేకన్నా... దానధర్మాలు చేసి మంగమ్మలా బతకాలి' అనే నానుడి ఇప్పటికీ ప్రచారంలో ఉంది.

**సేవకులు అనడం సరికాదు...**

తమిళనాడులోని అనేక ప్రాంతాలను తెలుగు రాజులు పాలించారు. వారి సమయంలో రాజభాష తెలుగే. అనేకమంది ప్రజలు తెలుగు మాట్లాడేవారు. ఈ రాజులకు సేవ చేయటానికి తెలుగు ప్రాంతాల నుంచి అనేక మంది తరలి వెళ్లారు. వీరిలో అనేక వృత్తులవారు ఉన్నారు. కాబట్టి తెలుగు రాష్ట్రాల నుంచి వెళ్లి అక్కడి రాజులకు సేవ చేశారనటం సరికాదు. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. మనం కులాంతర, మతాంతర వివాహాలు విన్నాం. కానీ భాషాంతీకరణ జరిగిందనిపిస్తుంది. అంటే అక్కడ నివసించే తెలుగు ఇంటి పేర్లు కనుమరుగైపోతున్నాయి. సాధారణంగా తెలుగువారు తమ ఇంటి పేరును ముందు పెట్టుకుంటారు. వారి కుటుంబ అస్థిత్వం ఆ ఇంటి పేరు నుంచే వస్తుంది. తమిళులు తమ తండ్రి పేరును తమ పేరు చివరన పెట్టుకుంటారు. ఇలా పేరు పెట్టుకుంటే వారికి కొన్ని సదుపాయాలు లభిస్తాయి. దానితో చాలా మంది తెలుగువారు తమ ఇంటి పేరును వదిలేసి చివరలో తండ్రి పేరు పెట్టుకుంటున్నారు. ఈ లెక్కన చూస్తే తమిళనాడులో తెలుగువారు చాలా ఎక్కువ మంది ఉంటారు.

-సహాయ

### మదర్ థెరిసా
# వారసురాలు



ఈ సిస్టర్ నిజంగానే మదర్ థెరిసా వారసురాలు. ఎందుకంటే.. ఓ వ్యక్తి ఆరోగ్యం బాగలేదు, ఆర్థకంగా సాయం చేయండి అని అడిగితే.. ఈమె ఏకంగా కిడ్నీ దానం చేసి తన ప్రేమ గుణాన్ని చాటుకున్నది.

తమిళనాడులో అలప్పుజ ప్రాంతానికి చెందిన సిస్టర్ రోజ్ ఆంటో.. నన్‌గా కథోలిక్ సంఘంలో సేవ చేస్తున్నది. అంతేకాదు తాను సెయింట్ జోసెఫ్ కాలేజ్‌లో హిందీ డిపార్ట్‌మెంట్‌కు హెడ్‌గా కూడా విధులు నిర్వర్తిస్తున్నారు. ఒకరోజు సిస్టర్ రోజ్ దగ్గరకు కొందరు వ్యక్తులు వచ్చి.. ఇరింజలకుడ ప్రాంతానికి చెందిన తిలకన్ అనే వ్యక్తికి కిడ్నీలు పాడయ్యాయి. కుటుంబం కష్టాల్లో ఉన్నది ఆర్థిక సాయం చేయండి అని కోరారు.

అయితే పలు సేవా కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనే సిస్టర్ రోజ్.. భర్త చనిపోయిన మహిళలకు ఆర్థికంగా సాయం చేసేవారు. అప్పుడే తిలకన్ గురించి ఆరా తీశారు. అతని దయనీయ పరిస్థితి, కుటుంబ ఆర్థిక బాధలు తెలుసుకొని తిలకన్‌కు తన కిడ్నీ ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. కొచ్చిలోని వీపీఎస్ దవాఖాన వైద్యులను సంప్రదించి తన కిడ్నీ దానం చేసింది. దీంతో వైద్యులు ఆ కిడ్నీని తిలకన్‌కు అమర్చారు. సిస్టర్ రోజ్ ఆంటో దయార్ధ హృదయానికి తిలకన్ కుటుంబం కృతజ్ఞతలు చెబుతున్నది. సిస్టర్ రోజ్ మదర్ థెరిసా వారసురాలని కొనియాడుతున్నారు.

# కిర్రెక్కించే చాట్‌లు



క్రిస్మస్, కొత్త సంవత్సరం వచ్చేస్తున్నాయి. ఇంటికి ఎవరో ఒకరు వస్తూ ఉంటారు. అతిథులు వచ్చిన ప్రతిసారీ ఇడ్లీ, దోశలు మాత్రమే పెడితే ఏంబాగుంటుంది! అందుకే అందరూ ఇష్టంగా తినే ఆరోగ్యకరమైన చాట్‌లను ఎలా తయారుచేయాలో చూద్దాం. ఈ చాట్‌లన్నింటికీ చాట్ మసాలా అవసరమవుతుంది. ప్రస్తుతం మార్కెట్లో రకరకాల బ్రాండ్ల చాట్‌మసాలాలు దుబాటులో ఉన్నాయి. వాటిలో ఏ చాట్ మసాలానైనా వాడుకోవచ్చు.

## చిలకడదుంప చాట్



**కావాల్సిన పదార్థాలు:**

ఉడకబెట్టి వేయించిన చిలకడదుంప ముక్కలు: ఒక కప్పు, చింతపండు రసం: నాలుగు చెంచాలు, నిమ్మరసం- ఒక చెంచా, చాట్ మసాలా- ఒక చెంచా, ఉప్పు- తగినంత, దానిమ్మ గింజలు- నాలుగు స్పూన్లు, తరిగిన కొత్తిమీర- ఒక స్పూను

తయారీ విధానం

చిలకడదుంపను బాగా కడిగి తొక్క తీసేయాలి. దానిని ముక్కలుగా తరగాలి. వాటిని కుక్కర్‌లో ఉడకబెట్టవచ్చు. లేదా నెయ్యి వేసి వేయించవచ్చు.

ఒక గిన్నెలో చిలకడదుంప ముక్కలు, చింతపండు రసం, నిమ్మరసం, చాట్‌మసాలా, ఉప్పు వేసి బాగా కలపాలి. ఆ తర్వాత దానిమ్మ గింజలు, కొత్తిమీర పైన చల్లాలి.

జాగ్రత్తలు

చిలకడదుంపలను ఎక్కువ ఉడకబెడితే ముద్దగా అయిపోతాయి. అందువల్ల తక్కువగానే ఉడకబెట్టాలి.

కొందరు ఉడకబెట్టిన తర్వాత నెయ్యి వేసి వేయిస్తారు. అలా చేసినా రుచికరంగానే ఉంటుంది.

## పాలకూర పకోడీ చాట్

కావాల్సిన పదార్థాలు

తరిగిన పాలకూర: ఒక కప్పు, శనగపిండి- అరకప్పు, నూనె- ఒక కప్పు, ఉప్పు- తగినంత, పెరుగు- ఒక కప్పు, చింతపండు రసం- రెండు చెంచాలు, జీలకర్ర పొడి- ఒక చెంచా

తయారీ విధానం

పాలకూరను బాగా కడిగి దానిలో శనగపిండి, ఉప్పు వేసి కలపాలి. ఒక మూకుడులో నూనెను తీసుకొని, పాలకూర మిశ్రమాన్ని పకోడీల మాదిరిగా వేయించాలి. బయటకు తీసి ప్లేటులో ఉంచాలి.

ఒక గిన్నెలో పాలకూర పకోడీలు వేయాలి. దానిపై పెరుగు, చింతపండు రసం, ఉప్పు, జీలకర్ర పొడి వేయాలి.

జాగ్రత్తలు:పకోడీలపై పెరుగు, ఇతర పదార్థాలు వేసిన తర్వాత బాగా కలపకూడదు. దీనివల్ల పకోడీలు మెత్తపడిపోతాయి.

పాలకూరలో శనగపిండిని కలపాలి. అవసరమైతే కొద్దిగా నీళ్లు చిలకరించాలి. అంతే తప్ప శనగపిండిలో పాలకూరను వేసి నీళ్లతో కలపకూడదు.

## ఆలూటిక్కీ చాట్



కావాల్సిన పదార్థాలు :బంగాళదుంప ముక్కలు- రెండు కప్పులు, కార్న్‌ఫ్లోర్- ఒక చెంచా, పచ్చి బఠానీలు- పావుకప్పు, పెరుగు- ఒక కప్పు, చింతపండు రసం- రెండు స్పూనులు, గ్రీన్ చట్నీ (కొత్తిమీర, పుదీనా, పుట్నాల పప్పు, నిమ్మరసంల మిశ్రమం)- రెండు చెంచాలు, కారప్పూస- రెండు చెంచాలు, నూనె- పావు కప్పు, చాట్ మసాలా- ఒక చెంచా, ఉప్పు- తగినంత

తయారీ విధానం

బంగాళదుంపలను తొక్క తీసి బాగా ఉడికించాలి. పచ్చి బఠానీలను కూడా ఉడికించాలి. ఇవి రెండూ ఉడికి చల్లారిన తర్వాత ఒక గిన్నెలో బంగాళదుంపలు, పచ్చి బఠానీలు, ఉప్పు, కార్న్‌ఫ్లోర్ వేసి ముద్దగా చేయాలి.

బంగాళదుంపల మిశ్రమాన్ని చిన్న ముద్దలుగా చేసి అరచేతిలో గుండ్రంగా ఒత్తాలి. వీటినే టిక్కీలంటారు.

ఒక పెనంపై నూనె వేసి వేడి చేయాలి. టిక్కీలను సన్నని సెగపై కాల్చాలి.

ఇలా కాల్చిన టిక్కీలను ఒక గిన్నెలో తీసుకొని దానిలో చింతపండు రసం, గ్రీన్ చట్నీ, కారపూస, చాట్ మసాలా, ఉప్పులను వేయాలి.


జాగ్రత్తలు

టిక్కీల కోసం కార్న్‌ఫ్లోర్ అందుబాటులో లేకపోతే బియ్యపు పిండిని వేయవచ్చు.

టిక్కీలను బాగా కరకరలాడేలా కాల్చకూడదు. కొద్దిగా మెత్తగా ఉంటేనే బావుంటుంది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in




# హైదరాబాద్ రక్షణ కంపెనీల హవా



**హైదరాబాద్ -నవభూమి:**'ఆపరేషన్ సిందూర్'తో హైదరాబాద్‌లో ఉన్న రక్షణ రంగంలోని కంపెనీలకు ఆర్డర్లు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ రంగంలోని డీఆర్‌డీఓ, బీడీఎల్, బీఈఎల్‌తో పాటు ప్రైవేట్ రంగంలోని ఎంటార్ టెక్నాలజీస్, అదానీ ఎల్బిట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, అస్త్రా మైక్రోవేవ్, కల్యాణి రాఫెల్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, అనంత్ టెక్నాలజీస్, రఘువంశీ, జెన్ టెక్నాలజీస్ వంటి కంపెనీలకు సైనిక దళాల నుంచి పెద్దఎత్తున ఆర్డర్లు వస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్‌లో ఈ కంపెనీలు తయారు చేసిన ఆయుధాలు, ఆయుధ విడి భాగాలు తమ సత్తా చాటాయి. దీంతో రక్షణ మంత్రిత్వ శాఖ ఈ కంపెనీల నుంచి పెద్ద మొత్తంలో ఆయుధాలు, మందుగుండు సామాగ్రి కొనుగోలు చేసి నిల్వ చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం పాక్‌తో కాల్పుల విరమణ కుదిరినా, అది తాత్కాలికమేనని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో ముందు జాగ్రత్తగా పెద్దఎత్తున బ్రహ్మోస్, ఆకాశ్ వంటి క్షిపణులు, డ్రోన్లను పెద్దఎత్తున కొనుగోలు చేసి నిల్వ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. శరవేగంగా సరఫరాలు గతంలో సైనిక దళాల నుంచి వచ్చిన ఆర్డర్లను కంపెనీలు ఆరు నెలల నుంచి ఏడాదిలోపు పూర్తి చేసేందుకు గడువు ఇచ్చేవారు. ఇప్పుడు కొద్ది నెలల్లోనే సరఫరాలు పూర్తి చేయాలని సైనిక దళాలు కోరుతున్నాయి. దీంతో వారాంతాల్లో కూడా పని చేస్తూ, ఏ వారానికి ఆ వారం సరఫరాలు చేయాల్సి వస్తోందని బ్రహ్మోస్, ఆకాశ్ మిస్సైల్స్, డ్రోన్లకు అవసరమైన కీలక విడిభాగాలు సరఫరా చేసే ఒక కంపెనీ అధినేత చెప్పారు.

## మళ్లీ పడిపోయిన పసిడి..గరిష్టం నుంచి భారీగా తగ్గుదల..



**ముంబై-నవభూమి:**దేశంలో గత కొన్ని రోజులుగా బంగారం, వెండి ధరలు క్రమంగా తగ్గుతూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే నేడు (మే 15, 2025న) పసిడి ధరలు మళ్లీ తగ్గుముఖం పట్టాయి. ఇదే సమయంలో వెండి ధరలు మాత్రం స్థిరంగా కొనసాగుతుండటం విశేషం. ఈ ధరల నేపథ్యంలో హైదరాబాద్, విజయవాడలో తాజాగా 24 క్యారెట్ల పసిడి ధర రూ.2130 తగ్గిపోగా, 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ. 1950 స్థాయిలో తగ్గింది. ఈ క్రమంలో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.93,930 స్థాయికి చేరుకోగా, 22 క్యారెట్ బంగారం ధర 10 గ్రాములకు రూ.86,100గా ఉంది.దేశంలోని ఇతర నగరాల్లో బంగారం ధరలు న్యూఢిల్లీలో 24 క్యారెట్ బంగారం 10 గ్రాములకు రూ.94,080 కాగా, 22 క్యారెట్ బంగారం రేటు రూ. 86,250గా ఉంది.ముంబై, చెన్నై, కొల్ కత్తా, బెంగళూరు, భువనేశ్వర్ ప్రాంతాల్లో 24 క్యారెట్ గోల్డ్ రేటు రూ.93,930 ఉండగా, 22 క్యారెట్ పసిడి రూ.86,100గా ఉంది.నగరాలను బట్టి ఈ ధరలు కాస్త మారుతుంటాయి. కానీ ఇది సాధారణంగా మార్కెట్ డిమాండ్, పన్నులు, సరఫరా, ఇతర ఆర్థిక కారకాలపై ఆధారపడి ఉంటుంది.

## పసిడి ప్రియులకు గుడ్‌న్యూస్.. దిగొస్తున్న బంగారం ధరలు




**ముంబై -నవభూమి:**ఆపరేషన్ సిందూర్ తర్వాత బంగారం ధరల్లో చాలా మార్పులు చోటుచేసుకున్నాయి. అంతకు ముందు లక్ష రూపాయలకు చేరిన బంగారం ధరలు.. యుద్ధం తర్వాత తగ్గుతూ వస్తున్నాయి. స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం ధర ఇప్పుడు 96 వేల దగ్గర ట్రేడ్ అవుతోంది. పరిస్థితులను చూస్తుంటే ధరలు మరింత తగ్గే అవకాశం కనిపిస్తోంది. బంగారం కొనాలనుకునే వారికి.. పెట్టుబడులు పెట్టాలనుకునే వారికి ఇది సరైన సమయం అని చెప్పొచ్చు. రానున్నకాలంలో బంగారం మళ్లీ ఆకాశాన్ని అంటే అవకాశం ఉంది.ఈ రోజు బంగారం ధరలు ఇలా..గుడ్ రిటర్న్స్ వెబ్ సైట్ ప్రకారం.. హైదరాబాద్ నగరంలో నిన్న 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం ధర 96060 దగ్గర ట్రేడ్ అయింది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 88050 దగ్గర ట్రేడ్ అయింది. ఇక, 10 గ్రాముల 18 క్యారెట్ల ధర 72040 దగ్గర ట్రేడ్ అయింది. ఇక, ఈ రోజు 18,22,24 క్యారెట్ల బంగారంపై 10 రూపాయలు తగ్గింది. 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం ధర ఈ రోజు 96050 దగ్గర ట్రేడ్ అవుతోంది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 88040 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక, 10 గ్రాముల 18 క్యారెట్ల ధర 72030 దగ్గర ట్రేడ్ అవుతోంది.వెండి ధరలు ఇలా..హైదరాబాద్ నగరంలో బంగారంతో సంబంధం లేకుండా వెండి ధరలు ప్రతీ నిత్యం తగ్గుతూనే వస్తున్నాయి. నిన్న మహానగరంలో.. 100 గ్రాముల వెండి ధర 10900 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. కేజీ వెండి ధర 109000 దగ్గర ట్రేడ్ అయింది. ఈ రోజు 100 గ్రాములపై 10 రూపాయలు, కేజీపై 100 రూపాయలు తగ్గింది. ఈ రోజు 100 గ్రాముల వెండి ధర 10890 దగ్గర ట్రేడ్ అవుతోంది. కేజీ బంగారం ధర 1,08,900 దగ్గర ట్రేడ్ అవుతోంది.

## భారత్‌లో యాపిల్ సంస్థను విస్తరించొద్దు.. టిమ్ కుక్‌కు సూచించిన ట్రంప్



**ఖతార్-నవభూమి:**ఖతార్ వేదికగా భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన అక్కసు వెళ్లగక్కారు. భారత్‌లో యాపిల్ సంస్థను విస్తరించొద్దని ఆ సంస్థ సీఈవో టిమ్ కుక్‌కు సూచించారు. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంపే స్వయంగా వెల్లడించినట్లు బ్లూమ్‌బర్గ్ నివేదికను ఊటంకిస్తూ ప్రముఖ జాతీయ మీడియా ఇండియా టుడే తెలిపింది.అధ్యక్షుడు ట్రంప్ ప్రస్తుతం అరబ్ దేశాల పర్యటనలో ఉన్న విషయం తెలిసిందే. తన పర్యటనలో భాగంగా నిన్న ఖతార్‌ను సందర్శించారు. ట్రంప్ కోసం ఎమిర్ ఆఫ్ ఖతార్ దోహాలో ప్రత్యేకంగా విందు ఏర్పాటు చేసింది. ఈ విందుకు పలువురు సీఈవోలు, వ్యాపారవేత్తలు హాజరయ్యారు. ఈ విందుకు హాజరైన యాపిల్ సీఈవో టిమ్ కుక్‌తో ట్రంప్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తన అభిప్రాయాన్ని టిక్ కుక్‌కు తెలియజేశారు. భారత్‌లో యాపిల్ సంస్థను విస్తరించొద్దని సూచించారు.'నాకు టిమ్ కుక్‌తో నిన్న చిన్న సమస్య ఎదురైంది. అతడు భారత్‌లో తయారీ కర్మాగారాల నిర్మాణాలు చేపట్టారు. అలా చేయడం నాకు ఇష్టం లేదని చెప్పాను. ఫలితంగా అమెరికాలో ఉత్పత్తి పెంచేందుకు యాపిల్ అంగీకరించింది. ప్రపంచంలోనే అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో భారత్ ఒకటి. అక్కడ వ్యాపారం చేయడం చాలా కష్టమని టిమ్ కుక్‌కు వివరించా. భారత్ కోసం ఆలోచించాల్సిన అవసరం లేదు. ఆ దేశం తనను తాను చూసుకోగలదని చెప్పా. నా వల్ల యాపిల్ సంస్థ ఇప్పుడు యూఎస్‌లో 500బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టాలని యోచిస్తోంది' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.అమెరికా, చైనా దేశాల మధ్య టారిఫ్‌ల యుద్ధం కారణంగా దిగ్గజ సంస్థ యాపిల్ ఇప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతోంది. ఇందులో భాగంగానే అమెరికా మార్కెట్లో విక్రయించే ఐఫోన్ల తయారీకి సంబంధించిన పూర్తి అసెంబ్లీని భారత్‌కు తరలించాలని కంపెనీ యోచిస్తోంది.

## పాకిస్థాన్, గల్ఫ్ దేశాలకు

# సాయం చేసిన ఆర్బీఐ.. ఎందుకంటే..




**ముంబై-నవభూమి:**ఇటీవల భారత్, పాకిస్థాన్ ఘర్షణల తర్వాత ఇరు దేశాల గురించి అనేక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ క్రమంలోనే భారతదేశం, పాకిస్థాన్‌ల మధ్య 1947లో జరిగిన విభజన గురించి ఓ ఆకస్తికర విషయం తెలిసింది. ఈ విభజనలో రాడ్‌క్లిఫ్ లైన్ కీలక పాత్ర పోషించగా, దీనిని బ్రిటిష్ న్యాయవాది సర్ సిరిల్ రాడ్‌క్లిఫ్ రూపొందించారు. ఈ రేఖ పంజాబ్, బెంగాల్ ప్రాంతాలను భారతదేశం, పాకిస్థాన్‌గా విభజించింది. అయితే, ఈ రేఖ రెండు దేశాలకు అవసరమైన వనరులను నిజంగా అందించిందా? ఈ రేఖను రూపొందించిన రాడ్‌క్లిఫ్ ఎన్నడూ భారతదేశాన్ని సందర్శించలేదు. విభజన తర్వాత, పాకిస్థాన్ అనేక ఆర్థిక, మౌలిక సవాళ్లను ఎదుర్కొంది. ఇలాంటి పరిస్థితుల్లో భారతదేశం తన పొరుగు దేశానికి ఎలాంటి సాయాన్ని అందించిందనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం.విభజన, ఆర్థిక సవాళ్లు 1947లో భారత స్వాతంత్ర చట్టం ద్వారా భారతదేశం, పాకిస్థాన్ రెండు స్వతంత్ర దేశాలు ఏర్పడ్డాయి. ఈ విభజన మతపరంగా జరిగింది. దీనిలో రాడ్‌క్లిఫ్ లైన్ రెండు దేశాల సరిహద్దులను నిర్ణయించింది. అయితే, ఈ విభజన పాకిస్థాన్‌కు అనేక సవాళ్లను తెచ్చిపెట్టింది. కొత్తగా ఏర్పడిన పాకిస్థాన్‌కు కేంద్ర బ్యాంక్, ఆర్థిక వ్యవస్థ లేదా కరెన్సీ ముద్రణ సౌకర్యాలు లేవు. ఇలాంటి పరిస్థితుల్లో భారతదేశం తన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా పాకిస్థాన్‌కు సహాయం అందించింది.రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహాయం 1947 ఆగస్టు నుంచి 1948 సెప్టెంబరు వరకు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పాకిస్థాన్ కోసం కరెన్సీ నోట్లను ముద్రించింది. విభజన సమయంలో, పాకిస్థాన్‌కు సొంత కేంద్ర బ్యాంక్ ఏర్పాటు చేసే సామర్థ్యం లేకపోవడంతో, భారత రిజర్వ్ బ్యాంక్ రెండు దేశాలకు ఉమ్మడి కేంద్ర బ్యాంక్‌గా వ్యవహరించింది. ఈ విషయాన్ని స్టేట్ బ్యాంక్ ఆఫ్ పాకిస్థాన్ తన అధికారిక వెబ్‌సైట్‌లో స్పష్టంగా పేర్కొంది. 1947 ఆగస్టు 14న, అవిభక్త భారతదేశ గవర్నర్-జనరల్ "పాకిస్థాన్ (మానిటరీ సిస్టమ్ అండ్ రిజర్వ్ బ్యాంక్) ఆర్డర్ 1947 కూడా జారీ చేశారు. ఈ ఆదేశం ప్రకారం, పాకిస్థాన్‌లో కేంద్ర బ్యాంక్ ఏర్పాటు అయ్యే వరకు అన్ని కరెన్సీ సంబంధిత విషయాలను నిర్వహించింది.గల్ఫ్ దేశాలకు కూడా..ఈ క్రమంలో 1948 సెప్టెంబరు 30 వరకు, భారతదేశం, పాకిస్థాన్ రెండింటికీ ఉమ్మడి కేంద్ర బ్యాంకుగా పనిచేసింది. ఈ సమయంలో పాకిస్థాన్ అన్ని ఆర్థిక అవసరాలను తీర్చడంతో పాటు దాని ద్రవ్య వ్యవస్థను నిర్వహించింది. ఈ సమయంలో లాహోర్‌లో ఒక కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేసి తర్వాత మూసివేశారు. సేవలు కేవలం పాకిస్థాన్‌కు మాత్రమే పరిమితం కాలేదు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఒమన్, బహ్రెయిన్ వంటి గల్ఫ్ దేశాల కోసం కూడా కరెన్సీ నోట్లను ముద్రించింది. 1967 వరకు గల్ఫ్ దేశాలు భారతీయ రూపాయిని తమ కరెన్సీగా ఉపయోగించాయి. ఈ వాస్తవం విస్తృత ప్రభావాన్ని, ఆర్థిక నైపుణ్యాన్ని తెలియజేస్తుందని చెప్పవచ్చు.

# జెన్ జెడ్ ఆవిష్కరణలకు ఉత్తేజం?




**గురుగ్రామ్-నవభూమి:** జెన్ జెడ్ ఆవిష్కరణలకు ఉత్తేజం రూ.1 కోటికి పైగా గ్రాంట్లతో 'సాల్వ్ ఫర్ టుమారో 2025' పోటీని ప్రారంభించిన సామ్‌సంగ్ ఇండియా
2025 ఎడిషన్ టాప్ 4 విజేత జట్లకు ఇంక్యుబేషన్ ప్రోగ్రామ్‌ను అందిస్తుంది. వారికి రూ.1 కోటి గ్రాంట్ లభిస్తుంది. అదనంగా, టాప్ 20 జట్లకు రూ.20 లక్షలు, టాప్ 40 జట్లకు రూ.8 లక్షలు అందజేయబడతాయి.
ఈ సంవత్సరం, రెండు ప్రపంచ ఇతివృత్తాలు - విద్య కోసం క్రీడలు, సాంకేతికత ద్వారా సామాజిక మార్పు, మెరుగైన భవిష్యత్తులు మరియు సాంకేతికత ద్వారా పర్యావరణ స్థిరత్వం-ప్రవేశ పెట్ట బడ్డాయి, ఇవి స్థానిక, ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి విద్యార్థులను శక్తివంతం చేస్తాయి.
ఈ కార్యక్రమం విద్యార్థులకు ఆచరణాత్మక నమూనా తయారీతో పాటు 82,000 గంటల శిక్షణ, మార్గదర్శకత్వ మద్దతును అందిస్తుంది, దీని ద్వారా పాల్గొనేవారికి సాధికారత లభిస్తుంది.
ఈ కార్యక్రమం 14-22 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులకు అందుబాటులో ఉంటుంది. ఆరు నెలల పాటు కొనసాగుతుంది, దరఖాస్తులు 2025 ఏప్రిల్ 29 నుండి జూన్ 30 వరకు స్వీకరించబడతాయి.
భారతదేశ అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన సామ్‌సంగ్ తన సామ్‌సంగ్ 'సాల్వ్ ఫర్ టుమారో' కార్యక్రమం నాల్గవ ఎడిషన్‌ను ఆవిష్కరించింది. ఇది సాంకే తికతను ఉపయోగించుకోవడం ద్వారా సమాజంలోని కొన్ని ముఖ్యమైన సవాళ్లను పరిష్కరించడానికి విద్యా ర్థులను వినూత్న పరిష్కారాలను రూపొందించడానికి ప్రేరేపించడానికి రూపొందించబడిన దేశవ్యాప్త పోటీ.
సామ్‌సంగ్ 'సాల్వ్ ఫర్ టుమారో 2025' మొదటి నాలుగు విజేత జట్లకు వారి ప్రాజెక్టుల ఇంక్యుబేషన్‌కు మద్దతు ఇవ్వడానికి రూ.1 కోటి అందిస్తుంది. అలాగే సామ్‌సంగ్ ఉన్నతాధికారులు, ఐఐటీ ఢిల్లీ అధ్యాపకుల నుండి ఆచరణాత్మక నమూనా తయారీలో మద్దతు, ఇన్వెస్టర్ల సంబంధాలు, నిపుణుల మార్గదర్శకత్వం లభిస్తాయి.
ఈ విధమైన గుర్తింపు అనేది పోటీలో రాణించడమే కాకుండా సమస్యలను అధిగమించే పరిష్కారాలను పెంపొందించడం యొక్క ప్రాముఖ్యతను చాటిచెబుతుంది. అంతిమంగా భారతదేశం అంతటా కమ్యూనిటీ లను రూపొందించడంలో కీలక పాత్ర పోషించే ఉన్నతస్థాయి, సుస్థిర వెంచర్‌లుగా అభివృద్ధి చెందుతుంది.
ఆరు నెలల పాటు కొనసాగే ఈ కార్యక్రమం, 14-22 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులను వ్యక్తులు లేదా సమూహాలుగా వారి సాంకేతిక ఆలోచనలను సమర్పించాల్సిందిగా ఆహ్వానిస్తోంది. ఈ సంవత్సరం, పాల్గొనేవారు నాలుగు కీలక ఇతివృత్తాలలో పరిష్కారాలను రూపొందించాల్సి ఉంటుంది. సురక్షితమైన, తెలివైన, సమగ్ర భారత్ కోసం ఏఐబీ భారతదేశంలో ఆరోగ్యం, పరిశుభ్రత, శ్రేయస్సు యొక్క భవిష్యత్తుబీ విద్య, మెరుగైన భవిష్యత్తు కోసం క్రీడలు, సాంకేతికత ద్వారా సామాజిక మార్పుబీ సాంకేతికత ద్వారా పర్యావరణ సుస్థిరత్వం.
ఈ సందర్భంగా సామ్‌సంగ్ సౌత్‌వెస్ట్ ఆసియా ప్రెసిడెంట్, సీఈఓ జెబి పార్క్ మాట్లాడుతూ, "సోల్వ్ ఫర్ టు మారోతో, భారతదేశంలోని ప్రతి మూలలోని యువ ఆవిష్కర్తలు పెద్ద కలలు కనేలా, వాస్తవ ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడానికి, సాంకేతికత ద్వారా తెలివైన, మరింత సమ్మిళిత భవిష్యత్తును రూపొందించడానికి మేం స్ఫూర్తినిస్తున్నాం. ఈ సంవత్సరం, సాల్వ్ ఫర్ టుమారో మరింత పెద్దదిగా, మరింత సమ్మిళితంగా ఉండబోతోంది. మేం మరిన్ని నగరాలను చేరుకుంటున్నాం, మరిన్ని పాఠశాలలు, కళాశాలల నుండి విద్యా ర్థులను ఇందులో భాగస్వాములుగా చేస్తున్నాం. డిజైన్ ఆలోచన సూత్రాలను వర్తింపజేస్తూ వారు ఆవిష్క రణలు చేయడానికి మార్గాలను సృష్టిస్తున్నాం. సాల్వ్ ఫర్ టుమారో భారత ప్రభుత్వం మార్గదర్శక చడిజిటల్ ఇండియా చొరవ పట్ల మా అచంచలమైన నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుంది.


## భారీ లాభాలతో ముగిసిన మార్కెట్లు..ఒక్కరోజులోనే

# 16 లక్షల కోట్ల లాభం

**ముంబై-నవభూమి:**భారత స్టాక్ మార్కెట్ మే 12, 2025న భారీ లాభాలతో దూసుకెళ్లింది. ఈ క్రమంలో సెన్సెక్స్ ఒక్క రోజులోనే 2975 పాయింట్లు జంప్ చేసి 82,429.54 వద్ద ముగిసింది. ఇది 3.74% వృద్ధిని సూచిస్తుంది. ఇదే సమయంలో నిఫ్టీ 50 కూడా 872.9 పాయింట్లు లేదా 3.66% పెరిగి 24,830.75 వద్ద స్థిరపడింది. ఈ భారీ లాభాలు దేశీయ, విదేశీ ఇన్వెస్టర్లలో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ఈ నేపథ్యంలో మార్కెట్ క్యాపిటలైజేషన్‌లో మదుపర్లకు దాదాపు 16 లక్షల కోట్ల రూపాయల లాభాలు వచ్చాయి.ఈ ర్యాలీ వెనుక కారణాలు ఈ అసాధారణ ర్యాలీకి ప్రధాన కారణం భారత్-పాకిస్తాన్ మధ్య సీజ్‌ఫైర్ ఒప్పందం. వారాంతంలో కుదిరిన ఈ ఒప్పందం తర్వాత, భౌగోళిక రాజకీయ ఒత్తిడి తగ్గడంతో ఇన్వెస్టర్లలో ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది. ఈ సానుకూల వాతావరణం మార్కెట్‌లో బుల్లిష్ సెంటిమెంట్‌ను పెంచేలా చేసింది. అదనంగా, అమెరికా-చైనా మధ్య వాణిజ్య ఒత్తిడి తగ్గడం, భారత్-అమెరికా మధ్య సంభావ్య వాణిజ్య ఒప్పందాల గురించిన ఊహాగానాలు మార్కెట్‌ను మరింత ఉత్తేజపరిచాయి.సెక్టర్ల విజయం ఈ రోజు లాభాల్లో ప్రధానంగా బ్యాంకింగ్, ఐటీ, ఎనర్జీ, ఆటోమొబైల్ సెక్టర్లు ప్రముఖంగా రాణించాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ 6.2% పెరిగి సెన్సెక్స్ ర్యాలీకి సపోర్ట్ చేసింది. దీంతోపాటు బ్యాంక్,బ్యాంక్, ఇన్ఫోసిస్, అదానీ పోర్ట్స్ వంటి హెవీవెయిట్ స్టాక్స్ 4 నుంచి 5% లాభాలను నమోదు చేశాయి. నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ 3.8% పెరిగి 55,200 స్థాయిని తాకింది, ఇది బ్యాంకింగ్ సెక్టార్‌లో బలమైన రికవరీని సూచిస్తుందని చెప్పవచ్చు. ఇదే సమయంలో పీఎస్‌యూ బ్యాంకులు కూడా రాణించాయి. బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్ వంటి స్టాక్స్ 5-7% లాభాలతో మెరిశాయి. టూరిజం, హాస్పిటాలిటీ స్టాక్స్ సీజ్‌ఫైర్ వార్తలతో 4-6% పెరిగాయి. ఈ ఒప్పందం ఉత్తర భారతదేశంలో పర్యాటక రంగాన్ని పునరుద్ధరిస్తుందని ఆశాభావం వ్యక్తమైంది.పెరిగిన కొనుగోళ్లు..ఈ విషయం తెలిసిన విదేశీ ఇన్స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు ఈ రోజు 3,500 కోట్ల రూపాయల నికర కొనుగోళ్లను నమోదు చేశారు. ఇదే సమయంలో డొమెస్టిక్ ఇన్స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు కూడా 2,800 కోట్ల రూపాయల విలువైన షేర్లను కొన్నారు. ఇది మార్కెట్‌లో బలమైన డిమాండ్‌ను సూచిస్తుంది. కొన్ని కంపెనీలు తమ త్రైమాసిక ఫలితాలతో మార్కెట్‌ను ఆకర్షించాయి. బజాజ్ ఎలక్ట్రికల్స్ తమ నికర లాభం 59.05 కోట్ల రూపాయలకు చేరడంతో 14.78% పెరిగింది. ఈ క్రమంలో రాబోయే త్రైమాసిక ఫలితాలు, %=దీ×% వడ్డీ రేట్ల నిర్ణయాలు మార్కెట్ దిశను నిర్ణయించే కీలక అంశాలుగా మారనున్నాయి.



## స్టాక్ మార్కెట్లకు భారీ లాభాలు.. 1200 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్




**ముంబై-నవభూమి:**ఉదయం నష్టాలతో ప్రారంభమైన దేశీయ సూచీలు ఆ తర్వాత భారీ లాభాల్లోకి దూసుకొచ్చాయి. అమెరికా-భారత్ ట్రేడ్ డీల్ కుదిరే వీలుందని వార్తలు రావడం మార్కెట్ సెంటిమెంట్‌ను పెంచింది. అలాగే మెటల్, ఆటో, రియాల్టీ, ఐటీ రంగాల్లో భారీ కొనుగోళ్లు మార్కెట్‌కు బూస్టింగ్ ఇచ్చాయి. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ గురువారం భారీ లాభాలను ఆర్జించాయి. గురువారం సెన్సెక్స్ 1200 పాయింట్లు లాభపడింది. నిఫ్టీ కూడా అదే బాటలో నడిచి 395 పాయింట్లు పైకి ఎగబాకింది.బుధవారం ముగింపు (81, 330)తో పోల్చుకుంటే దాదాపు ఫ్లాట్‌గా మొదలైన సెన్సెక్స్ ఉదయం అంతా లాభ, నష్టాలతో దోబూచులాడింది. అయితే మధ్యాహ్నం తర్వాత లాభాల్లోకి దూసుకొచ్చింది. మెటల్, ఆటో, రియాల్టీ, ఐటీ రంగాల్లో కొనుగోళ్లు సెన్సెక్స్‌ను ముందుకు నడిపించాయి. ఇంట్రాడే కనిష్టంతో పోల్చుకుంటే ఏకంగా 2000 పాయింట్లు పైకి ఎగబాకింది. చివరకు 1200 పాయింట్ల లాభంతో 82, 530 వద్ద రోజును ముగించింది. చాలా రోజుల తర్వాత 82 వేలకు పైన ముగిసింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. 395 పాయింట్ల లాభంతో 25, 062 వద్ద రోజును ముగించింది.సెన్సెక్స్‌లో హీరో మోటోకార్ప్, హెచ్‌ఎఫ్‌సీఎల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టాటా మోటార్స్ షేర్లు లాభాల్లో ముగిశాయి. ముత్తూట్ ఫైనాన్స్, ట్యూబ్ ఇన్వెస్ట్‌మెంట్, సీఈఎస్‌సీ, బీఎస్‌ఈ లిమిటెడ్ షేర్లు నష్టాలను మూటగట్టుకున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 394 పాయింట్ల లాభంతో రోజును ముగించింది. బ్యాంక్ నిఫ్టీ 554 పాయింట్లు ఎగబాకింది.

## అమెరికాకు భారత్ జీరో టారిఫ్‌ల ఆఫర్ ఇచ్చింది : అధ్యక్షుడు ట్రంప్



**న్యూఢిల్లీ-నవభూమి:**వాణిజ్య ఒప్పందంపై భారత్-అమెరికా దేశాల మధ్య జోరుగా చర్చలు జరుగుతున్న వేళ యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. అమెరికాకు భారత్ ఓ ఆఫర్ ఇచ్చిందని తెలిపారు. తమ దేశం నుంచి దిగుమతి చేసుకొనే చాలా రకాల వస్తువులపై భారత్ జీరో టారిఫ్ లతో వాణిజ్య ఒప్పందాన్ని ప్రతిపాదించినట్లు వెల్లడించారు.ఖతార్ వేదికగా జరిగిన ఓ వ్యాపార సమావేశంలో ట్రంప్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. 'అమెరికాకు భారత్ ఓ ఆఫర్ చేసింది. ఇది ఒక ప్రాథమిక ఒప్పందం. ఇందులో భారత్ అమెరికా దిగుమతులపై జీరో టారిఫ్‌లతో వాణిజ్య ఒప్పందాన్ని ఆఫర్ చేసింది' అని తెలిపారు. అయితే, ఆఫర్ పరిధిలోకి వచ్చే నిబంధనలు, రంగాల గురించి మాత్రం ట్రంప్ వివరించలేదు. ఇక ట్రంప్ ప్రకటనపై భారత ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకూ ఎలాంటి స్పందనా రాలేదు. మరోవైపు భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై చర్చల్లో గొప్ప పురోగతి ఉందని ట్రంప్ గతనెల వెల్లడించిన విషయం తెలిసిందే. త్వరలోనే ఓ ఒప్పందానికి రానున్నట్లు అప్పట్లో అధ్యక్షుడు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే తాజా ప్రకటన వచ్చింది.

## హైదరాబాదీ చాయ్ అడ్డాను ప్రారంభించిన ఆర్పీ పట్నాయక్




**హైదరాబాద్:-నవభూమి:** జనాలకు రుచికరమైన గరం చాయ్ తాగిపిస్తూ యువతకు కార్పొరేట్ స్థాయి ఉపాధి చూపిస్తున్నాడు సినీ నటుడు, వ్యాపారవేత్త, సామాజిక సేవకులు అభినవ్ సర్ధార్. తెలుగు రాష్ట్రాల్లో టీ బిజినెస్‌కు పర్‌ఫెక్ట్ కార్పొరేట్ బ్రాండ్‌గా తీర్చిదిద్దిన 'హైదరాబాదీ చాయ్ అడ్డా' సంస్థను దేశవ్యాప్తంగా విస్తరించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో తాజాగా తన నూతన ప్రీమియం ఫ్రాంచైజీని హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ ఆర్పీపట్నాయక్ ప్రారంభించారు.ఈ సందర్భంగా మ్యూజిక్ డైరెక్టర్ ఆర్పీ పట్నాయక్ మాట్లాడుతూ..ఈ తరం యువత ఉద్యోగాలు సైతం వదిలి టీ వ్యాపారంలో దూసుకుపోయేందుకు సరదా పడుతున్నారు. యువతకు కార్పొరేట్ స్థాయి వ్యాపారం చూపించేలా నటుడు అభినవ్ సర్ధార్ 'చాయ్'కు కొత్త నిర్వచనాన్ని చెబుతూ హైదరాబాదీ చాయ్ అడ్డా సంస్థను ప్రారంభించారన్నారు. ప్రీమియం ఫ్రాంచైజీలను దేశవ్యాప్తంగా అందిస్తూ యువతకు చక్కని ఉపాధి చూపిస్తున్నారు. జీవితంలో ఎదగాలనుకునే వారికి ఇది చక్కని వ్యాపార అవకాశమని పేర్కొన్నారు.హైదరాబాదీ చాయ్ అడ్డా సంస్థ నిర్వాహకుడు అభినవ్ సర్ధార్ మాట్లాడుతూ.. దేశంలోని యువతకు కార్పొరేటట్ స్థాయిలో ఉపాధి అందించాలనే ఉద్దేశంతో దేశంలోనే తొలిసారిగా 2016లో హైదరాబాదీ చాయ్ అడ్డా(%ఎజూ%)ను ప్రారంభించామన్నారు. ప్రతి చాయ్ కప్పులో సంప్రదాయాన్ని, ఆధునికతను మేళవించిన.. చాయ్‌ను కేవలం పానీయం కాకుండా ఒక భావోద్వేగ అనుభవంగా మార్చే లక్ష్యంతో ప్రారంభమైన హెచ్‌సీఏ, ఇప్పుడు ఒక సాంస్కృతిక ఉద్యమంగా మారింది తెలిపారు.ఇప్పటికే ఫ్రాంచైజీలు తీసుకున్న వారు చాలా సంతోషంగా ఉన్నారు. ఈ కాన్‌సెప్ట్ చాలా మందికి నచ్చడంతో ఫ్రాంచైజీలను తీసుకుని స్టోర్స్ ప్రారంభించాలనుకుంటున్నారు. ఇందుకోసం ఫ్రాంచైజీ మోడళ్లను దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నామని తెలిపారు. అభిరుచి కలిగిన వ్యాపారవేత్తలు ఈ బిజినెస్ అవకాశాన్ని వినియోగించుకోవచ్చన్నారు.

నవభూమి

www.navabhoomi.in
www.epaper.navabhoomi.in

11 హైదరాబాద్ శుక్రవారం 16 । మే । 2025


# హాంకాంగ్, సింగపూర్‌లో పెరుగుతున్న కోవిడ్ కేసులు

**సింగపూర్-నవభూమి:**ఆసియాలో మళ్లీ కరోనా వేవ్ మొదలైన సూచనలు కనబడుతున్నాయి. హాంకాంగ్, సింగపూర్‌లో కరోనా కేసులు పెరుగుతుండటంతో స్థానిక అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. హాంకాంగ్‌లో వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉందని స్థానిక అధికారి ఒకరు హెచ్చరించారు. ఇటీవల శాంపిల్స్‌లో అనేకం పాజిటివ్‌గా తేలాయని అన్నారు. ఈ ఏడాది ఈ స్థాయిలో కోవిడ్ పాజిటివ్స్ రావడం ఇదే తొలిసారని అన్నారు. మే 3తో ముగిసిన వారంలో 31 కోవిడ్ మరణాలు నమోదు అయ్యాయని, ఈ ఏడాది ఇదే గరిష్ఠ సంఖ్య అని కూడా తెలిపారు. రెండేళ్ల నాటి కోవిడ్



ఇన్ఫెక్షన్ దశతో పోలిస్తే కేసుల సంఖ్య తక్కువగానే ఉన్నప్పటికీ పరీక్షల్లో వైరల్ లోడ్ పెరుగుతున్నట్టు అధికారులు గుర్తించారు. దీనర్థం వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉందని భావించాలని అన్నారు.ఇక పొరుగున ఉన్న సింగపూర్‌లో కోవిడ్ కేసులు పెరుగుతుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. దాదాపు ఏడాది తరువాత అక్కడి ఆరోగ్య శాఖ కోవిడ్ కేసుల సంఖ్యను తాజాగా వెల్లడించింది. మే3తో ముగిసిన వారంలో కేసుల సంఖ్య 14200గా ఉందని, అంతకుముందు వారంతో పోలిస్తే ఇది 28 శాతం ఎక్కువని అధికారులు అన్నారు. ఆసుపత్రుల్లో చేరుతున్న వారి సంఖ్య కూడా 30 శాతం పెరిగిందని చెప్పారు.

## తుర్కియే, చైనా మీడియా సంస్థలపై భారత్ ఆంక్షలు




**న్యూఢిల్లీ,-నవభూమి:**ఆపరేషన్ సిందూర్‌పై పాకిస్థాన్ తప్పుడు ప్రచారానికి వంత పాడుతున్న తుర్కియే, చైనా మీడియా సంస్థల ఎక్స్ ఖాతాలపై భారత్ బుధవారం ఆంక్షలు విధించింది. తుర్కియే ప్రభుత్వ ఆధీనంలోని ప్రసార సంస్థ 'టీఆర్‌టీ వరల్డ్' ఎక్స్ ఖాతాను కేంద్రం నిలిపివేసింది. తుర్కియే డ్రోన్లతో భారత్‌పై పాకిస్థాన్ దాడి చేసిన కొద్దిరోజులకే ఈ చర్య తీసుకోవడం గమనార్హం. అదేసమయంలో చైనా అధికారిక మీడియా సంస్థలైన 'గ్లోబల్ టైమ్స్', 'జిన్హువా' ఎక్స్ ఖాతాలను కూడా కేంద్రం భారత్‌లో నిషేధించింది.ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి తప్పుడు సమాచారాన్ని పోస్టు చేసినందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. ప్రస్తుతం ఈ ఖాతాలను యాక్సెస్ చేయడానికి ప్రయత్నిస్తే "చట్టపరమైన డిమాండ్‌కు ప్రతిస్పందనగా భారత్‌లో మీ ఖాతా నిలిపివేశాం" అనే సందేశం కనిపిస్తోంది.

## భారత్, పాక్ కలిసి డిన్నర్ చేయాలి!



**లండన్-నవభూమి:**భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందానికి తానే కారణమని పదే పదే చెప్పుకొంటున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. మరోసారి ఇదే విషయం చెప్పారు. రెండు అణ్వాయుధ దేశాల మధ్య యుద్ధం రాకుండా తన మధ్యవర్తిత్వం దోహదపడిందని అన్నారు. అయితే ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గాలంటే భారత్, పాకిస్థాన్ కలిసి డిన్నర్ చేయాలని సూచించారు.ప్రస్తుతం సౌదీ అరేబియా పర్యటనలో ఉన్న ట్రంప్.. మంగళవారం రియాధ్‌లో జరిగిన సౌదీ-అమెరికా ఇన్వెస్ట్‌మెంట్ ఫోరం సదస్సు సందర్భంగా మాట్లాడారు. భారత్, పాక్ మధ్య యుద్ధం జరిగి ఉంటే లక్షల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయేవారని, అలాంటిది జరగకూడదనే తాను కోరుకున్నానని తెలిపారు. తనకు తాను శాంతిదూతగా ట్రంప్ చెప్పుకొన్నారు.

## ఎయిర్‌పోర్టుల్లో గ్రౌండ్ హ్యాండ్లింగ్ చేసే.. టర్కీ కంపెనీ క్లియరెన్స్ రద్దు



**న్యూఢిల్లీ-నవభూమి:**పాకిస్థాన్‌కు మద్దతు ఇవ్వడంతోపాటు డ్రోన్లు, ఆయుధాలు సరఫరా చేసిన టర్కీపై భారత్ కఠిన చర్యలు చేపడుతున్నది. దేశంలోని పలు విమానాశ్రయాల్లో గ్రౌండ్ హ్యాండ్లింగ్ సేవలు అందించే టర్కీ సంస్థ సెలెబి ఏవియేషన్ సెక్యూరిటీ క్లియరెన్స్‌ను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జాతీయ భద్రత దృష్ట్యా, సెలెబి ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ భద్రతా అనుమతిని రద్దు చేసినట్లు అందులో పేర్కొంది.కాగా, టర్కీకి చెందిన సెలెబి ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ సంస్థకు గ్రౌండ్ హ్యాండ్లింగ్ ఏజెన్సీ కేటగిరీ కింద 2022 నవంబర్ 21 అనుమతి లభించింది. ఢిల్లీ, ముంబై, చెన్నైతో సహా తొమ్మిది ప్రధాన విమానాశ్రయాలలో కీలకమైన హై సెక్యూరిటీ కార్యకలాపాలకు సెలెబి ఏవియేషన్ బాధ్యత వహిస్తున్నది. గ్రౌండ్ హ్యాండ్లింగ్, కార్గో సర్వీసెస్, ఎయిర్‌సైడ్ ఆపరేషన్స్ వంటి కీలక విధులను ఈ కంపెనీ నిర్వహిస్తున్నది. ఈ కార్యకలాపాలన్నీ జాతీయ భద్రతతో ముడిపడి ఉన్నాయి. ఈ నేపథ్యంలో టర్కీకి చెందిన సెలెబి ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ సంస్థ సెక్యూరిటీ క్లియరెన్స్‌ను భారత్ రద్దు చేసింది.

## పీవోకేపైనే పాక్‌తో చర్చలు.. ఉగ్రవాదం అంతమయ్యే వరకు సింధూ ఒప్పందం నిలిపివేత: జైశంకర్



**న్యూఢిల్లీ:-నవభూమి:**సీమాంతర ఉగ్రవాదాన్ని పాకిస్థాన్ అంతం చేసే వరకు సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తామని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ స్పష్టం చేశారు. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) పైనే ఆ దేశంతో చర్చలు జరుపుతామని అన్నారు. కాల్పుల విరమణ నేపథ్యంలో సింధూ జలాల ఒప్పందం నిలిపివేతను భారత్ పునఃపరిశీలించాలని పాకిస్థాన్ కోరింది. పాక్ జలవనరుల మంత్రిత్వ శాఖ ఈ మేరకు భారత విదేశాంగ శాఖకు లేఖ రాసింది.కాగా, కేంద్ర మంత్రి ఎస్ జైశంకర్ గురువారం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా పాక్ వినతిపై ఆయన స్పందించారు. 'సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేశాం. విశ్వసనీయంగా, తిరిగి మార్చలేని విధంగా సరిహద్దు ఉగ్రవాదాన్ని పాకిస్థాన్ ఆపే వరకు ఈ ఒప్పందం నిలిపివేత కొనసాగుతుంది' అని తెలిపారు.మరోవైపు పాకిస్థాన్‌తో చర్చించాల్సిన ఏకైక అంశం కశ్మీర్‌పైనే అని కేంద్ర మంత్రి ఎస్ జైశంకర్ స్పష్టం చేశారు. 'పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లో చట్టవిరుద్ధంగా ఆక్రమించిన భారత భూభాగాన్ని ఖాళీ చేయాలి. ఆ చర్చకు మేం సిద్ధంగా ఉన్నాం' అని అన్నారు.

### ఐఎంఎఫ్ నుంచి పాకిస్థాన్‌కు లోన్..

# 400 ఆయుధాల కోసమేనా?



**ఇస్లామాబాద్-నవభూమి:**ఇటీవల మన ప్రత్యర్థి దేశమైన పాకిస్థాన్‌కు అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి 2.4 బిలియన్ డాలర్ల (రూ.2,05,21,29,21,120) లోన్ వచ్చింది. ఈ రుణం పాకిస్థాన్ ఆర్థిక స్థితిని మెరుగుపరచడానికి, సంస్కరణలు చేపట్టడానికి ఉద్దేశించినది. కానీ ఈ డబ్బును పాకిస్థాన్ ఉగ్రవాదం లేదా ఆయుధాల కొనుగోలుకు ఉపయోగించవచ్చని పలువురు భావిస్తున్నారు. ముఖ్యంగా, పాకిస్థాన్ ఈ రుణంతో భారత్‌కు సమానమైన రష్యా తయారీ 400 గగనతల రక్షణ వ్యవస్థను కొనుగోలు చేయవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.రుణాలు ఒక దేశం ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడటానికి, ఆర్థిక స్థిరత్వాన్ని సాధించడానికి ఇస్తుంది. ఈ క్రమంలో పాకిస్థాన్ ఆర్థిక పరిస్థితి చాలా కాలంగా ఇబ్బందికరంగా మారింది. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, విదేశీ మారక ద్రవ్య నిల్వల కొరత వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ రుణాన్ని మంజూరు చేసింది. అయితే, ఈ రుణం ఎలా ఖర్చు చేయాలనే దానిపై కఠిన నిబంధనలు విధిస్తుంది. ఈ డబ్బును ఆర్థిక సంస్కరణలు, అవసరమైన రంగాల అభివృద్ధికి ఉపయోగించాలని చెబుతోంది. ఆయుధాల కొనుగోలు లేదా ఇతర సైనిక అవసరాల కోసం ఉపయోగించడం సాధ్యం కాదని నిపుణులు చెబుతున్నారు. ఒకవేళ పాకిస్థాన్ ఈ డబ్బును నిబంధనలకు విరుద్ధంగా ఉపయోగిస్తే, భవిష్యత్తులో రుణాలు పొందడం కష్టమవుతుంది.400 స్పెషల్ ఏంటి రష్యా తయారు చేసిన గగనతల రక్షణ వ్యవస్థలో అత్యంత అధునాతన ఆయుధ వ్యవస్థలలో ఒకటి 400. ఇది శత్రు విమానాలు, క్షిపణులు, డ్రోన్‌లను గుర్తించి నాశనం చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉంది. భారత్ 2018లో రష్యాతో ఒప్పందం కుదుర్చుకొని %ూ%-400 వ్యవస్థలను కొనుగోలు చేసింది. ఇవి ఇప్పుడు దేశ రక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. చైనా కూడా ఈ వ్యవస్థను రష్యా నుంచి కొనుగోలు చేసింది. కానీ భారత్‌కు ఇచ్చిన వ్యవస్థలతో పోలిస్తే చైనాకు ఇచ్చినవి కొన్ని మార్పులతో ఉన్నాయని చెబుతున్నారు. ఈ వ్యవస్థ సాంకేతికత అత్యంత గోప్యమైనదని అంటున్నారు.పాకిస్థాన్ కొంటుందా..పాకిస్థాన్ -400 కొనుగోలు చేయాలనుకుంటే, దానికి రష్యా అంగీకరించాలి. భారత్-రష్యా మధ్య దశాబ్దాలుగా బలమైన రక్షణ సంబంధాలు ఉన్నాయి. భారత్ రష్యా నుంచి యుద్ధ విమానాలు, ట్యాంకులు, క్షిపణులు వంటి అనేక ఆయుధాలను కొనుగోలు చేసింది. ఈ నేపథ్యంలో రష్యా భారత్‌తో సంబంధాలను దెబ్బతీసే విధంగా పాకిస్థాన్‌కు -400 విక్రయించే అవకాశం చాలా తక్కువగా ఉన్నాయి. ఈ క్రమంలో రష్యా అటువంటి నిర్ణయం తీసుకోదని అంటున్నారు. ఎందుకంటే ఇది భారత్‌తో సంబంధాలను దెబ్బతీడమే కాక, రష్యా సాంకేతికత రహస్యాలు పాకిస్థాన్ ద్వారా అమెరికాకు చేరే ప్రమాదం ఉంది. అమెరికాతో పాకిస్థాన్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఒకవేళ -400 సాంకేతికత అమెరికా చేతుల్లోకి వెళ్తే అది రష్యాకు పెద్ద దెబ్బ అవుతుంది.

### ఉద్యోగాలు, చదువులకు సంబంధించి

# నియమాలను మార్చిన బ్రిటన్..



**లండన్-నవభూమి:**చాలా మంది భారతీయులు విదేశాల్లో చదవడానికి, ఉద్యోగం చేయడానికి ఇష్టపడతారు. అందుకోసం వీసాతో పాటు ఆ దేశ నియామాలు కచ్చితంగా పాటిస్తారు. విదేశాల్లో మన భారతీయుల సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. అయితే, తమ దేశంలో విదేశీయుల సంఖ్యను తగ్గించడమే ప్రధాన లక్ష్యంగా బ్రిటన్ ప్రభుత్వం పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఉద్యోగాలు, చదువులకు సంబంధించి ప్రధాన మార్పులు చేసింది. వాటి గురించి వివరంగా ఇప్పుడు తెలుసుకుందాం..బ్రిటిష్ ప్రధాన మంత్రి కీర్ స్టార్మర్ ఇమ్మిగ్రేషన్ నిబంధనలలో పెద్ద మార్పులను ప్రకటించారు. దీని కారణంగా, బ్రిటన్‌లో చదువుకోవడం, పనిచేయడం ఇప్పుడు గతంలో కంటే మరింత కష్టతరంగా మారింది. %ఖఖ% విద్యార్థి వీసా లేదా వర్క్ వీసా పొందడం గురించి ఆలోచించే భారతీయులకు పరిస్థితులు కష్టతరంగా మారాయి. దేశంలో విదేశీయుల సంఖ్యను తగ్గించడమే ఆ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, దీని కారణంగా కొత్త ఇమ్మిగ్రేషన్ నియమాలు ప్రవేశపెట్టారని తెలుస్తోంది.బ్రిటన్‌లో జరిగిన ప్రధాన మార్పులు నైపుణ్యం కలిగిన వర్క్ వీసా పొందేందుకు నిబంధనలలో పెద్ద మార్పు వచ్చింది. ఇప్పుడు డిగ్రీ స్థాయి అర్హత ఉన్న విదేశీ కార్మికులకు మాత్రమే నైపుణ్యం కలిగిన వర్క్ వీసా లభిస్తుంది. %ఖఖ% వెలుపల ఉన్న అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాల నుండి చదువుతున్న విద్యార్థులకు వర్క్ వీసా మంజూరు చేయడానికి కొత్త రూల్స్ ప్రకటించేందుకు ప్రభుత్వం పరిశీలిస్తోంది.గతంలో బ్రిటన్‌లో 'నిరవధిక సెలవు' పొందడానికి దేశంలో ఐదు సంవత్సరాలు నివసించాల్సి ఉండేది. ప్రభుత్వం ఇప్పుడు ఈ కాలాన్ని 10 సంవత్సరాలకు పెంచింది. సరళంగా చెప్పాలంటే, బ్రిటన్‌లో శాశ్వత నివాసం పొందడానికి, దేశంలో 10 సంవత్సరాలు నివసించాలి.బ్రిటన్‌లో చదువుతున్న విద్యార్థులు గ్రాడ్యుయేట్ వీసా పొందుతారు, దీనిని పోస్ట్-స్టడీ వర్క్ వీసా అని కూడా పిలుస్తారు. దీని ద్వారా, విదేశీ విద్యార్థులు గ్రాడ్యుయేషన్ తర్వాత రెండు సంవత్సరాలు దేశంలో పని చేయవచ్చు, ఇది ఇప్పుడు 18 నెలలకు తగ్గించబడింది. ఇంగ్లాండ్‌లోని విశ్వవిద్యాలయాలు విదేశీ విద్యార్థుల ట్యూషన్ ఫీజుల నుండి సంపాదించే ఆదాయంపై 6 శాతం పన్ను విధించాలని కూడా ప్రభుత్వం యోచిస్తోంది. ఈ డబ్బును ఉన్నత విద్య, నైపుణ్య వ్యవస్థ కోసం ఉపయోగిస్తారు.బ్రిటన్ అధికారిక భాష ఇంగ్లీష్. కొత్త నిబంధనల ప్రకారం, అన్ని రకాల వర్క్ వీసాలకు ఇంగ్లీష్ భాషా నిబంధన ఉంటుంది. వీసాదారులు తప్పనిసరిగా ఇంగ్లీష్ తెలుసుకోవాలి. బ్రిటన్‌లో స్థిరపడాలని లేదా వీసా వ్యవధిని పొడిగించాలని ఆలోచిస్తున్న వ్యక్తులు తమ ఇంగ్లీష్ భాషపై పట్టు ఉండాలని ఆ ప్రభుత్వం చెబుతోంది.

### ఎస్-400 లాంట పవర్‌ఫుల్

# గగనతల రక్షణ వ్యవస్థలు ఇవే

**న్యూఢిల్లీ-నవభూమి:**శత్రుదేశాలు ప్రయోగించిన క్షిపణులు, యుద్ధ విమానాలు, డ్రోన్ల వంటి వాటిని తుత్తునియలు చేసే ఆయుధ వ్యవస్థనే ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ లేదా గగనతల రక్షణ వ్యవస్థ అని అంటారు. పాక్ దాడులను దీటుగా తిప్పికొట్టిన 'ఎస్-400' సుదర్శన చక్ర గురించి అందరికీ తెలిసిందే. మరి ప్రపంచంలో ఇలాంటి టాప్ గగనతల రక్షణ వ్యవస్థలు ఏవో ఈ కథనంలో తెలుసుకుందాం.డేవిడ్ స్లింగ్ వ్యవస్థను అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా అభివృద్ధి చేసుకున్నాయి. 300 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలనూ ఇది ధ్వంసం చేయగలదు. 15 కిలోమీటర్ల ఎత్తువరకూ ఉన్న టార్గెట్‌లను నాశనం చేస్తుంది.రష్యాకు చెందిన ఎస్-300వీఎమ్ వ్యవస్థ బాలిస్టిక్ మిసైళ్లు ధ్వంసం చేసేందుకు ఉద్దేశించినది. దీని రేంజ్ 200 కిలోమీటర్లు. 30 కిలోమీటర్ల ఎత్తు నుంచి వస్తున్న క్షిపణులను ధ్వంసం చేస్తుంది.అమెరికాకు చెందిన థాడ్ వ్యవస్థ.. శత్రదేశ క్షిపణులను సమర్థవంతంగా తిప్పికొడుతుంది. 200 కిలోమీటర్ల పరిధిలోని 150 కిలోమీటర్ల ఎత్తు వరకూ ఉన్న అన్ని టార్గెట్స్‌ను ధ్వంసం చేస్తుంది. అమెరికా క్షిపణి విధ్వంసక వ్యవస్థకు ఇది ఎంతో కీలకం.ఇక అమెరికాకు చెందిన మరో గగనతల రక్షణ వ్యవస్థ ఎమ్ఐఎమ్-104 పాట్రియట్ కూడా గొప్ప సామర్థ్యం కలది. యుద్ధ విమానాలు, క్రూయిజ్ మిసైళ్లు, టాక్టికల్ బాలిస్టిక్ మిసైళ్ల నుంచి రక్షణ లభిస్తుంది. దీని రేంజ్ 170 కిలోమీటర్లు. గరిష్ఠంగా 24 కిలోమీటర్ల ఎత్తులోని శత్రుదేశ ఆయుధాలను ఇది ధ్వంసం చేయగలదు.రష్యాకు చెందిన ఎస్-300 స్ఫూర్తితో చైనా హెచ్‌క్యూ-9 గగనతల రక్షణ వ్యవస్థను తయారు చేసింది. దీని రేంజ్ 125 కిలోమీటర్లు. గరిష్ఠంగా 27 కిలోమీటర్ల ఎత్తులోని టార్గెట్‌లను ఇది ధ్వంసం చేయగలదు. యుద్ధ విమానాలు మొదలు క్రూయిజ్ మిసైల్స్ వరకూ అనేక ఆయుధాలను ఇది నాశనం చేస్తుంది.ఫ్రాన్స్, ఇటలీ సంయుక్తంగా ఆస్టర్ 30 ఎస్ఏఎమ్‌పీ/టీ గగనతల రక్షణ వ్యవస్థను రూపొందించాయి. ఇది థియేటర్ లెవెల్ రక్షణ వ్యవస్థ. గరిష్ఠంగా 120 కిలోమీటర్ల దూరంలో 20 కిలోమీటర్ల ఎత్తున ఉన్న యుద్ధ విమానాలు, మిసైళ్లు, డ్రోన్లను ధ్వంసం చేయగలదు.ఎమ్ఈఏడీఎస్ అనేది మధ్యశ్రేణి గగనతల రక్షణ వ్యవస్థ. అమెరికా, జర్మనీ, ఇటలీ సంయుక్తంగా దీన్ని నిర్మించాయి. ఇది గరిష్ఠంగా 70 కిలోమీటర్ల దూరంలో 20 కిలోమీటర్ల ఎత్తున ఉన్న లక్ష్యాలను నాశనం చేస్తుంది. 360 డిగ్రీల రక్షణ కల్పిస్తుంది. రహదారులపై నుంచి కూడా ప్రయోగించేలా దీన్ని సిద్ధం చేశారు.ఇజ్రాయెల్, భారత్ కలిసి రూపొందించిన గగనతల రక్షణ వ్యవస్థ బరాక్-8. ఇది గరిష్ఠంగా 100 కిలోమీటర్ల దూరంలో 20 కిలోమీటర్ల ఎత్తున ఉన్న లక్ష్యాలను ఛేదిస్తుంది. 360 డిగ్రీల రక్షణ కల్పించే ఈ వ్యవస్థతో యుద్ధ విమానాలు, మిసైల్స్, డ్రోన్స్‌ను ధ్వంసం చేయొచ్చు.



## డ్రోన్లే కాదు.. సైనికులనూ పంపిన తుర్కియే!



**న్యూఢిల్లీ-నవభూమి:**భారత్‌పై దాడి చేసేందుకు పాకిస్థాన్‌కు డ్రోన్లను ఇవ్వడంతోపాటు తమ దేశ సైనికులను కూడా తుర్కియే పంపిన విషయం బట్టబయలైంది. ఆపరేషన్ సిందూర్‌లో ఇద్దరు తుర్కియే సైనికులు హతమయ్యారు. భారత్‌పై దాడి చేసేందుకు పాకిస్థాన్‌కు 350కిపైగా డ్రోన్లు ఇచ్చిన తుర్కియే.. సైనికులను కూడా పాకిస్థాన్‌కు పంపినట్టు ఇది నిరూపిస్తోందని అధికార వర్గాలు ఇండియా టుడే టీవీకి తెలిపాయి. ఆ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్‌పై డ్రోన్ దాడులను సమన్వయం చేసుకోవడంలో పాకిస్థాన్ ఆర్మీ అధికారులకు తుర్కియే సలహాదారులు సాయం చేశారు. ఈ నెల 7, 8 తేదీల్లో రాత్రివేళ భారత్‌పైకి 300 నుంచి 400 డ్రోన్లను పాకిస్థాన్ ఆర్మీ ప్రయోగించింది. ఈ డ్రోన్ల శకలాలకు ఫోరెన్సిక్ దర్యాప్తు నిర్వహించగా, అవి తుర్కియేకు చెందిన అసిసగార్డ్ సొంగార్ డ్రోన్లని ప్రాథమికంగా తేలింది. ఈ విషయాన్ని ఆపరేషన్ సిందూర్‌పై మీడియా సమావేశంలో కల్నల్ సోఫియా ఖురేషీ కూడా చెప్పారు. భారత్‌పై దాడికి తుర్కయే సాయం చేయడంపై భారతీయుల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతున్నా తుర్కియే అధ్యక్షుడు రిసెప్ తయ్యిప్ ఎర్డోగన్ వెనక్కి తగ్గడం లేదు. తాజాగా ఆయన బుధవారం పాకిస్థాన్‌కు మద్దతును పునరుద్ఘాటించారు. పాకిస్థాన్‌ను సోదరదేశంగా ఆయన ప్రస్తావించారు. మంచి, చెడ్డ సమయాల్లోనూ పాక్ పక్షాన నిలబడతామని వ్యాఖ్యానించారు. పాకిస్థాన్‌కు బలమైన మద్దతు, అచంచలమైన సంఘీభావం తెలియజేశారంటూ ఎర్డోగన్‌కు ధన్యవాదాలు తెలుపుతూ పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ 'ఎక్స్'లో చేసిన పోస్టుకు స్పందనగా ఎర్డోగన్ ఈ వ్యాఖ్యలు చేశారు.తుర్కియేకు మేం వెళ్లం బాయ్‌కాట్ తుర్కియే, అజర్‌బైజాన్ నిరసన దేశంలో ఊపందుకుంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు మద్దతుగా నిలిచిన ఆ దేశాలపై భారతీయుల ఆగ్రహం కొనసాగుతోంది. పహల్గాం దాడులకు ముందు ఆ రెండు దేశాల్లో పర్యటనలకు సిద్ధపడ్డ భారతీయులు.. ఇప్పుడు ఆ ప్రయాణాలను రద్దు చేసుకుంటున్నారు. ఈ విషయాన్ని సీఎన్ఎన్-న్యూస్ 18 చానల్‌తో మాట్లాడుతూ ఈజ్‌మైట్రిప్ సహ వ్యవస్థాపకుడు ప్రశాంత్ పిట్టి ధ్రువీకరించారు. గతకొద్ది రోజులుగా భారత్ నుంచి పర్యాటక ట్రిప్పులు భారీగా రద్దు అవుతున్నాయని ఆయన తెలిపారు. తుర్కియేకు 22%, అజర్‌బైజాన్‌కు 30శాతానికి పైగా తమ సంస్థ ద్వారా ట్రిప్పులు రద్దు అయ్యాయని చెప్పారు. ఆ రెండు దేశాలతో పాటు చైనాకు కూడా ట్రిప్పులు రద్దు చేసినట్లు ఇక్సిగో సీఈవో అలోకి చెప్పారు.

## 18 వరకే కాల్పుల విరమణ ఒప్పందం: పాక్ విదేశాంగ మంత్రి




**న్యూఢిల్లీ-నవభూమి:**ఇండియా లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్‌ల మధ్య గత బుధవారం హాట్‌లైన్‌లో చర్చలు జరిగాయి. రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం మే 18వరకు మాత్రమే వర్తిస్తుంది. అదే రోజు రెండు దేశాల మధ్య మరో సారి చర్చలు జరుగుతాయి' అని అన్నారు. కొద్ది రోజుల క్రితం పాక్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ అంతర్జాతీయ మీడియా సీఎన్ఎన్‌తో మాట్లాడుతూ.. ' సింధూ జలాల వివాదాన్ని పరిష్కరించకుం టే అది కాల్పుల విరమణ ఒప్పందాన్ని ప్రభావితం చేస్తుంది. ఒకరకంగా అది యుద్ధానికి కాలు దువ్వటమే అవుతుంది' అని అన్నారు.

**ఇండియాతో చర్చలకు సిద్ధం..**పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఇండియాతో చర్చలకు తాము సిద్ధమేనని అన్నారు. రెండు దేశాలు కూర్చుని మాట్లాడుకుని శాంతి ఒప్పందానికి వద్దామని అన్నారు. గురువారం పంజాబ్ ప్రావిన్స్‌లోని కమ్రా ఏయిర్‌బేస్‌లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ' శాంతి ఒప్పందం కోసం ఇండియాతో చర్చలకు సిద్ధంగా ఉన్నాము. కాశ్మీర్ సమస్య గురించి కూడా మాట్లాడదాం' అని అన్నారు. భారత్, పాక్ మధ్య యుద్ధం ముగిసిన తర్వాత ప్రధాని షెహబాజ్ వరుసగా ఏయిర్‌బేస్‌ల దగ్గరకు వెళుతున్నారు. అక్కడి పరిస్థితులను సమీక్షిస్తున్నారు.

## మళ్లీ యుద్ధానికి దిగితే జాగ్రత్త!

### మోదీకి పాక్ ప్రధాని హెచ్చరిక.. ఆపై చర్చలకు ఆహ్వానం

### కశ్మీరు, సింధు జలాలపై మాట్లాడుకుందామని వ్యాఖ్య



**ఇస్లామాబాద్-నవభూమి:** 'ఆపరేషన్ సిందూర్'లో భారత్ చేతిలో చావు దెబ్బ తిన్నా పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ యుద్ధ నినాదాలు చేస్తూనే ఉన్నారు. ఇండియా మరోసారి తమపై యుద్ధానికే దిగితే సర్వస్వం కోల్పోతుందని హెచ్చరించారు. బుధవారం తమ సియాల్‌కోట్ వైమానిక స్థావరానికి వెళ్లి సిబ్బందితో మాట్లాడారు. తాజా ఆపరేషన్‌లో భారత్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి పాక్‌కు చెందిన 11 ఎయిర్‌బేసలను నేలమట్టం చేసినప్పటికీ.. 1971 నాటి ఓటమికి పగతీర్చుకున్నామని షరీఫ్ అనడం గమనార్హం. మోదీ పేరెత్తుతూ యుద్ధానికి సన్నద్ధంగా ఉన్నామని చెప్పారు.మరోసారి తమపై దాడికి దిగితే అన్నీ కోల్పోతారని బెదిరించారు. అయితే యుద్ధానికి, చర్చలకు కూడా తాము సిద్ధమన్నారు. కశ్మీరు మంటను చల్లార్చుదామని.. అదే సమయంలో సింధు జలాల ఒప్పందంపై చర్చిద్దామని ఆహ్వానించారు. 'ఏది ఎంచుకుంటారో ఇక మీ ఇష్టం. సింధు జలాలపై మమ్మల్ని ఆదేశించే ప్రయత్నాలు చేయొద్దు. అదే మనకు లక్ష్మణ రేఖ. ఆ నీటిని మళ్లించాలన్న యోచనే వద్దు. నెత్తురు, నీరు కలిసి ప్రవహించలేవన్నది వాస్తవం' అని ఆయన పేర్కొన్నారు. కాగా.. సింధు జలాల ఒప్పందాన్ని సస్పెండ్ చేస్తూ భారత్ నిర్ణయం తీసుకున్న మూడు వారాల తర్వాత పాక్ అధికారికంగా స్పందించింది. ఈ అంశంపై చర్చలకు సిద్ధంగా ఉన్నామని ఆ దేశ జలవనరుల కార్యదర్శి సయ్యద్ ఆలీ ముర్తాజా భారత జలశక్తి కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీకి లేఖ రాశారు.

### గాజాలో ఇజ్రాయెల్ వైమానిక దాడులు..

**ఖాన్ యూనిస్-నవభూమి:** గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ మరోసారి విరుచుకుపడింది. వైమానిక దాడుల్లో కనీసం 80 మంది పాలస్తీనియన్ల ప్రాణాలు కోల్పోయారని, అనేక మంది గాయపడ్డారని పాలస్తీనా వైద్య వర్గాలు వెల్లడించాయి. దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్ నగరంలో జరిగిన దాడుల్లో మహిళలు, చిన్నారులతో సహా 54 మంది మరణించినట్లు నాసర్ ఆసుపత్రి ఒక ప్రకటనలో తెలిపింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
12 | హైదరాబాద్ శుక్రవారం 16 । మే । 2025

# మాన్షన్ హౌస్ యాడ్‌లో నటించిన బాలకృష్ణ

బాలకృష్ణ 'మాన్షన్ హౌస్' యాడ్ చూశారా!... సినిమా రేంజ్ లో ఎంట్రీ! సోషల్ మీడియాలో బాలయ్య ఫ్యాన్స్‌ను విశేషంగా ఆకట్టుకుంటున్న ప్రోమో
మాన్షన్ హౌస్ డ్రింక్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. టాలీవుడ్ అగ్ర నటుడు నందమూరి బాలకృష్ణ తాజాగా మాన్షన్ హౌస్ యాడ్ లో నటించారు. ఒక్కసారి నేను అడుగుపెడితే (వన్స్ ఐ స్టెప్ ఇన్) అంటూ పవర్ ఫుల్ డైలాగ్ తో బాలయ్య ఎంట్రీ ఇవ్వడం ఈ యాడ్ వీడియోలో చూడొచ్చు.



ఈ యాడ్ ప్రోమో వీడియోను తన యూట్యూబ్ చానల్లో పోస్ట్ చేసిన మాన్షన్ హౌస్... "ఒక ప్రాచీన తాళం చెవి. ఒక అద్భుతమైన సింహాసనం, మరియు అపారమైన శక్తితో కూడిన ఒక లెజెండ్. భారీ స్థాయిలో ఏదో రాబోతోంది! కానీ ఒక్క విషయం మాత్రం నిజం... ఈ సారి స్వాగతం మామూలుగా ఉండదు... సినిమాటిక్ విస్ఫోటనానికి సిద్ధంగా ఉండండి... అది ఎన్ బీకే అభిమాన గృహానికి దారి తీస్తుంది" అంటూ భారీ క్యాప్షన్ ఇచ్చింది.
సోషల్ మీడియాలో అయితే, ఈ మాన్షన్ హౌస్ వీడియో బాలయ్య అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది.



# కేన్స్‌లో మెరిసిన లాపతాలేడీస్



'లాపతా లేడీస్' సినిమాతో ఒక్కసారిగా వెలుగులోకి వచ్చిన యువ నటి నితాన్షి గోయల్, ఇప్పుడు అంతర్జాతీయ వేదికపై తనదైన ముద్ర వేసింది. ప్రతిష్ఠాత్మక కేన్స్ చలనచిత్రోత్సవంలో ఆమె తొలిసారి అడుగుపెట్టి, అందరి దృష్టినీ ఆకర్షించింది. ముఖ్యంగా, భారతీయ సినిమా దిగ్గజాలకు ఆమె అర్పించిన వినూత్న నివాళి ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.
ఈ ఏడాది విడుదలైన విజయవంతమైన చిత్రం 'లాపతా లేడీస్'లో 'ఫూల్' పాత్రలో అద్భుతమైన నటనతో ప్రేక్షకుల మనసు దోచుకున్న 17 ఏళ్ల నితాన్షి, కేన్స్ రెడ్ కార్పెట్‌పై ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఒక సందర్భంలో నలుపు మరియు బంగారు వర్ణాల గౌనులో తళుక్కుమనగా, మరో సందర్భంలో పూసలు, ముత్యాలు పొదిగిన ప్రీ-డ్రేప్డ్ చీరలో మెరిసింది. ఈ చీరకు మల్టీలేయర్డ్ 3%ణ% వర్క్, భారీ పల్లూ అదనపు ఆకర్షణను తీసుకువచ్చాయి. దీనికి జతగా ముత్యాలు పొదిగిన స్ట్రాపీ బ్లౌజ్ ధరించింది. అయితే, అన్నింటికన్నా నితాన్షి హెయిర్‌స్టైల్ ప్రత్యేకంగా నిలిచింది. తన ముత్యాల జడలో అలనాటి బాలీవుడ్ తారలైన మధుబాల, నర్గీస్, మీనా కుమారి, నూతన్, వహీదా రెహ్మాన్, ఆశా పరేఖ్, వైజయంతిమాల, హేమ మాలిని, రేఖ, శ్రీదేవి వంటి పలువురు దిగ్గజ నటీమణుల సూక్ష్మ ఛాయాచిత్రాలతో కూడిన కస్టమ్-మేడ్ హెయిర్ యాక్సెసరీని ధరించింది. హిందీ సినిమాపై చెరగని ముద్ర వేసిన ఈ తారలపై తనకున్న ప్రేమను, గౌరవాన్ని ఈ విధంగా చాటుకోవడం అందరినీ ఆకట్టుకుంది. ఈ ప్రత్యేకమైన డ్రెస్సులు, హెయిర్‌స్టైల్ ఎంపికకు తనకు పెద్దగా సమయం పట్టలేదని నితాన్షి చెప్పింది. తన ఫ్యాషన్ ఐకాన్ ఐశ్వర్య రాయ్ బచ్చన్ అని, కేన్స్‌లో అలియా భట్ అంతటి స్థాయిలో కనిపించాలని తాను కోరుకున్నట్లు ఆమె వెల్లడించింది.
యువనటి ఖాతాలో మరిన్ని రికార్డులు
లోరియల్ ప్యారిస్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ కేన్స్ రెడ్ కార్పెట్‌పై నడిచిన అతి పిన్న వయస్కురాలైన భారతీయ నటిగా నితాన్షి గోయల్ నిలిచింది. అంతేకాకుండా, 'లాపతా లేడీస్' చిత్రానికి గాను ఉత్తమ నటిగా అవార్డు అందుకున్న అతి పిన్న వయస్కురాలిగా కూడా ఆమె రికార్డు సృష్టించింది. సోషల్ మీడియా వేదిక ఇన్‌స్టాగ్రామ్‌లో అత్యధిక ఫాలోవర్లను కలిగిన అతి పిన్న వయస్కురాలైన నటీమణులలో నితాన్షి ఒకరు కావడం విశేషం. కేన్స్‌లో ఆమె ప్రదర్శించిన హుందాతనం, సీనియర్ నటీమణుల పట్ల చూపిన గౌరవం ప్రశంసలు అందుకుంటున్నాయి.

# మండోదరిగా భగవంత్ ఆంటీ క్యాచీ

రణబీర్ 'రామాయణ'లో మండోదరి ఎవరు? రెండు భాగాలుగా రూపొందుతున్న ఈ రామాయణ ఇతిహాసాన్ని హాలీవుడ్ సినిమాలకు ఏమాత్రం తీసిపోని స్థాయిలో అత్యాధునిక సాంకేతికతతో తెరకెక్కిస్తున్నారు. దంగల్ చిత్రంతో ప్రపంచ వ్యాప్తంగా మంచి పేరు తెచ్చుకున్నని దర్శకుడిగా రెండు వేల కోట్ల క్లబ్‌లో చేరిన నితేష్ తివారి ప్రస్తుతం భారతీయ ఇతిహాసం రామాయణాన్ని రామాయణగా తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. స్టోరీ స్క్రీన్‌ప్లే నమిత్‌మల్హోత్రా అందిస్తుండగా, స్టోరీని మాత్రం శ్రీధర్ రాఘవన్ అందిస్తున్నారు. రణబీర్ కపూర్, సాయి పల్లవి సీతారాములుగా నటిస్తున్న ఈ మూవీని నమిత్‌మల్హోత్రా, హీరో యష్ నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా రూపొందుతున్న ఈ రామాయణ ఇతిహాసాన్ని హాలీవుడ్ సినిమాలకు ఏమాత్రం తీసిపోని స్థాయిలో అత్యాధునిక సాంకేతికతతో తెరకెక్కిస్తున్నారు. ఇందులో మొదటి భాగాన్ని 2026 దీపావళికి విడుదల చేయనుండగా, రెండవ భాగాన్ని 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకు తీసుకు రానున్నామని మేకర్స్ ఇటీవల ప్రకటించారు. ఇందులో రావణుడిగా యష్ నటిస్తుండగా హను మంతుడిగా సన్నీ డియోల్ కనిపించనున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం రాకెట్ స్పీడుతో ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ఈ మూవీకి సంబంధించిన ఆసక్తికరమైన వార్త ఒకటి నెట్టింట వైరల్‌గా మారింది. క్రేజీ హీరోయిన్ కాజల్ అగర్వాల్ కూడా ఈ మేగ్నమ్ ఓపస్ లో భాగం అయినట్టుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఇందులో



కాజల్ అగర్వాల్ కీలక పాత్రలో కనిపించనుందని, ఆమె మండోదరిగా నటించనుందని ఇన్ సైడ్ టాక్. యష్ రావణాసుడిగా నటిస్తుండగా అతనికి జోడీగా రావణుడి సతీమణి పాత్రలో మండోదరిగా కాజల్ కనిపించనుందని టాక్ వినిపిస్తోంది. అంతే కాకుండా ఇటీవలే కాజల్‌పై లుక్ టెస్ట్ కూడా జరిగిందని, త్వరలోనే టీమ్ అధికారికంగా ఈ విషయాన్ని ప్రకటించబోతోందని ప్రచారం జరుగుతోంది. ఇదే నిజమైతే రామయణ అనుకున్న దానికి మించి భారీ స్థాయిలో ఉండనుందనే కామెంట్‌లు వినిపిస్తున్నాయి. భారతీయ సినిమాల్లో బడ్జెట్ పరంగా సరికొత్త చరిత్రకు నాందిపలకనున్న ఈ ప్రాజెక్ట్ ఆర్టిస్టల విషయంలోనూ చర్చనీయాంశంగా మారడం కాయం.



# నటనలోనూ కాదు.. హ్యూమానిటీలోనూ..దిశా టాపే

ఉత్తరాఖండ్‌కు చెందిన దిశా పటాని పూరీ జగన్నాథ్ కంట్లో పడి లోఫర్ సినిమాలో నటించింది. నటించింది 15 సినిమాలు లేకపోయినా ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో ఉంటూ యూత్ హృదయాల్ని కొల్లగొడుతోంది. యద అందాలను ప్రదర్శించడానికి ఏ మాత్రం సిగ్గుపడని దిశా పటాని ఫోటోలు ఇన్‌స్ట్రాలో హల్‌చల్ చేస్తున్నాయి. నిజానికి నటిగా ఆమెను లైవ్‌లో ఉంచుతున్నాయనే చెప్పాలి. కల్కిలాంటి పాన్ ఇండియాలో ఛాన్స్ కొట్టిన ఈ అమ్మడు..కల్కి-2లో నటిస్తోందని వినిపిస్తోంది. తక్కువ సమయంలో ఎక్కువ అవకాశాలు పొందిన నటిగా బాలీవుడ్‌లో పేరు తెచ్చుకుంది.దిశా పటాని చాలా స్టైలిష్ కనిపిస్తూ..సింగిల్ పీసులో కూడా అందచందాలను బహిర్గతం చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటోంది మునుపటి తదుపరి దిశా పటాని ఫ్యాషన్ విషయంలో ఏ విధంగానూ ఆపుకోలేని స్థితిలో ఉంది. ఆమె తన ఇటీవలి చిత్రాలలో కూడా అదే చేసింది. ఆమె పొట్టి దుస్తులలో కనిపించింది మరియు నిర్వహించడానికి చాలా స్టైలిష్ గా కనిపించింది. ఆమె అద్దం ముందు నిలబడి సెల్ఫీలు దిగింది. ఈ చిత్రాలు అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాయి. దిశా తన ఫ్యాషన్‌లో ఆపుకోలేని స్థితిలో ఉన్నప్పుడు, ఆమె సోదరి తన యాక్షన్‌లో ఆపుకోలేని స్థితిలో ఉంది. ఇటీవల బరేలీలోని తన ఇంటి సమీపంలో వదిలివేయబడిన ఒక ఆడ శిశువును ఖుష్బూ రక్షించిన తర్వాత దిశా 'రియల్ హీరో'' అని పిలిచింది. మాజీ ఇండియన్ ఆర్మీ మేజర్ ఇప్పుడు ఫిట్నెస్ కోచ్ అయిన ఖుష్బూ ఖాళీ భవనంలో శిశువును కను గొన్నాడు. ఆమె బిడ్డను ఎలా ఎత్తుకుందో ఆమెను జాగ్రత్తగా చూసుకుంటా నని హామీ ఇచ్చింది.


# శోభన్‌బాబు వారసులు ఇండస్ట్రీకి రాకపోవడానికి కారణం?



సోగ్గాడు శోభన్ బాబు ఆయన తరంలో రాజుగా ఏలాడు. టాలీవుడ్ అగ్ర కథానాయకుల్లో ఒకరిగా వెలిగిన శోభన్ బాబు భారీ మహిళా ఫాలోయింగ్ ని సంపాదించుకున్నారు %దీఎ: ౧బజూఘనిఆ ఇవంని ఎ 16 మీుఎ 2025 9:24ూవీ ౹్ఘుతీవ%: సోగ్గాడు శోభన్ బాబు ఆయన తరంలో రాజుగా ఏలాడు. టాలీవుడ్ అగ్ర కథానాయకుల్లో ఒకరిగా వెలిగిన శోభన్ బాబు భారీ మహిళా ఫాలోయింగ్ ని సంపాదించుకున్నారు. ఎన్టీఆర్, కృష్ణ, కృష్ణంరాజు వంటి దిగ్గజ హీరోలతో పాటు, ఆయన తన ఉనికిని దశాబ్దాల పాటు చాటుకున్నారు. ఇద్దరు హీరోయిన్ లతో నారీ నారీ నడుమ రొమాంటిక్ బోయ్ పాత్రలు పోషించడంలో శోభన్ బాబు తర్వాతేనని ప్రూవ్ అయింది. లాయర్ కాబోయి యాక్టర్ అయ్యారు శోభన్ బాబు. అయితే టాలీవుడ్ లో విలన్లు, క్యారెక్టర్ ఆర్టిస్టులు కూడా తమ వారసుల్ని హీరోలుగా పరిచయం చేస్తున్న వేళ శోభన్ బాబు లాంటి అగ్ర కథానాయకుడి కుటుంబం నుంచి ఎవరూ సినీపరిశ్రమకు రాకపోవడం ఆశ్చర్యపరిచింది. ఆయన కుమారుడు కానీ, మనవడు కానీ సినీరంగంలో ప్రవేశించలేదు. కానీ శోభన్ బాబు కుటుంబం నుంచి కొందరు విదేశాల్లో స్థిరపడ్డారని రకరకాల వృత్తుల్లో రాణిస్తున్నారని కథనాలొచ్చాయి. చాలా కాలానికి శోభన్ బాబు మనవడు, కుమార్తె మృధుల కుమారుడు సురక్షిత్ డాక్టర్ వృత్తిలో ఉన్నట్టు పలు మీడియా చానెళ్లు ఇంటర్వ్యూలు వేయడం ఆసక్తిని కలిగించింది. అతడు నటుడు కాకపోవడానికి కారణాలను వెల్లడించాడు. తనకు పదో తరగతిలో ఉండగానే నటనలోకి రావాల్సిందిగా అవకాశాలొచ్చాయని, కానీ ఆసక్తి లేదని తెలిపారు. చాలామంది దర్శకనిర్మాతలు నన్ను సంప్రదించారు. అంతేకాదు తాత శోభన్ బాబును ప్రజలు సోగ్గాడిగా చూస్తారు. సక్సెస్ ఫుల్ హీరోగా మాత్రమే గుర్తుంచుకుంటారు. కానీ ఈ విజయం అంత సులువుగా రాలేదు. ఆయన చాలా స్ట్రగుల్ అయ్యాకే హీరోగా రాణించారు అని డాక్టర్ సురక్షిత్ తెలిపాడు. తాతయ్య కష్టాలన్నిటినీ చూశాము కాబట్టి సినీ రంగంలోకి వెళ్లాలని అనుకోలేదని తెలిపారు.



# నాకూ కొన్ని ఫాంటసీలున్నాయ్



బాలీవుడ్ సూపర్ స్టార్ షారుఖ్ ఖాన్ జీవితంలో ఫాంటసీలు (ఊహలు) ఎంత ముఖ్యమో వివరిస్తూ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ఇవి కేవలం కలలకు మాత్రమే పరిమితం కావని, మానవ అనుభవంలో ఒక కీలకమైన అంశమని ఆయన అభిప్రాయపడ్డారు. ఫాంటసీలు అనేవి ఒక వ్యక్తి యొక్క ఊహాశక్తికి సంపూర్ణమైన, చైతన్యవంతమైన వ్యక్తీకరణ అని, అవి ఆత్మకు నూతనోత్తేజాన్ని అందిస్తాయని ఆయన పేర్కొన్నారు. వయసుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరి జీవితంలో ఫాంటసీలు ఉంటాయని, అవి కాలాతీతమైనవని, సార్వత్రికమైనవని షారుఖ్ తెలిపారు.షారుఖ్ ఖాన్ సన్నిహితురాలు, ప్రముఖ ఫిల్మ్‌మేకర్ ఫరా ఖాన్, కింగ్ ఖాన్ ఫాంటసీల గురించి మాట్లాడుతున్న ఒక వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. ఈ క్లిప్‌ను షేర్ చేస్తూ ఫరా ఖాన్, "షారుఖ్, నేను నిన్ను ఫాంటసీ గురించి నీ అభిప్రాయం ఏంటి అని మాత్రమే అడిగాను. నువ్వేమో ఫాంటసీ మీద సినిమానే చేసేశావు" అని సరదాగా రాసుకొచ్చారు. ఈ వీడియోలో, 'పఠాన్' నటుడు తనకు కూడా కొన్ని ఫాంటసీలు ఉన్నాయని, అవి సృజనాత్మకతను, అభిరుచిని సజీవంగా ఉంచడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని పంచుకున్నారు.
ఓ బిస్కెట్ వాణిజ్య ప్రకటనలో భాగంగా రూపొందించిన ఈ వీడియోలో షారుఖ్ ఇలా అన్నారు... "ఫాంటసీ, ఫాంటసీ గురించి మీరేమనుకుంటున్నారు? నా అభిప్రాయం ప్రకారం, ఫాంటసీ అనేది కలల కంటే ఒక అడుగు ముందుంటుంది. ఫాంటసీ దానంతట అదే నృత్యం చేస్తుంది. కలలు అసంపూర్ణమైనవి, ఫాంటసీ సంపూర్ణమైనది. జీవించడానికి దాన్ని వినండి మిత్రమా. ఫాంటసీ అవసరం. ఫాంటసీకి వయసు లేదు, జీవిత దశ లేదు. ప్రతి వ్యక్తికీ ఫాంటసీపై హక్కు ఉంటుంది. నాక్కూడా కొన్ని ఫాంటసీలున్నాయి" అని చెప్పారు.

# సునీల్ గవాస్కర్‌కు అరుదైన గౌరవం.. బీసీసీఐ కార్యాలయంలో ప్రత్యేక బోర్డ్ రూమ్



**ముంబై-నవభూమి:** భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్‌కు అరుదైన గౌరవం దక్కింది. భారత క్రికెట్‌కు విశేష సేవలందించిన లిటిల్ మాస్టర్ కోసం బీసీసీఐ ప్రత్యేక బోర్డు రూమ్‌ను ఏర్పాటు చేసింది. ముంబయిలోని ప్రధాన కార్యాలయంలో '10,000 గవాస్కర్' పేరిట బోర్డ్ రూమ్‌ను గురువారం బీసీసీఐ ప్రారంభించింది. ఆ వీడియోను క్రికెట్ బోర్డు ఎక్స్ (గతంలో ట్విట్టర్) వేదికగా షేర్ చేసింది.
టెస్టుల్లో పదివేల పరుగులు చేసిన మొదటి భారత క్రికెటర్ అయిన గవాస్కర్ గౌరవార్థం ఈ గదిని ఏర్పాటు చేశామని ఈ సందర్భంగా బీసీసీఐ పేర్కొంది. గదినిండా గవాస్కర్ ఫొటోలు, అతడి కాలంలో భారత జట్టు సాధించిన ట్రోఫీలను పొందుపరిచింది. ఈ సందర్భంగా సన్నీ భావోద్వేగానికి లోనయ్యాడు."ముంబై క్రికెట్ అసోసియేషన్ నాకు తల్లితో సమానం. ఇక బీసీసీఐ అయితే తండ్రి లెక్క. ఈ గౌరవానికి ప్రత్యేక ధన్యవాదాలు. భారత్‌కు ఆడే అవకాశం వచ్చినందుకు.. నన్ను ఈ స్థాయికి చేర్చినందుకు భారత క్రికెట్‌కు ఎప్పటికీ రుణపడి ఉంటాను. ఇది నాకు చాలా పెద్ద గౌరవం. ఈ సందర్భంగా బీసీసీఐకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. నా వంతుగా బీసీసీఐ, భారత క్రికెట్ కోసం ఏదైనా చేయాలనుకుంటున్నా" అని గవాస్కర్ వెల్లడించాడు. కాగా, ఈ బ్యాటింగ్ లెజెండ్ 10,000 టెస్ట్ పరుగులు చేసిన తొలి భారత బ్యాట్స్‌మన్. అతను 125 టెస్ట్‌ల్లో 51 కంటే ఎక్కువ సగటుతో 10,122 పరుగులతో తన కెరీర్‌ను ముగించాడు. ఇందులో 34 సెంచరీలు ఉన్నాయి. అలాగే సన్నీ 108 వన్డేల్లో 3092 పరుగులు చేశాడు.

# క్రీడాకారుల్లో అందరి కంటే రిచ్ ఇతడే!



**దుబాయ్-నవభూమి:** ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం, పోర్చుగల్ స్టార్ ఆటగాడు క్రిస్టియానో రొనాల్డో మరోసారి ప్రపంచంలోనే అత్యంత సంపన్న క్రీడాకారుడిగా నిలిచాడు. ప్రఖ్యాత ఫోర్బ్స్ పత్రిక తాజాగా విడుదల చేసిన 2025 సంవత్సరానికి గాను ప్రపంచంలోనే అత్యధిక పారితోషికం అందుకుంటున్న క్రీడాకారుల జాబితాలో రొనాల్డో అగ్రస్థానంలో నిలిచాడు. గత ఏడాది కాలంలో రొనాల్డో ఏకంగా 275 మిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో సుమారు 2295 కోట్ల రూపాయలు) ఆర్జించినట్లు ఫోర్బ్స్ తన నివేదికలో వెల్లడించింది. ఇది ఫోర్బ్స్ చరిత్రలోనే ఒక క్రీడాకారుడు ఆర్జించిన మూడో అత్యధిక వార్షిక మొత్తం కావడం గమనార్హం.సౌదీ ప్రో లీగ్‌లో అల్ నాసర్ క్లబ్‌కు ప్రాతినిధ్యం వహించడం ద్వారా రొనాల్డోకు భారీ ఆదాయం లభించింది.. ఇటాలియన్ క్లబ్ జువెంటస్ నుంచి అల్ నాసర్‌కు మారిన తర్వాత, అతడి వార్షిక వేతనం 200 మిలియన్ డాలర్లకు పైగా ఉంటుందని అంచనా. మైదానంలో ఆటతో పాటు, మైదానం వెలుపల కూడా రొనాల్డో వాణిజ్యపరంగా దూసుకుపోతున్నాడు.

# జూన్ 6న ఇంగ్లండ్‌కు పయనం కానున్న టీమిండియా తొలి బ్యాచ్!

**లండన్-నవభూమి:** ఇంగ్లండ్ గడ్డపై జరగబోయే కీలక టెస్ట్ సిరీస్ కోసం బీసీసీఐ ఇప్పటి నుంచే ప్రణాళికలు రచిస్తోంది. కొందరు ఆటగాళ్లను ముందుగానే ఇంగ్లండ్ కు పంపుతోంది. భారత జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, కొందరు ఆటగాళ్లతో కూడిన తొలి బృందం జూన్ 6వ తేదీన ఇంగ్లండ్‌కు బయలుదేరి వెళ్లనున్నట్లు తెలుస్తోంది. మిగిలిన ఆటగాళ్ల ప్రయాణం, ఐపీఎల్ 2025 షెడ్యూల్‌ను బట్టి ఖరారు కానుంది. భారత టెస్ట్ జట్టు సభ్యుల ఎంపిక ఇంకా జరగనప్పటికీ, ఆటగాళ్లు మరియు సహాయక సిబ్బంది ప్రయాణ షెడ్యూల్‌ను బీసీసీఐ ఖరారు చేసే పనిలో నిమగ్నమైంది. "ఐపీఎల్ లీగ్ దశ ముగిసిన వెంటనే అందుబాటులోకి వచ్చే ఆటగాళ్లు, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌తో పాటు జూన్ 6న ఇంగ్లండ్‌కు పయనం కానున్నారు. మిగిలిన వారు ఐపీఎల్ కమిట్‌మెంట్స్ పూర్తయిన తర్వాత కొద్దిపాటి విరామం తీసుకుని బయలుదేరుతారు" అని ఓ సీనియర్ బీసీసీఐ అధికారి వెల్లడించారు.ప్రధానంగా టెస్ట్ జట్టు సన్నద్ధతపైనే గౌతమ్ గంభీర్ దృష్టి సారించనున్నారు. ప్రస్తుతం భారత జట్టు సహాయక సిబ్బందిలో చాలా మంది దేశంలో అందుబాటులో లేకపోవడంతో, వారు నేరుగా ఇంగ్లండ్‌లోనే జట్టుతో చేరే అవకాశాలు ఉన్నాయని సమాచారం. టెస్ట్ జట్టును అధికారికంగా ప్రకటించిన వెంటనే ఆటగాళ్లు, సహాయక సిబ్బందికి తుది ప్రయాణ వివరాలను తెలియజేయనున్నారు.
మరోవైపు, ఇండియా 'ఏ' జట్టు కూడా ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనుంది.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**